మాసపత్రిక గత వారం రోజుల్లో టెలిస్కోప్
ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
విజయవాడ

సంబరాల జీవితం సౌభాగ్యాల సౌరభం
KAPIL GROUP
కపిల్ చిట్స్
Visit Us: www.kapilchits.com
కపిల్ చిట్స్ మీ కలలకు సాకారం

: fb.com/vaartha Digital

Published from Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

17-12-2025 బుధవారం సంపుటి: 31 సంచిక: 316 పేజీలు: 10+4 వెల: 6.50

# భారీగా కొత్త కానిస్టేబుళ్లు



మంగళవారం విశాఖలో తొలి ఏవియేషన్ ఎడ్యుకేషన్ సిటీ ఏర్పాటు ఒప్పంద కార్యక్రమంలో కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు, గోవా గవర్నర్ అశోక్ గజపతి రాజు, మంత్రి నారా లోకేష్

## విశాఖలో ఏవియేషన్ ఎడ్యుకేషన్ సిటీ

**మంత్రి నారా లోకేష్ సమక్షంలో జిఎంఆర్ గ్రూపు, మాన్సాస్ ట్రస్టు ఒప్పందం**

**హాజరైన గోవా గవర్నర్ అశోక్ గజపతిరాజు, కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు**

**విజయవాడ,డిసెంబరు 16,ప్రభాతవార్త ప్రతినిధి:** విశాఖనుఐటీకారిడార్‌గా తీర్చిదిద్దేందుకు కూటమి ప్రభుత్వం కంకణం కట్టుకున్నదని మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేష్ తెలిపారు. ప్రభుత్వం అంతర్జాతీయ విమానాశ్రయం నిర్మిస్తున్న భోగాపురం ప్రాంతాన్ని తొలి ఇంటిగ్రేటెడ్ ఎడ్యుకేషన్, ఇన్నోవేషన్ హబ్‌గా నిలపనుంది. దీనిలో భాగంగా విజయనగరం-విశాఖపట్నం సరిహద్దుల్లో దేశంలోనే తొలి >>2

**ట్రైనీ కానిస్టేబుళ్లకు స్టైపెండ్ రూ.12,500కు పెంపు**

**రాజకీయ ముసుగులో నేరాలు చేసే వారిపట్ల జాగ్రత్త**

**నూతన కానిస్టేబుళ్ల నియామక పత్రాల పంపిణీ కార్యక్రమంలో సిఎం చంద్రబాబు**

**ఎంపికైన 5,757 మందికి నియామక పత్రాలు అందించిన సిఎం, డిప్యూటీ సిఎం**



మంగళవారం మంగళగిరిలో కానిస్టేబుళ్ల నియామక పత్రాలు అందజేస్తున్న సిఎం చంద్రబాబు. చిత్రంలో డి.సిఎం పవన్ కల్యాణ్, హోంమంత్రి అనిత ఉన్నారు

**విజయవాడ, డిసెంబరు 16 ప్రభాతవార్త ప్రతినిధి:** శాంతిభద్రతల విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని, ప్రజా భద్రతకే కూటమి ప్రభుత్వ తొలి ప్రాధాన్యత ఇస్తోందని సిఎం చంద్రబాబు స్పష్టం చేశారు. పోలీసుల గౌరవాన్ని పెంచేబాధ్యత ప్రభుత్వం తీసుకుంటుందని, ప్రజలకు రక్షణ ఇచ్చే బాధ్యత పోలీసులదని అన్నారు. పోలీసింగ్‌లో ప్రిడిక్షన్, ప్రివెన్షన్, ప్రొటెక్షన్ విధానాన్ని అవలంభించాలని, రాజకీయ ముసుగులో నేరాలు చేసే వారి పట్ల పోలీసులు అప్రమత్తంగా ఉండాలని సిఎం సూచించారు. మంగళగిరి ఏపీఎస్పీ 6 బెటాలియన్ పరేడ్ గ్రౌండ్‌లో కానిస్టేబుళ్ల నియామక పత్రాల పంపిణీ కార్యక్రమానికి సీఎం చంద్రబాబు హాజరయ్యారు. డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్, హోం మంత్రి అనితతో కలిసి కానిస్టేబుళ్లుగా ఎంపికైన 5,757 మంది అభ్యర్థులకు నియామక పత్రాలను అందజేశారు. కొత్తగా విధుల్లో చేరినవారు నిబద్ధతతో పనిచేయాలని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు.
అలాగే శిక్షణలో ఉన్న కానిస్టేబుళ్లకు స్టైపెండ్ రూ.12,500కు పెంచుతున్నట్టు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబుమాట్లాడుతూ.. "గత ప్రభుత్వ అసమర్థపాలనతోరాష్ట్రం తీవ్రంగా నష్టపోయింది. రాష్ట్రాన్ని పునర్నిర్మించి, యువ >>2

**ఖాకీ దుస్తుల గౌరవాన్ని కానిస్టేబుళ్లు నిలబెట్టాలి** 7లో

**మా నాన్న కానిస్టేబుల్‌గానే మాకు ఈ జీవితాన్ని ఇచ్చాడు: డి.సిఎం పవన్**

**గాంధీ ఉపాధి పథకానికి చెల్లు చీటీ!**

**మంటల్లో బస్సులు దగ్ధం: 13 మంది మృతి**

**కోల్‌కతా మెస్సీ ఘటన: క్రీడామంత్రి రాజీనామా**

**నేషనల్ హెరాల్డ్ కేసులో సోనియా రాహుల్‌కు ఊరట** 5లో

## తిరుపతిలో ఇంటెగ్రేటెడ్ టౌన్‌షిప్

**తిరుమలలో రహదారులు, ప్రధాన కూడళ్లకు భక్తాగ్రేసరుల పేర్లు**

**టిటిడి అర్చకులు, పరిచారకుల వేతనాలు పెంపు**

**ముంబై బాంద్రాలో రూ.14.40కోట్లతో శ్రీవారి ఆలయం: టిటిడి బోర్డు నిర్ణయాలు**

**తిరుమల,డిసెంబర్ 16ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల విజన్ 2047 కార్యరూపం దాల్చేందుకు ధార్మిక సంస్థ తిరుమల తిరుపతి దేవస్థానం భక్తులకు వసతి సౌకర్యాల పెంపుపై "ఇంటెగ్రేటెడ్ టౌన్‌షిప్"పేరుతో తిరుపతిలో మెరుగైన సదుపాయాలు కల్పించేందుకు నిర్ణయించింది. ఇందుకు కార్యాచరణ రూపొందించారు. తిరుపతి అలిపిరి వద్ద 20 ఎకరాల్లో ఇంటెగ్రేటెడ్ టౌన్‌షిప్ నిర్మించాలని భావించారు. ఇక్కడే భక్తులకు వసతితో బాటు టిక్కెట్ కౌంటర్లు, అన్నప్రసాదాలు పంపిణీ చేయాలని నిర్ణయించారు. దేశవిదేశాల నుండి తిరుమలకు వస్తున్న భక్తుల సంఖ్య అనూహ్యంగా పెరుగుతుండటంతో వసతికి అవస్థలు తప్పడంలేదు. ఈ నేపథ్యంలో అలిపిరి వద్ద ఇంటిగ్రేటెడ్ టౌన్‌షిప్ ఏర్పాటుచేయాలని మంగళవారం టిటిడి ధర్మకర్తలమండలి ఆమోదించింది.
తిరుమల అన్నమయ్య భవనంలో మంగళవారం టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు అధ్యక్షతన >>2

**ధ్వజస్తంభం కోసం పవిత్ర వృక్షాల వనం** 2లో




## పరకామణిలో నేరం చోరీ కంటే పెద్దది

**టిటిడి నిర్వహణలో ఎఐ ఉపయోగించండి: హైకోర్టు కీలక వ్యాఖ్యలు**

**విజయవాడ,డిసెంబరు 16,ప్రభాతవార్తప్రతినిధి:** టిటిడి పరకామణిలో జరిగిన నేరం, దొంగతనం కంటే పెద్దదని హైకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. భక్తుల మనోభావాలు దెబ్బతినకుండా చూడాలని సూచించింది. బాధ్యతారాహిత్యంతోనే పరకామణి చోరీ ఘటన జరిగిందన్న హైకోర్టు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగికి బాధ్యత ఉండదని అభిప్రాయం వ్యక్తం చేసింది. టిటిడిలో ఔట్‌సోర్సింగ్ నియామకాలు సరికాదన్న న్యాయస్థానం విరాళాల లెక్కింపు వద్ద టేబుళ్లు ఏర్పాటు చేయాలని ఆదేశించింది. విరాళాల లెక్కింపు కోసం భక్తులను ఎందుకు తీసుకోకూడదని న్యాయస్థానం ప్రశ్నించింది. టిటిడి నిర్వహణలో ఎఐని ఉపయోగించాలని హైకోర్టు సూచించింది. తిరుమల తిరుపతి దేవస్థానంలో జరిగిన హుండీ కానుకల లెక్కింపు కేంద్రం పరకామణిలో దొంగతనం కేసు విచార >>2





సిఆర్‌డిఏ భవనంలో ఏర్పాటు చేసిన బుద్ధుని బొమ్మ

## ఆకట్టుకున్న సిఆర్డీఏ భవనంలోని బుద్ధుని బొమ్మ

**విజయవాడ,డిసెంబరు 16,ప్రభాతవార్తప్రతినిధి:**రాజధాని అమరావతి లోని సీఆర్డీఏ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటుచేసిన బుద్ధుడి విగ్రహమిది. విగ్రహాన్ని ముందు,వెనుకగా సరళరేఖ మార్గంలో చూస్తూ అక్కడేమీ కనిపించదు. కాస్త పక్కకు జరిగి చూస్తే అక్కడో చక్కటి బుద్ధుడి విగ్రహం కనువిందు చేస్తుంది. పల్చటి స్టెయిన్‌లెస్ స్టీల్ రేకులను పొందికగా అమర్చితే ఈ కళాఖండం ఏర్పడింది. కార్యాలయం ఎదురుగా స్వాగతం పలుకుతున్న ఈ ప్రతిమ సందర్శకులను ఆకట్టుకుంటోంది.

# ఏవియేషన్ ఎడ్యుకేషన్ సిటీ

>> ఏవియేషన్ ఎడ్యుకేషన్ సిటీ ఏర్పాటు చేయనుంది. విశాఖలో మరో ప్రతిష్టాత్మక సంస్థ ఏర్పాటుకు నాంది పడింది. దేశంలోనే తొలి ఏవియేషన్ ఎడ్యు సిటీకి జిఎంఆర్ గ్రూప్, మాన్సాస్ ట్రస్ట్ ఒప్పందం చేసుకున్నాయి. ఇది రాడిసన్ బ్లూ రిసార్టులో రాష్ట్ర మంత్రి లోకేష్ సమక్షంలో జరిగింది. విశాఖ వేదికగా జరిగిన ఈ కార్యక్రమంలో గోవా గవర్నర్ అశోక్‌గజపతి రాజు, కేంద్రమంత్రి రామ్మోహనాయుడు, శాసనసభాపతి అయ్యన్నపాత్రుడు, ఐటీ, విద్యాశాఖ మంత్రి లోకేష్ పాల్గొన్నారు. రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో ప్రథమస్థానంలో ఉంచే బాధ్యత మాదని లోకేష్ చెప్పారు. ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు కల్పించాలనేది మా లక్ష్యమని స్పష్టం చేశారు. 99 పైసలకు భూములిస్తామంటే చాలామంది ఎగతాళి చేశారని ఆ నిర్ణయంతో కాగ్నిజెంట్, టిసిఎస్ వచ్చాయని వంద రోజుల్లో కనీసం మరో రెండు ఐటీ కంపెనీలు తీసుకొస్తామని చెప్పారు.

భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయాన్ని అందంగా సిద్ధం చేస్తున్నామని కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు అన్నారు. వచ్చే నెలలో ట్రయల్ రన్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రాజెక్టు ప్రారంభ కార్యక్రమంలో రామ్మోహన్‌నాయుడు మాట్లాడుతూ వచ్చే ఏడాది జూన్ నాటికి ఎయిర్‌పోర్టును ప్రారంభించాలనుకున్నామని కానీ ఒక నెల ముందుగానే అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. ఎడ్యుసిటీ ఉంటే ఎన్నో విద్యాలయాలు, యూనివర్సిటీలు పెట్టుకోవచ్చన్నారు. ఏవియేషన్ రంగంలో శిక్షణ ఇచ్చేందుకు ఇది ఉపకరిస్తుందన్నారు,.

**జిఎంఆర్ మాన్సాస్ ఎడ్యు సిటీ**

అంతర్జాతీయ విమానాశ్రయం నిర్మిస్తున్న భోగాపురం ప్రాంతాన్ని తొలి ఇంటిగ్రేటెడ్ ఎడ్యుకేషన్, ఇన్నోవేషన్ హబ్‌గా ప్రభుత్వం నిలపనుంది. దీనిలో భాగంగా విజయనగరంవిశాఖపట్నం సరిహద్దుల్లో దేశంలోనే తొలి ఏవియేషన్ ఎడ్యుకేషన్ సిటీ ఏర్పాటు చేయనుంది. ఈ ఏవియేషన్ వర్సిటీ రాకతో ఇంటర్నేషనల్ శిక్షణ పొందవచ్చని విజయనగరం ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి అన్నారు. ఇలాంటి గొప్ప సాంకేతిక విద్యాసంస్థ మన ప్రాంతానికి రావడం ఎంతో సంతోషమని తెలిపారు. గంటా శ్రీనివాసరావు మాట్లాడుతూ అవకాశాలు అందిపుచ్చుకోవడంలో సీఎం ముందుంటారన్నారు.

భోగాపురం ఎయిర్‌పోర్టు మూలకేంద్రంగా యూనివర్సిటీ పని చేస్తుందని వివరించారు. ఇటీవలే విశాఖలో 9 ఐటీ కంపెనీలకు శంకుస్థాపనలు జరిగాయన్నారు. సభాపతి అయ్యన్నపాత్రుడు ఉత్తరాంధ్రకు మహర్దశ పట్టిందన్నారు. ఎన్టీఆర్ హయాంలో ఉత్తరాంధ్రకు గుర్తింపు వచ్చిందని, నేడు మళ్లీ చంద్రబాబు హయాంలో అభివృద్ధి వచ్చిందని ఆయన అన్నారు. దేశంలోని తొలిసారి ఏవియేషన్ శిక్షణ కేంద్రం మొదలవుతోందన్నారు. ఏవియేషన్ రంగంలో నైపుణ్యం ఉన్నవారి కొరత ఉందని, కేవలం మన దేశంలోనే కాదు ఇతర దేశాల్లోనూ మంచి ఉపాధి అవకాశాలున్నాయని జివిఎస్ రాజు పేర్కొన్నారు.

# భారీగా కొత్త కానిస్టేబుళ్లు

>> తకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నాం. మీకు ఉద్యోగం వస్తే నాకు, మిత్రులు పవన్ కల్యాణ్‌కు మంచి పేరు వస్తుందని 31 కేసులు వేశారు. వాటిని అధిగమించాం. కోర్టు కేసులు పరిష్కరించి నియాకమ పత్రాలను అందించాం. 6100 మంది రిక్రూట్మెంట్ కోసం నోటిఫికేషన్ ఇస్తే అందులో 6014 మంది సెలక్ట్ అయ్యారు. ఇందులో 5757 మంది ట్రైనింగ్‌కు ఎంపిక అయ్యారు. వీరిలో సివిల్ కానిస్టేబుళ్లుగా 3,343 మంది, ఏపీఎస్పీ కానిస్టేబుళ్లుగా 2,414 మంది ఎంపికయ్యారు. సివిల్‌లో మహిళా కానిస్టేబుళ్లు 993 మంది ఉన్నారు. మగవారికి ఏ విషయంలోనూ మహిళలు తీసి పోకూడదనే ఉద్దేశంతో గతంలోనే ఉద్యోగాల్లో 33 శాతం రిజర్వేషన్లు అమలు చేశాను. ఆర్టీసీలో మహిళలను కండెక్టర్లుగా నియమించాం. అలాగే ఉమ్మడి శ్రీకాకుళం, విశాఖ, తూర్పుగోదావరి జిల్లాల్లో 183 మంది ఆదివాసీ అభ్యర్థులు ఎంపిక కావడం గర్వంగా ఉందని సిఎం చంద్రబాబు అన్నారు. శిక్షణలో ఉన్న కానిస్టేబుళ్లకు స్టైపెండ్ ను రూ.12,500కు పెంచుతున్నట్టు ముఖ్యమంత్రి చంద్రబాబు సభా వేదిక నుంచి ప్రకటించారు.

**పారదర్శకంగా కానిస్టేబుళ్ల నియామక ప్రక్రియ**

“గత ప్రభుత్వం నిరుద్యోగ యువతను మభ్య పెట్టడానికి మొక్కుబడిగా నోటిఫికేషన్ ఇచ్చింది. కూటమి ప్రభుత్వం రికార్డ్ టైమ్‌లోనే పరీక్షలు, రిక్రూట్మెంట్ ప్రక్రియ నిర్వహించి 60 రోజుల్లోనే ఫలితాలు ప్రకటించింది. అవినీతికి తావు లేకుండా పారదర్శకంగా నిర్వహించాం. నియామకాల్లో టెక్నాలజీ సాయాన్ని తీసుకున్నాం. మానవ జోక్యం అనేది లేకుండా అన్ని ఫిజికల్ ఈవెంట్స్‌లో టెక్నాలజీని వినియోగించాం. డిజిటల్ మీటర్లతో ఎత్తు, ఛాతీ కొలతలు తీసుకున్నాం. లైవ్‌గా రికార్డ్ చేసి సర్వర్లలో భద్రపరిచాం. ఆర్‌ఎఫ్ ఐడీ చిప్‌లతో 100 మీటర్లు, 1600 మీటర్ల పరుగులు, లాంగ్ జంప్ పరీక్షలు నిర్వహించాం. కానిస్టేబుళ్ల ఉద్యోగాలకు ఎంపికైన ఒక్కొక్కరిది ఒక్కో గాథ. వారికి విద్యను, విలువల్ని నేర్పిన వారి తల్లితండ్రులకు అభినందనలు తెలియచేస్తున్నాను. కానిస్టేబుల్‌గా ఎంపికైన గిరిజన యువకుడు బాబూరావు తన సొంత గ్రామానికి రహదారి వేయాలని సామాజిక హితం కోసం కోరారు. దీనికి ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ రియల్ టైమ్ లోనే అనుమతులను, నిధుల్ని మంజూరు చేయించారు. అల్లూరి జిల్లా జీకేవీధిలోని వెలుగురాతిబండ తిమ్మల బండ గ్రామానికి రోడ్డు నిర్మించేందుకు రూ.3.90 కోట్లు మంజూరు చేయడం ప్రజా సంక్షేమం పట్ల కూటమి ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమని సిఎం చంద్రబాబు అన్నారు. ఉద్యోగాలు రావాలంటే ఎన్డీఏ రావాలని ప్రజలు ఆకాంక్షించి మమ్మల్ని గెలిపించారు. నేను ముఖ్యమంత్రిగా ఇప్పటివరకూ పోలీస్ శాఖలో 23,676 ఉద్యోగాలు ఇచ్చాను. రాష్ట్రంలో 58 వేల మంది కానిస్టేబుళ్లు ఉండగా వారిలో 24 వేల మందికి ఉద్యోగాలు ఇచ్చినందుకు గర్వ పడుతున్నాను. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు 20 లక్షల ఉద్యోగాల కల్పనకు కట్టుబడి ఉన్నాం. ఇప్పటికే మెగా డీఎస్సీ ద్వారా 15,591 ఉద్యోగాలు ఇచ్చాం. అన్ని శాఖల్లో కలిపి 4 లక్షల మందికి ఉద్యోగాలు వచ్చాయి. 18 నెలల పాలనలో రూ. 8.5 లక్షల పెట్టుబడులకు ఆమోదం ఇచ్చాం. విశాఖలో 538 ఎంఓయూలు చేస్తే రూ.11.38 లక్షల కోట్ల పెట్టుబడులు వస్తున్నాయి. 735 పరిశ్రమలు, రూ.19 లక్షల కోట్ల పెట్టుబడులు రాష్ట్రానికి వస్తున్నాయి” అని ముఖ్యమంత్రి తెలిపారు.

**నేరాల నియంత్రణకు పిపిపి విధానం**

కూటమి ప్రభుత్వం వచ్చాక సమర్థవంతమైన పోలీస్ వ్యవస్థకు శ్రీకారం చుట్టాం. విజిబుల్ పోలీసింగ్ -ఇన్విజిబుల్ పోలీస్ విధానంతో ముందుకు వెళుతున్నాం. నేరాల నియంత్రణలో పోలీసులు టెక్నాలజీని వాడాలి. అప్పుడే క్రిమినల్స్ ఆటలు కట్టించవచ్చు. నేరాలను తగ్గించేందుకు అవసరమైన ప్రణాళికలు అమలు చేయాలి. ముందు జాగ్రత్తల ద్వారా, అప్రమత్తత ద్వారా నేరాలను తగ్గించవచ్చు. డాటా, టెక్నాలజీ ద్వారా నేరాలను నియంత్రించే అవకాశం రావాలి. నేరం జరిగిన వెంటనే మీరు వేగంగా స్పందించాలి. ఒకప్పుడు నేరస్తులు రాజకీయాల్లో ఉండేవారు కాదు. నేడు రాజకీయ ముసుగులో నేరాలు చేసే వాళ్లు తయారు అయ్యారు. రాష్ట్రంలో లేడీ డాన్లను కూడా చూసే పరిస్థితి వచ్చింది. గత పాలనలో శాంతిభద్రతలు ఎంతగా దిగజారాయో ఇది ప్రత్యక్ష ఉదాహరణ. వివేకా హత్య కేసులో నాపై ఆరోపణలు చేశారు. గుండె పోటు అని చెప్పి ముఖ్యమంత్రిగా నన్నే ఏమార్చారు. గదిలో రక్తపు మరకలు కడిగించినా సిఐ ఉన్నతాధికారులకు చెప్పలేదు. కానీ సిబిఐ తన దర్యాప్తులో గూగుల్ టేకవుట్ వంటి సాంకేతిక విధానాలను వినియోగించడం ద్వారా వాస్తవాలు వెలుగులోకి వచ్చాయి. అలాగే పాస్టర్ ప్రవీణ్ మృతిలో సిసి కెమేరాల ఆధారాలు లేకపోయి ఉంటే హత్య అని చెప్పి ప్రభుత్వంపై నెపం వేసేవారని సిఎం అన్నారు.

**ప్రాణాపాయం వచ్చినా విధినిర్వహణలో వెరవలేదు**

శాంతిభద్రతల విషయంలో కఠినంగా వ్యవహరిస్తున్నాం. సమైక్యాంధ్రలో నేను ముఖ్యమంత్రిగా ఫ్యాక్షనిజం, రౌడీయిజం, నక్సలిజం అణిచివేశాం. మత కలహాలను అరికట్టాం. ప్రజలకు నష్టం కలిగించే వారిని ఉపేక్షించలేదు. ఎన్డీఏ ప్రభుత్వం వచ్చాక నేరాలు అదుపులోకి వచ్చాయి. గంజాయి, డ్రగ్స్ పై ఉక్కుపాదం మోపాం. సైబర్ క్రైమ్, ఆర్థిక నేరాలు, డ్రగ్ మాఫియా, మహిళలపై అఘాయిత్యాలను పూర్తిగా అరికట్టాలి. ప్రజలకు, వారి ఆస్తులు భద్రత ఉందంటే అందుకు పోలీసులు రక్షణగా ఉండటమే కారణం. పోలీసులు పూర్తి స్వేచ్ఛతో పని చేసి రాష్ట్రాన్ని ఒక రోల్ మోడల్ గా నిలబెట్టాలి. అలాగే హోంశాఖను సమర్థవంతంగా నిర్వర్తిస్తున్న వంగలపూడి అనితను అభినందిస్తున్నాను. 2047 స్వర్ణాంధ్ర సాధన లక్ష్యంగా సుపరిపాలన అందిస్తున్నామని సీఎం చంద్రబాబు తెలిపారు. అంతకుముందు సభా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ర్యాంపులపై డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్, హోం మంత్రి అనితతో కలిసి సిఎం నూతనంగా ఎంపికైన కానిస్టేబుళ్ల చెంతకు వెళ్లి వారికి అభివాదం తెలియచేశారు. నియామక ప్రక్రియలో టాపర్లుగా నిలిచిన వారికి శాలువా కప్పి నియామకపత్రాన్ని, రాజ్యాంగ ప్రతిని ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి అందించారు. సభావేదికపై టాపర్లుగా నిలిచిన వారి కుటుంబ పరిస్థితుల దృశ్యమాలికను వీక్షించిన ముఖ్యమంత్రి చలించి పోయారు. వారు ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఆకాంక్షించారు.

### వారం - వర్జ్యం

17-12-2025, బుధవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
మార్గశిరమాసం, దక్షిణాయణం
హేమంత ఋతువు, కృష్ణపక్షం
త్రయోదశి రా.2.32
విశాఖ సా.5.10, మూలా కార్తె
వర్జ్యం : రా.9.39-11.27
దు.ఉ.11.42-12.27,
శుభసమయం: 6.30-7.30
రాహుకాలం - మ.12.00-1.30

### వార్తాఫలం

**మేషం:**చిన్ననాటి మిత్రుల నుండి ముఖ్య సమాచారం అందుకుంటారు. నూతన వస్తువులు కొనుగోలు. మిత్రుల కలయిక.

**వృషభం:** పలుకుబడి కలిగిన వ్యక్తులతో పరిచయాలు ఏర్పడతాయి. నూతన పెట్టుబడులకు అనుకూలం.శుభకార్యాలు.

**మిథునం:**కుటుంబ సభ్యులతో స్వల్ప విభేదాలు తలెత్తుతాయి. ఇంటా బయటా మీదే పై చేయిగా ఉంటుంది.

**కర్కాటకం :**సంఘసేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. వృత్తి, వ్యాపారాలు అభివృద్ధి చెందుతారు.క్రయ విక్రయాలలో లాభాలు.

**సింహం:**కొత్త వ్యాపార, విద్యా సంబంధితమైన విషయములకు, గృహ నిర్మాణాలకు అనుకూలం. మిత్రుల కలయిక.

**కన్య :** సన్నిహితుల సహకారము పూర్తిగా లభించుట వలన కొన్ని కార్యక్రమములలో విజయాలను చవిచూస్తారు.

**తుల :**ఆర్థిక పరిస్థితులు మెరుగుపడుట వలన మానసిక ఉల్లాసమును కలిగి యుంటారు. వస్త్రా లాభాలు.

**వృశ్చికం:** అధికారుల అండదండలు లభించుటవలన వృత్తి యందు రాణించ గలుగుతారు. ప్రయాణాలు లాభిస్తాయి.

**ధనుస్సు:** సంతాన, ఆధ్యాత్మిక విషయములు సంతృప్తిని ఇస్తాయి. భార్యవైపు బంధువులకు సాయం చేస్తారు.

**మకరం:**అధికారులతో సహోద్యోగులతో స్నేహ భావముతో మెలగండి. విందు, వినోదాలలో పాల్గొంటారు.

**కుంభం:** వ్యాపారములో, వృత్తిలో మీరు చూపించే నైపుణ్యమునకు గాను, మంచి అభివృద్ధిని సాధిస్తారు.మిత్రుల కలయిక.

**మీనం :** విదేశీయానములకు, ఉద్యోగ ప్రయత్నములకు మీరు చేసే కృషి సానుకూల పడుతుంది. కాంట్రాక్టులు లాభిస్తాయి.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్



మంగళవారం డి.సిఎం పవన్ కల్యాణ్‌తో భేటీ అయిన యుఎస్ కాన్సుల్ జనరల్ లారా విలియమ్స్ తదితరులు

## డి.సిఎం పవన్‌తో యుఎస్ కాన్సుల్ జనరల్ భేటీ

**విజయవాడ,డిసెంబరు 16,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ను యు.ఎస్. కాన్సుల్ జనరల్ లారా విలియమ్స్ మర్యాదపూర్వకంగా కలిశారు. మంగళవారం క్యాంపు కార్యాలయంలో జరిగిన ఈ భేటీలో పలు అంశాలు చర్చకు వచ్చాయి. భేటీలో పవన్ మాట్లాడుతూ రాష్ట్రంలో అభివృద్ధికి పెట్టుబడులు అత్యంత అవసరమన్నారు.ఇందు కోసం ముందుకు వచ్చేవారికి సిఎం చంద్రబాబు నేతృత్వంలోని తమ ప్రభుత్వం భారీగా ప్రోత్సాహకాలు, రాయితీలు అందిస్తుందన్నారు. సాంకేతిక రంగంలో తమ రాష్ట్రం మంచి అభ్యున్నతిని సాధిస్తుందన్నారు.యుఎస్ కాన్సుల్ జనరల్ లారా విలియమ్స్ మాట్లాడుతూ ఆయా రంగాల్లో ఎపి అభివృద్ధికి అన్ని విధాలుగా సహకారం అందిస్తామన్నారు. పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధికి సహకరిస్తామన్నారు.ఈ సమావేశంలో యుఎస్ ఎంబసీకి చెందిన మెరెడిత్ మెట్జలర్, యు.ఎస్ పబ్లిక్ డిప్లమసీ ఆఫీసర్ అబ్దుల్ రెహ్మాన్ హాబీబ్, పొలిటికల్ స్పెషలిస్ట్ శ్రీమాలి కారి, ఎకనమిక్ స్పెషలిస్ట్ శిబా త్రిపాఠి తదితరులు పాల్గొన్నారు.

## ధ్వజస్తంభం కోసం పవిత్ర వృక్షాల వనం

### దేశంలోనే తొలిసారిగా వంద ఎకరాల్లో టిటిడి నూతన ప్రాజెక్టు

**తిరుమల, డిసెంబరు16, ప్రభాతవార్తప్రతినిధి:** ప్రపంచంలోనే అతిపెద్ద హిందూ ధార్మికసంస్థ తిరుమల తిరుపతి దేవస్థానం దేశంలోనే తొలిసారిగా వంద ఎకరాల్లో దివ్యవృక్షాల ప్రాజెక్టు నెలకొల్పేం దుకు కార్యాచరణ రూపొందించింది. దివ్యవృక్షాలతో ఆలయాల్లో ధ్వజస్తంభాలు తయారీ, రథాల తయారీకి వినియోగించే కలప లభిస్తుంది. ఈ దివ్యవృక్షాల వనం విషయంలో టిటిడి బోర్డు కూడా సానుకూలంగా నిర్ణయించింది. చిత్తూరుజిల్లా పలమనేరు వద్ద వంద ఎకరాల్లో ఈ పవిత్ర వృక్షాలను టిటిడి స్వయంగా అభివృద్ధి చేసి, ఆధ్యాత్మికతతోపాటు పర్యావరణ పరిరక్షణ చేయాలని భావించింది. టిటిడి ఆలయాలకు అవసరమైన కలపను అందిస్తూ, భవిష్యత్ తరాలకు సంప్రదాయాలను, ప్రకృతిని అందించాలని ఈ వినూత్న కార్యక్రమం చేపడుతోంది. టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు స్వయంగా ఈ ప్రాజెక్టు ఏర్పాటుకు నిర్ణయం తీసుకున్నారు.మంగళవారం జరిగిన బోర్డు సమావేశంలో ఆమోదించారు. ప్రాచీన ఆగమశాస్త్రాలకు అనుగుణమైన హిందూ దేవాలయాల్లో అత్యంత ప్రాముఖ్యమైన ధ్వజస్తంభాల నిర్మాణానికి అవసరమైన దివ్యవృక్షాలను టిటిడి స్వయంగా పెంచాలని నిర్ణయం. ఆగమ సాంప్రదాయాల ప్రకారం ధ్వజస్తంభాల తయారీలో సాధారణంగా టేకు,ఏగిశా,టెర్మినేలియా, షోరియా జాతికి చెందిన వృక్షాలను వినియోగిస్తారు. ఇవి బలంగా, దీర్ఘకాలికంగా నిటారుగాపెరిగే స్వభావం కలిగిఉంటాయి. అందువల్ల ధ్వజస్తంభాలకు అనుకూలంగా ఉంటాయి. ఆ వృక్షాన్ని పూజించి, ఆపై ధ్వజస్తంభంగా రూపకల్పన చేస్తారు. అనంతరం దానిని కవచంతో కప్పి, పవిత్రమైన ఆలయాల్లో స్వర్ణకవచంతో అలంకరిస్తారు. దేశవ్యాప్తంగా 60కిపైగా ఆలయాలను టిటిడి నిర్వహిస్తోంది. భవిష్యత్తులో వివిధ రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయాలు నిర్మించాలని దృష్టిలో ఉంచుకుని ఈ దివ్యవృక్షాల ప్రాజెక్టును దూరదృష్టితో టిటిడి నిర్మించనున్న ఆలయాలకు ధ్వజస్తంభాల కోసం పవిత్రమైన కలపను ముందుగానే సిద్ధం చేయడం ఈ ప్రాజెక్టు ముఖ్య ఉద్దేశ్యం. దివ్యవృక్షాలను పెంచే దేశంలోనే టిటిడి చరిత్రలో నిలిచిపోనుంది.

# ప్రజలపై వైద్యఖర్చుల భారం తగ్గిస్తాం

### డిజిటల్ హెల్త్ కార్డులు సంజీవని ద్వారా రూపొందిస్తున్నాం: సిఎం చంద్రబాబు

**విజయవాడ డిసెంబరు 16,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రజారోగ్య పరిరక్షణకు మెరుగైన విధానాలను అవలంబిస్తూ ప్రజలకు సేవలు అందించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశించారు. ఈ మేరకు అందుబాటులో ఉన్న టెక్నాలజీని వినియోగించుకోవడంతోపాటు... నిపుణుల సలహాలను తీసుకోవాలని సిఎం సూచించారు. మంగళవారం రాష్ట్ర సచివాలయంలో వైద్యారోగ్య శాఖపై సమీక్షించారు. ఈ మేరకు గేట్స్ ఫౌండేషన్‌తో కలిసి వైద్యారోగ్య రంగంలో ప్రభుత్వం అమలు చేస్తోన్న సంజీవని సహా వివిధ ప్రాజెక్టులపై సిఎం చంద్రబాబు చర్చించారు. ఏపీలో మెరుగైన ప్రజారోగ్య నిర్వహణకు గేట్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో వైద్యారోగ్య రంగంలోని నిపుణులతో కూడిన 10 మంది సభ్యుల బృందాన్ని ఏర్పాటు చేశారు. యూఎన్‌ఎయిడ్స్ ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ పీటర్ పాయిట్, ప్రపంచ ఆరోగ్య సంస్థ సీనియర్ శాస్త్రవేత్త సౌమ్య స్వామినాథన్, ఎఐజీ ఛైర్మన్ డి.నాగేశ్వర్ రెడ్డి, సింగపూర్ నేషనల్ యూనివర్శిటీ ప్రొఫెసర్ ఇక్ ఇంగ్ టియో, రిటైర్డ్ ఐఏఎస్ ఆర్తి అహుజా, సైటెస్ ఛైర్ పర్సన్ రిజ్వాన్ కొయిటా, కోస్లా ల్యాబ్స్ వ్యవస్థాపకుడు శ్రీకాంత్ నాదముని, గేట్స్ ఫౌండేషన్ జినోమిక్స్ అండ్ ఎపిడామిలజీ డైరెక్టర్ డాక్టర్ గగన్ దీప్ కాంగ్, పబ్లిక్ హెల్త్ నిపుణురాలు మార్గరెట్ ఎలిజిబెత్, ఢిల్లీ ఎయిమ్స్ ఎండోక్రినాలజీ విభాగాధిపతి డాక్టర్ నిఖిల్ టాండన్ అత్యుతన్నతస్థాయి నిపుణుల సలహా బృందంలో ఉన్నారు. అత్యున్నత స్థాయి నిపుణుల సలహా బృందం సభ్యులు వర్చువల్‌గా ఈ సమీక్షకు హాజరయ్యారు. ఈ సందర్భంగా సిఎం మాట్లాడుతూ..“వైద్యారోగ్య రంగంలో వివిధ ప్రమాణాలను అందుకునేలా డబ్ల్యూహెచ్ఓ లాంటి సంస్థలు నిర్దేశించిన అంశాలను అమలు చేస్తున్నాం. ప్రజల డిజిటల్ హెల్త్ రికార్డులను సంజీవని ప్రాజెక్టు ద్వారా రూపొందిస్తున్నాం. గేట్స్ ఫౌండేషన్ సహకారంతో కుప్పం, చిత్తూరు జిల్లాల్లో డిజిటల్ నెర్వ్ సెంటర్ ద్వారా ఈ వివరాలను సేకరించి ఇంటిగ్రేట్ చేశాం. రియల్ టైమ్ లోనే వారి వివరాలు తెలుసుకునేలా సంజీవని ప్రాజెక్టు పని చేస్తుంది. వివిధ అంశాల్లో ప్రజలకు సంబంధించిన ఆరోగ్య సమాచారం అందుబాటులో ఉంటుంది.త్వరలో రాష్ట్రవ్యాప్తంగా ఈ ప్రాజెక్టును అమలు చేస్తాం”అని చెప్పారు.

**ప్రభుత్వంతో కలిసి గేట్స్ ఫౌండేషన్ ముందుకు..**

రాష్ట్రంలో గ్లోబల్ స్థాయి ప్రమాణాలతో వైద్యారోగ్య నిపుణులు ఉండేలా రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి గేట్స్ ఫౌండేషన్ పనిచేస్తోందని .. ఆ సంస్థ కంట్రీ డైరెక్టర్ అర్చనా వ్యాస్ అన్నారు. ప్రజారోగ్య పర్యవేక్షణ కోసం ఓ హెల్త్ సెక్రటేరియట్ ఏర్పాటు చేసుకుని పర్యవేక్షించేలా కార్యాచరణ రూపొందిస్తామని ఆమె స్పష్టం చేశారు. వైద్యారోగ్య రంగాన్ని విప్లవాత్మకంగా మార్చేందుకు అవసరమైన సూచనల్ని నిపుణుల బృందం చేసిందని ..వారి సిఫార్సులు హెల్తీ వెల్తీ హ్యాపీ ఆంధ్రప్రదేశ్ సాధన కోసం ఉపకరిస్తాయని వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు. నిపుణుల సలహాలను మరింత లోతుగా చర్చించి వాటిని ఏపీలో అమలు చేస్తామని సత్యకుమార్ అన్నారు. సీఎం చంద్రబాబు తరచూ ప్రజారోగ్యం రంగాన్ని ఎలా పటిష్ట పరచాలన్న అంశాలపైనే ఆలోచన చేస్తారని మంత్రి వివరించారు. ఇకపై ఏడాదిలో రెండుసార్లు నిపుణుల బృందంతో భేటీ అవ్వాలని సీఎం చంద్రబాబు సూచించారు. నిపుణులు ఇచ్చిన సలహాలను.. సూచనలను క్రోడీకరించి యాక్షన్ ప్లాన్ తయారు చేసే బాధ్యతను గేట్స్ ఫౌండేషన్ కంట్రీ డైరెక్టర్ అర్చనా వ్యాస్‌కు సిఎం అప్పగించారు.

## పిజి మెడికల్‌లో అదనంగా 36 సీట్లు మంజూరు!

**విజయవాడ, డిసెంబరు 16 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ చొరవతో కొత్త ప్రభుత్వ వైద్య కళాశాలల్లో పిజి వైద్య విద్యలో అదనంగా 36 సీట్లను జాతీయ వైద్య కమిషన్ మంజూరు చేసింది. తొలివిడతలో ఇంతకుముందే 60 సీట్లను ఎన్ఎంసి మంజూరు చేసింది. మరికొన్ని సీట్ల మంజూరు కోసం కూటమి ప్రభుత్వం అవసరమైన నియామకాలు చేపట్టడమే కాకుండా మౌలిక సదుపాయాలను సదరు కళాశాలల్లో కల్పించింది. డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ అధికారుల సూచనల మేరకు ఏలూరు, రాజమహేంద్రవరం, నంద్యాల, విజయనగరం, మచిలీపట్నం కళాశాలల ప్రిన్సిపాళ్లు ఎన్ఎంసీకి దరఖాస్తు చేశారు. ఇదే సమయంలో మంత్రి సత్యకుమార్ తనకు ఉన్న విస్తృత పరిచయాల మేరకు అదనపు సీట్ల మంజూరుపై చేసిన విజ్ఞప్తి మేరకు కేంద్ర ప్రభుత్వం స్పందించింది. ఈ మేరకు ఏలూరు వైద్య కళాశాలకు12, రాజమహేంద్రవరం 4, మచిలీపట్నం 8, నంద్యాల 4, విజయనగరం కళాశాలకు 8 చొప్పున సీట్లను పీజీ వైద్యవిద్యలో ఎన్ఎంసీ కేటాయించినట్లు మంగళవారం డిఎంఇ డాక్టర్ రఘునందన్ ఓ ప్రకటనలో తెలిపారు.

## పిపిపి విధానంలోనే వైద్యకళాశాలు: మంత్రి సత్య కుమార్

**విజయవాడ,డిసెంబరు 16,ప్రభాతవార్తప్రతినిధి:** ఎవ్వరు ఎన్ని అపవాదులు వేసినా,అడ్డంకుల పెట్టాలనుకున్న ఏపీలో పీపీ విధానంలో వైద్య కళాశాలలు ఏర్పాటు చేస్తామని మంత్రి సత్య కుమార్ యాదవ్ తెలిపారు,రాష్ట్ర ఆరోగ్య వ్యవస్థలో మార్పు తీసుకురావడం జరుగుతుందని అన్నారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. 10 వ్యాధులను మ్యాపింగ్ చేసి ఎక్స్‌పర్ట్స్ ఆలోచనలకు అనుగుణంగా ట్రీట్‌మెంట్ చేయటం జరుగుతుందని వెల్లడించారు. జాతీయ, అంతర్జాతీయ ఎక్స్‌పర్ట్స్‌తో ఉండే శాస్త్రవేత్తలు ఈ గ్రూప్‌లో ఉన్నారని తెలిపారు. దేశ విదేశాలలో ఉన్న ఈ సైంటిస్ట్‌లు వర్చువల్ విధానంలో మొటి సమావేశానికి హాజరయ్యారన్నారు. వ్యక్తిగత చికిత్స అందించేందుకు ప్రతిష్టాత్మకంగా ఈ ఎక్స్‌పర్ట్స్ గ్రూప్ పనిచేస్తుందని అన్నారు. ఆరోగ్య వ్యవస్థను పటిష్టత చేసే యోచనలో ముందుకు వెళ్తున్నామని వెల్లడించారు. రాబోయే రోజుల్లో ఫీల్డ్ విజిట్ చేయటం జరుగుతుందని మంత్రి తెలిపారు.

# చోరీ కంటే పెద్దది

>> ఇలో భాగంగా హైకోర్టు కీలక వ్యాఖ్యలు, సూచనలు చేసింది. విరాళాల లెక్కింపులో అవకతకవలు అత్యంత తీవ్రమైనవిగా పేర్కొంది. ఇది కోట్ల మంది భక్తుల విశ్వాసానికి ప్రతీకగా అభిప్రాయపడింది. పరకామణిలో జరిగిన నేరం దొంగతనం కంటే మించిందనే భావనను వ్యక్తం చేసింది. భక్తుల నమ్మకాన్ని దెబ్బతీసే ఇలాంటి ఘటనలను ఎంత మాత్రం ఉపేక్షించలేమని స్పష్టం చేసింది. హైకోర్టులో ఈ కేసు విచారణలో భాగంగా ఇరుపక్షాల న్యాయవాదుల మధ్య వాదోపవాదనలు జరిగాయి. సందర్భంగా హైకోర్టు ఈ వ్యాఖ్యలు చేసింది. కానుకల రూపేణా వచ్చిన సొమ్ము చోరీకి గురైతే కోట్లాదిమంది భక్తుల మనో భావాలు దెబ్బతింటాయని తెలిపింది. పరకామణిలో కానుకల లెక్కింపు ప్రక్రియను ఆధునీకీకరించాల్సిన అవసరముందని వెల్లడించింది. మనుషుల ప్రమేయాన్ని తగ్గించి, యంత్రాలు, ఎఐ టెక్నాలజీని వినియోగించాలని తిరుమల తిరుపతి దేవస్థానానికి సూచించింది. తిరుమల తిరుపతి దేవస్థానంలో ఇలాంటి చోరీ ఘటనలు తరచూ జరుగుతున్నా కానుకలు లెక్కించేందుకు పాత విధానాన్ని అనుసరించడం సరికాదని ధర్మాసనం స్పష్టం చేసింది.

విరాళాల లెక్కింపు, భద్రత, పర్యవేక్షణ వంటి అంశాల్లో ఎఐ ఆధారిత వ్యవస్థలను అమలు చేస్తే మానవతప్పిదాలు, అక్రమాలకు తావు ఉండదని న్యాయస్థానం సూచించింది. భక్తుల సమక్షంలో లెక్కింపు జరిగితే పారదర్శకత పెరుగుతుందని నమ్మకం మరింత బలపడుతుందని అభిప్రాయపడింది. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండేందుకు విజిలెన్స్ వ్యవస్థను పూర్తిగా ఆధునికీకరించాలని సూచించంది. కానుకలు లెక్కింపునకు ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను వినియోగించడానికి వీల్లేదని స్పష్టం చేసింది. ఈ విషయంలో తగిన సూచనలు, సలహాలతో తమ ముందుకు రావాలంటూ కేసు విచారణను శుక్రవారానికి వాయిదా వేసింది.

ఏప్రిల్ 2023లో టిటిడికి చెందిన ఒక మఠం ఉద్యోగి సి.వి. రవికుమార్ పరకామణి హాల్‌లోసుమారు 900 అమెరికన్‌డాలర్లను దొంగిలిస్తూ విజిలెన్స్ అధికారులకు పట్టుబడ్డారు. ఈ దొంగతనం కేసులో విచారణ జరపకుండానే, నిందితుడు రవికుమార్ తిరుపతి చెన్నైలోని తనకున్న 7 ఆస్తులను టిటిడికి విరాళంగా ఇచ్చేలా సెప్టెంబర్ 2023లో లోక్ అదాలత్ ద్వారా రాజీ కుదిర్చారు. ఈ రాజీ వెనుక ఉన్న అక్రమాలపై ఏపీ హైకోర్టు ఆదేశాల మేరకు సీఐడీ, ఏసీబీ దర్యాప్తు చేపట్టాయి. రెండు సంస్థలకు కేసు నమోదు చేసి, పూర్తిస్థాయిలో దర్యాప్తు చేయాలని హైకోర్టు ఆదేశించింది.ఈ కేసులో ప్రధాన ఫిర్యాదుదారుడైన మాజీ ఎవిఎస్ఓ వై.సతీష్ కుమార్ గత నెల 13వ తేదీన అనంతపురం జిల్లాలో రైల్వే ట్రాక్‌పై మరణించి కనిపించారు. ఇది ఆత్మహత్యగా భావించినప్పటికీ, దీనిపై హైకోర్టు సమగ్ర విచారణకు ఆదేశించింది. పోస్టుమార్టం నివేదికను సమర్పించాలని కోరింది.

# తిరుపతిలో ఇంటెగ్రేటెడ్ టౌన్‌షిప్

>> సమావేశం జరిగింది. టిటిడి ఇఒ అనిల్‌కుమార్‌సింఘాల్, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్య చౌదరి, బోర్డు సభ్యులు జి.భానుప్రకాశ్‌రెడ్డి, సి.దివాకర్‌రెడ్డి, పనబాకలక్ష్మి, వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, జ్యోతులనెహ్రూ, శాంతారాం, నరేశ్, ఎంఎస్‌రాజు, నర్సిరెడ్డి, జంగా కృష్ణ మూర్తి, జానకీదేవి తదితరులు పాల్గొన్నారు. దాదాపు 60అంశాలపై చర్చించి ఆమోదించిన వివరాలను ఛైర్మన్ బిఆర్‌నాయుడు మీడియా ప్రతినిధులకు వెల్లడించారు. తిరుమలకు వస్తున్న భక్తులకు వసతిసదుపాయం మెరుగుపరిచేందుకు తిరుపతిలో అన్ని హంగులతో మెరుగైన వసతి అనువుగా ఏర్పాటుకు ఆమోదించారు. అవసరమైన టౌన్‌ప్లానింగ్, ఆర్కిటెక్ నియామకానికి ఆమోదం తెలిపారు. ముంబై బాంద్రాలో 14.40కోట్ల రూపాయలతో శ్రీవారి ఆలయ నిర్మాణానికి పరిపాలన అనుమతులు మంజూరుచేశారు. టిటిడి ఆలయాల్లో ధ్వజస్తంభాలు, రథాల తయారీకి అవసరమైన కలపకోసం చిత్తూరుజిల్లా పలమనేరులో వంద ఎకరాల్లో దివ్య వృక్షాలను పెంచే ప్రతిపాదనకు ఆమోదం తెలిపారు. తిరుమల ఆలయ పోటులో నిబంధనల మేరకు కొత్తగా 18మంది పర్యవేక్షకులు(సూపర్‌వైజర్)పాచక పోస్టుల భర్తీకి ప్రభుత్వానికి నివేదించాలని నిర్ణయించారు. కలియుగవైకుంఠం తిరుమలలో రహదారులు, ముఖ్యకూడళ్ళ పేర్లను వైష్ణవ పురాణాలు, ఆళ్వార్లు, అన్నమాచార్య సంకీర్తనల్లోని శ్రీవారి నామాలు వంటి పేర్లతో మార్చేందుకు కమిటీ ఏర్పాటు చేశారు. ఈ కమిటీలో జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం దూర విద్యకేంద్రం డైరెక్టర్ డాక్టర్ చక్రవర్తి రంగనాథన్, అన్నమాచార్యప్రాజెక్టు ప్రత్యేక అధికారి డాక్టర్ మేడసాని మోహన్, పురాణ ఇతిహాస ప్రాజెక్ట్ ప్రత్యేక అధికారి డాక్టర్ డి.ప్రభాకర్ కృష్ణమూర్తి ఉన్నారు. తిరుమల శ్రీవారి ఆలయంలో ఒక ప్రధాన సన్నిధి యాదవతోబాటు అదనంగా మరోసన్నిధి యాదవ పోస్టు ఏర్పాటుచేసి భర్తీకి ఆమోదం తెలిపారు. తెలంగాణ జగిత్యాల జిల్లా కొండగట్టులోని వీరాంజనేయస్వామి ఆలయంలో భక్తుల సౌకర్యార్థం వసతి సముదాయం నిర్మాణానికి నిర్ణయం తీసుకున్నారు. టిటిడి అనుబంధ ఆలయాల్లో పనిచేస్తున్న 62మంది అర్చక, పరిచారక,పోటు



మంగళవారం తిరుమలలో టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు అధ్యక్షత జరిగిన సమావేశం

వర్కర్లు, ప్రసాదం పంపిణీ చేసేవాళ్లకు వేతనాలు పెంచాలని ధర్మకర్తలమండలి నిర్ణయించింది. అర్చకులకు ప్రస్తుతం 25వేల రూపాయలు వేతనం ఇస్తుండగా 45వేల రూపాయలకు పెంచారు. పరిచారకులకు 23,140 రూపాయల నుండి 30వేల రూపాయలు చేశారు. పోటు కార్మికులకు 24,279 రూపాయల నుండి 30వేల రూపాయలు పెంచారు. ఆలయంలోపల ప్రసాదం పంపిణీ చేసే వారికి 23,640 రూపాయల నుండి 30వేల రూపాయలకు పెంచారు. తిరుపతిలో శ్రీపద్మావతి చిన్నపిల్లల హృదయాలయంలో అత్యాధునిక సౌకర్యాలు కల్పించేందుకు అదనంగా 48కోట్ల రూపాయలు మంజూరు చేయడానికి ఆమోదం తెలిపారు. దాతల కాటేజీల నిర్వహణ, నిర్మాణాలపై నూతన సమగ్ర విధానం తీసుకురావాలని నిర్ణయించారు. టిటిడి ఇంజనీరింగ్ విభాగంలో నాలుగు కేటగిరిలలో ఖాళీగా ఉన్న 60 పోస్టులకు ఇప్పటికే ఇచ్చిన నోటిఫికేషన్ ఆధారంగా త్వరలో భర్తీచేసేందుకు నిర్ణయం తీసుకున్నారు. టిటిడి జూనియర్ కళాశాలల్లోనూ డేస్కాలర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం అమలుచేయాలని నిర్ణయించారు.

# ఎపిలో ఆరు జోన్లు, రెండు మల్టీ జోన్లు

## ఖ 26 జిల్లాల ఆధారంగా గెజిట్ నోటిఫికేషన్

**విజయవాడ,డిసెంబరు 16,ప్రభాతవార్త ప్రతినిధి:**పబ్లిక్ ఎంప్లాయిమెంట్ ఆర్డర్ 1975 ప్రకారం ఉన్న జోనల్ నిబంధనలు కేంద్రం సవరించింది. ప్రత్యక్ష నియామకాల్లో స్థానికత కేడర్,జోనల్,మల్టీ జోనల్‌పై స్పష్టతనిస్తూ గెజిట్ నోటిఫికేషన్ ఇచ్చింది. 26 జిల్లాల ప్రకారం ఆరు జోన్లుగా ప్రకటించింది. వాటిని రెండు మల్టీ జోన్లుగా విభజించింది. ఏడేళ్ళు ఒకే చోట చదివిన ప్రాంతాన్ని స్థానికంగా పరిగణనలోకి తీసుకోనున్నట్లు పేర్కొంది. జోన్-1లో శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం, మన్యం,విశాఖపట్నం,అనకాపల్లి జిల్లాలు ఉంటాయి.జోన్-2లోన అల్లూరిసీతా రామరాజు,తూర్పుగోదావరి,కాకినాడ,డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలు ఉంటాయి, జోన్-3లోపశ్చిమ గోదావరి,ఏలూరు,ఎన్టీఆర్, కృష్ణా జిల్లాలు ఉంటాయి,జోన్-4లో గుంటూరు, పల్నాడు, బాపట్ల, ప్రకాశం,శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలు ఉన్నాయి.. జోన్-6లో నంద్యాల, అనంతపురం, కర్నూలు, శ్రీసత్యసాయి జిల్లాలు ఉంటాయి. రెండు మల్టీ జోన్లు ఉంటాయి.

# వైజాగ్, కాకినాడతో అన్ని పోర్టులలో లాండింగ్ చట్టం అమలు

### కేంద్రమంత్రి సర్బానంద సోనోవాల్



**రాజంపేట, డిసెంబరు 16 ప్రభాత వార్త:** రాష్టంలోని వైజాగ్, కాకినాడ సహా అన్ని పోర్టులలో ఎగుమతులకు సంబంధించి బిల్లుల లాడింగ్ చట్టం అమలు జరుగుతుందని ఓడరేవులు, షిప్పింగ్ జలమార్గాల మంత్రి సర్బానంద సోనోవాల్ వెల్లడించారు. మంగళవారం రాజ్యసభలో జరిగిన చర్చలో కేంద్ర అంశాలను వైసీపీ రాజ్యసభ సభ్యులు ఎంపి మేడా రఘునాథ్ రెడ్డి ప్రస్తావించారు. ఆంధ్రప్రదేశ్ రాష్టంలోని పెద్ద, చిన్న ఓడరేవులలో బిల్స్ ఆఫ్ లాడింగ్ చట్టం, 2025లోని నిబంధనలు అమలుచేయబడతాయా, పోర్ట్ అధికారులు ఎగుమతిదారులకు శిక్షణ సామర్థ్య నిర్మాణ మాడ్యూల్స్ ప్రణాళిక చేయబడ్డాయా అని ప్రశ్నించారు. విశాఖపట్నం, కాకినాడ ఓడరేవులలో వాణిజ్య లాజిస్టిక్స్‌పై అంచనా వేసిన ప్రభావాలని తెలపాలని కోరారు. ఈ ప్రశ్నకు సమాధానంగా సర్బానంద సోనోవాల్ అన్ని ఓడరేవులకు వర్తించే బిల్స్ ఆఫ్ లాడింగ్ చట్టం 10.09.2025 నుండి అమల్లోకి వచ్చిందని తెలిపారు. ఈ చట్టం నిబంధనల భాషను సరళీకృతం చేసిందని, స్పష్టతను పెంచి, అవగాహన సౌలభ్యాన్ని ప్రోత్సహించిందని విశాఖపట్నం, కాకినాడతో సహా అన్ని ఓడరేవులలో మెరుగైన లాజిస్టిక్స్ కోసం సున్నితమైన అమలును అనుమతిస్తుందని తెలియజేసారు.

# హాయ్‌ల్యాండ్‌లో మూల్యాంకనం నిజమే!

### గ్రూప్-1 హైకోర్టుకు నివేదించిన జస్టిస్ శంకర్ కమిటీ - కేసు విచారణ 29కి వాయిదా

**విజయవాడ, డిసెంబర్ 16:** ఏపీపీఎస్సీ నిర్వహించిన గ్రూప్-1 ప్రధాన పరీక్ష జవాబు పత్రాలను మంగళగిరి,సమీపం లోని హాయ్‌ల్యాండ్ రిసార్ట్స్‌లో మూల్యాంకనం చేసినట్లు హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ కేజీ శంకర్ నేతృత్వం లోని స్వతం త్ర కమిటీ తేల్చింది. ఓఎంఆర్ షీట్లపై మార్కులు నమోదు చేశారని పేర్కొంది. ఈ మేరకు నివేదికను హైకోర్టుకు సమర్పించింది.ఈ నివేదిక ప్రతులను ఇరుపక్షాల న్యాయవాదులు రిజిస్ట్రీ నుంచి పొందేందుకు వెసులుబాటు ఇచ్చింది. మరో వైపు మూల్యాంకనంలో గతంలో వాదనలు ముగిం పు తీర్పును రిజర్వు చేసిన ధర్మాసనం,విచారణను తిరిగి ప్రారంభించాలంటూ ఉద్యోగాలు పొందిన కొందరు అభ్యర్థులు వేసిన అనుబంధ పిటీషన్‌ను అనుమతించింది. ఈ కేసుకు సంబంధించి కోర్టు వద్ద ఉన్న రికార్డుల ధృవపత్రాలు పొందేందుకు న్యాయవాదులకు వీలు కల్పించింది. హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ బట్టు దేవానంద్,జస్టిస్ హరిహరనాథ శర్మతో కూడిన ధర్మాసనం...తదుపరి విచారణను ఈ నెల 29కి వాయిదా వేసింది. 2018 నాటి నోటిఫికేషన్ ఆధారంగా నిర్వహించిన గ్రూప్-1 ప్రధాన పరీక్ష జవాబుపత్రాల మాన్యువల్ మూల్యాంకనంలో అక్రమాలు జరిగాయన్న కారణంగా పరీక్షను రద్దు చేసి,తాజాగా నిర్వహించాలని హైకోర్టు సింగిల్ జడ్జి 2024 మార్చి 13న తీర్పు ఇచ్చిన విషయం తెలిసిందే. ఈ తీర్పును సవాలు చేస్తూ ఏపీపీఎస్సీ ఉద్యోగాలు పొందిన వారు,పొందని వారు ధర్మాసనం ముందు వేర్వేరుగా అప్పీళ్ళు వేశారు. వీటిపై విచారణ జరిపిన ధర్మాసనం...నివేదిక ఇచ్చేందుకు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ కేజీ శంకర్ ఛైర్మన్‌గా,బార్ కౌన్సిల్ మాజీ ఛైర్మన్ గంటా రామారావు,ఆచార్య నాగార్జున యూనివర్సిటీ పూర్వ వీసీ,ప్రొఫెసర్ రాజేంద్రప్రసాద్ సభ్యులుగా స్వతంత్ర కమిటీని నియమించింది.

# జగన్‌కు న్యాయస్థానాలంటే గౌరవం లేదు: సీఎం చంద్రబాబు



**విజయవాడ,డిసెంబరు 16,ప్రభాతవార్తప్రతినిధి:** జగన్‌కు న్యాయస్థానాలంటే గౌరవం లేదని, లెక్కలేనట్లు మాట్లాడుతున్నారని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు.వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌పై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మీడియాతో ఇష్టాగోష్టిగా మాట్లాడిన సీఎం.. న్యాయస్థానాల పట్ల జగన్ వ్యవహార శైలిని తప్పుపట్టారు. "జగన్ తన అక్రమాస్తుల కేసుల్లో కోర్టుకు గైర్హాజరవుతాడు. సుప్రీంకోర్టు ఉత్తర్వులను అమలు చేస్తున్నా అభ్యంతరం వ్యక్తం చేస్తాడు. న్యాయస్థానాలంటే జగన్‌కు ఏమాత్రం లెక్కలేదు, అంటూ విమర్శలు గుప్పించారు సీఎం. పరకామణి చోరీ కేసును సాధారణ కేసుగా చూడటాన్ని హైకోర్టు కూడా తప్పు పట్టిందని గుర్తు చేశారు సీఎం. భక్తులు కానుకగా సమర్పించిన సొమ్ము చోరీ కావటం సెంటిమెంట్‌తో ముడిపడిన అంశం అని.. పరకామణి లెక్కింపులో కూడా ఏఐ వాడాలని న్యాయస్థానాలు చెప్పటం శుభ పరిణామం అన్నారు.పీపీపీ వైద్య కళాశాలల విషయంలో వైసీపీ ఎంపీలు కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్‌ను సైతం తప్పుదోవ పట్టించే యత్నం చేశారని సీఎం చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. పీపీపీ విధానంపై తనను తప్పుదోవ పట్టించే యత్నం చేయవద్దని కేంద్ర ఆర్థిక మంత్రి గట్టిగా చెప్పటంతో వారు వెనుదిరిగారన్నారు. పీపీపీ అనేది ప్రపంచ వ్యాప్తంగా అమలవుతున్న సక్సెక్ మోడల్ అని.. అన్ని రంగాల్లోనూ ఇది అమలవుతోందన్నారు సీఎం. దీని కారణంగా సీట్లు పెరగటంతో పాటు పేదలకు కార్పొరేట్ వైద్యం అందుతుందన్నారు. కుటుంబ సభ్యుల మధ్య ఉద్యోగ నియామక పత్రాలు అందచేయటం అభ్యర్థులకు గొప్ప అనుభూతినిస్తుందన్నారు ముఖ్యమంత్రి. నాడు డీఎస్సీ, నేడు యువగళం పేరిట పోలీసు కానిస్టేబుల్ నియామకాలు ఈ తరహా విధానం అందుకే అనుసరిస్తున్నామని సీఎం చంద్రబాబు చెప్పారు,జగన్‌ను ప్రజలు విశ్వసించడం లేదు. అతని నిజస్వరూపం గమనించిన తరువాతే గట్టి బుద్ధి చెప్పారు.

# పరకామణి లెక్కింపుల్లో యంత్రాలు, ఎఐ వినియోగంపై హైకోర్టు కీలక సూచనలు

### - ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు చెక్

**తిరుమల,డిసెంబర్ 16ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగప్రత్యక్షదైవం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామికి భక్తులు మొక్కుబడులుగా హుంఢీకి సమర్పించే కానుకల లెక్కింపు పరకామణిలో పాతపద్ధతులు అనుసరించడం సరికాదని హైకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. భారీగా చోరీలు జరుగుతున్నప్పటికీ పాత పద్ధతులకు మానవప్రమేయాన్ని తగ్గించి, పూర్తిగా స్వస్తిచెప్పి యంత్రాలు, మానవకృత్రిమ మేధ(ఎఐ)వంటినూతన సాంకేతికతను వినియోగించాలని టిటిడికి సూచించింది. తిరుమల పరకామణి భవనంలో చోరీ కేసు మంగళవారం హైకోర్టులో విచారణ జరిగింది. ఈ సందర్భంగా ఇటీవల చోటుచేసుకున్న అనేక పరిణామాల నేపథ్యంలో చోరీ కేసును తీవ్రంగా పరిగణించి కీలక వ్యాఖ్యలు చేసింది. తిరుమల ఆలయంలో శ్రీవారి హుంఢీ కానుకల లెక్కించే పరకామణి భవనంలో చోటుచేసుకునే దొంగతనాలను సాధారణ దొంగతనాలుగా పరిగణించలేమని స్పష్టం చేసింది. ఇది కోట్లాదిమంది భక్తుల మనోభావాలకు ముడిపడిన సున్నితమైన విషయంగా అభిప్రాయం వెలువడించింది. పరకామణిలో కానుకల లెక్కింపు ప్రక్రియను వెంటనే ఆధునీకరించాల్సిన అవసరం ఉందని హైకోర్టు పేర్కొంది. మానవ ప్రమేయాన్ని తగ్గించి కృత్రిమ మేధస్సును వినియోగించాలని స్పష్టం చేసింది. కానుకల లెక్కింపుకు సేవాభావంతో పాల్గొనే భక్తులను దుస్తులు లేకుండా తనిఖీ చేయడం సరికాదని సూచించింది, వారిని అవమానించడం మంచిదికాదని పేర్కొంది. అంతేగాక ఎంతో అమూల్యమైన పరకామణి లెక్కింపు ప్రక్రియలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను వినియోగించవద్దని ధర్మాసనం స్పష్టం చేసింది. ఈ విషయంగా మరింతగా తగిన సూచనలు, సలహాలతో హైకోర్టు ముందుకు రావాలని నిందితుడు తరపున న్యాయవాదులను, టిటిడి తరపున న్యాయవాదులను ఆదేశించింది. తదుపరి 18వతేదీకి విచారణ వాయిదా వేసింది. ఇప్పటికే తిరుమల పరకామణిలో 920 అమెరికన్ డాలర్లు చోరీకేసు తదనంతరం చోటుచేసుకున్న పరిణామాలు, నిందితుడు నుండి గిఫ్ట్‌డీడ్‌లుగా ఆస్తులు రాయించుకోవడం, లోక్‌అదాలత్‌లో మధ్యవర్తిత్వంతో రాజీచేయడం వంటివి హైకోర్టు దృష్టిలో ఉన్నాయి. ఇప్పుడు ఈ కేసును తీవ్రమైన నేరంగా పరిగణించడంతో ఎలాంటి చర్యలు ఉంటాయనేది ఆందోళనకలిగించే అంశం.

# టిడిపి అధిష్ఠానం మరో కీలక నిర్ణయం జిల్లాల పార్టీ అధ్యక్షులు ఖరారు

**విజయవాడ,డిసెంబరు 16,ప్రభా తవార్తప్రతినిధి:** తెలుగుదేశం పార్టీ అధిష్టానం మరో కీలక నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. రాష్ట్రంలోని పలు జిల్లాలకు అధ్యక్షులను దాదాపుగా ఖరారు చేసినట్లు సమాచారం. ఈ మేరకు నియోజకవర్గ ఎమ్మెల్యేలతోపాటు జిల్లా పార్టీ నేతలకు అధిష్టానం సమాచారం ఇచ్చినట్లు ఒక ప్రచారం జరుగుతుంది.టీడీపీ జిల్లా అధ్యక్షులు జాబితాను గమనిసే _ తిరుపతి జిల్లా: పనబాక లక్ష్మి చిత్తూరు జిల్లా: షణ్ముగం అన్నమయ్య జిల్లా: సుగవాసి ప్రసాద్ ప్రకాశం జిల్లా: ఉగ్ర నరసింహారెడ్డి అనంతపురం జిల్లా: కాలవ శ్రీనివాసులు శీసత్యసాయి జిల్లా: ఎంఎస్ రాజు నంద్యాల జిల్లా: ధర్మవరపు సుబ్బారెడి విజయనగరం జిల్లా: కిమిడి నాగార్జున ఏలూరు జిల్లా: బడేటి చంటి కాకినాడ జిల్లా: జోత్యుల నవీన్ బాపట్ల జిల్లా: సలగల రాజశేఖర్ పల్నాడు జిల్లా: కొమ్మాలపాటి శ్రీధర్ గుంటూరు జిల్లా: పిల్లి మాణిక్యాలరావు ఎన్టీఆర్ జిల్లా: గద్దె అనురాధ కృష్ణా జిల్లా: వీరంకి గురుమూర్తి పశ్చిమ గోదావరి జిల్లా: రామరా తూర్పుగోదావరి జిల్లా: వెంకటరమణచౌదరి సీమ జిల్లా: గుత్తుల సాయి విశాఖ జిల్లా: చోడే పట్టాభిరావ్ అనకాపల్లి జిల్లా: బత్తుల తాతబ్బాయ్ కర్నూలు జిల్లా: వహీద్ నెల్లూరు జిల్లా: బీదా రవిచంద్ర కడప జిల్లా: భూపేశ్ రెడ్డిలను నియమించినట్లు

# పోక్సోకేసులో ఆటోడ్రైవర్ అరెస్ట్

**తిరుపతి,డిసెంబర్ 16ప్రభాతవార్తప్రతినిధి:** తిరుపతిలో ఓ విద్యార్థినికి మాయమాటలు చెప్పించి రూమ్‌కు తీసుకెళ్ళి అత్యాచారం చేసిన ఫోక్సో కేసులో ఆటోడ్రైవర్ సాయికుమార్‌ను అలిపిరి పోలీసులు అరెస్ట్ చేశారు. గతనెలలో హాస్టల్ మారే సమయంలో పాలిటెక్నిక్ విద్యార్థినితో పరిచయం కావడం, సహాయం పేరుతో అత్యాచారానికి పాల్పడటం అలిపిరి పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో నిందితుడు ఆటోడ్రైవర్ సత్యసాయిజిల్లా పుట్టపర్తికి చెందిన సాయికుమార్‌ను అలిపిరి సిఐ రామకిశోర్ మంగళవారం అరెస్ట్ చేశారు. కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి రిమాండ్ విధించారు.

# అంబేద్కర్ స్టడీ సర్కిళ్ల ద్వారా పేద విద్యార్థులకు సివిల్స్ ఉచిత శిక్షణ

### - మంత్రి డా. డోలా బాల వీరాంజనేయస్వామి




**విజయవాడ, డిసెంబరు 16 ప్రభాతవార్త ప్రతినిధి:** ఐ.ఏ.ఎస్ కావాలన్న పేద విద్యార్థుల కలను సాకారం చేసేందుకే అంబేద్కర్ స్టడీ సర్కిళ్ల ద్వారా సివిల్స్ ఉచిత శిక్షణనిస్తున్నామని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డా. డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు. మంగళవారం నాడు విజయవాడ అంబేద్కర్ స్టడీ సర్కిల్లో ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు సివిల్స్ ఉచిత శిక్షణను మంత్రి డా. స్వామి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... గత వైసీపీ ప్రభుత్వం అంబేద్కర్ స్టడీ సర్కిళ్లను నిర్వీర్యం చేసింది. ఐ.ఏ.ఎస్ కావాలన్న పేద విద్యార్థుల కలను సాకారం చేసేందుకే అంబేద్కర్ స్టడీ సర్కిళ్ల ద్వారా సివిల్స్ ఉచిత శిక్షణనిస్తున్నాం. రాష్ట్రంలో విజయవాడ, విశాఖ, తిరుపతి అంబేద్కర్ స్టడీ సర్కిళ్లలో 340 మందికి సివిల్స్ ఉచిత శిక్షణనిస్తున్నాం. శిక్షణ కాలంలో అభ్యర్థులకు స్టడీ మెటీరియల్స్‌తో పాటు భోజనం, వసతి ఉచితంగా కల్పిస్తున్నాం. ప్రతిభకు పేదరికం అడ్డు కాకూడదని పేద విద్యార్థుకు కూటమి ప్రభుత్వం అన్ని విధాల చేయూతనిస్తోంది. సివిల్స్ కోచింగ్ అభ్యర్థులు కష్టపడి చదివి అనుకున్న లక్ష్యాన్ని సాధించాలి. పేద పిల్లలు సమాజంలో ఉన్నత స్థాయికి ఎదగాలన్నదే సీఎం చంద్రబాబు నాయుడు సంకల్పం. డా.బిఆర్ అంబేద్కర్ స్టడీ సర్కిళ్ల ద్వారా పేద విద్యార్థుల్ని పెద్ద మెత్తంలో ఐఏఎస్ చేయాలన్న

సంకల్పంతో ముందుకెళ్తున్నాం. విశాఖ కేంద్రంగా రాష్ట్రంలోని అభ్యర్థులందరికీ సివిల్స్ ఉచిత శిక్షణిచ్చేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తున్నట్టు మంత్రి డా. డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి తెలిపారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ స్టడీ సర్కిల్ డైరెక్టర్ ఐ.ఏ.యస్ వి. ప్రసన్న వెంకటేష్, సోషల్ వెల్ఫేర్ డైరెక్టర్ ఐ.ఏ.యస్ బి. లావణ్యవేణి, ఐ.ఏ.యస్ సదా భార్గవి తదితరులు పాల్గొన్నారు.

# 22న విజయవాడలో క్రిస్మస్ హై టీ ముఖ్య అతిథిగా సిఎం చంద్రబాబు

**విజయవాడ, డిసెంబరు 16 ప్రభాతవార్త ప్రతినిధి:** విజయవాడలో ఈనెల 22వ తేదీన క్రిస్మస్ హై టీ కార్యక్రమాన్ని ప్రభుత్వం నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు రాష్ట్ర న్యాయ మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ వెల్లడించారు. మంగళవారం తాడేపల్లిలోని న్యాయ మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి క్యాంపు కార్యాలయంలో మైనారిటీ సంక్షేమ శాఖ ఉన్నతాధికారులతో హైటీ ఏర్పాట్లపై మంత్రి ఫరూక్ సమీక్షి ంచారు. క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకొని ముందస్తు వేడుకల్లో భాగంగా హైటీ కార్యక్రమాన్ని విజయవాడలోని ఏ ప్లస్ కన్వెన్షన్‌లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ముఖ్యఅతిథిగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హాజరవుతారని, పొరపాట్లు లేకుండా ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో జాగ్రత్తగా ఏర్పాటు చేయాలని అధికారులు, సిబ్బందిని మంత్రి ఫరూక్ ఆదేశించారు. ఈ సమావేశంలో క్రిస్టియన్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఎండి ఏ. శేఖర్, మైనార్టీ కార్పొరేషన్ ఎండి యాకుబ్ భాష,వక్ఫ్ బోర్డు సీఈవో మహమ్మద్ అలీ, ఉర్దూ అకాడమీ డైరెక్టర్ గౌస్ పీర్, మైనారిటీ కమిషన్ కార్యదర్శి నిజాముద్దీన్, సిబ్బంది పాల్గొన్నారు.

# రోడ్ల టెండర్లలో ఇకపై సింగిల్ బిడ్‌కు ఆమోదం - ప్రభుత్వం తాజా నిర్ణయం

**విజయవాడ, డిసెంబరు 16 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా యుద్ధ ప్రాతిపదికన రహదారుల మరమ్మతుల పనులు చేపడుతున్నామని రాష్ట్ర రోడ్లు మరియు భవనాలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వంలో త్వరితగతిన రోడ్ల అభివృద్ధి పనులు పూర్తి చేసి, వెహికల్ మూమెంట్ తీసుకురావడమే లక్ష్యంగా ఆర్ అండ్ బీ శాఖ ఒక కీలక నిర్ణయం తీసుకుంది. ఆర్ అండ్ బి శాఖలో రహదారుల అభివృద్ధికి సంబంధించిన కాంట్రాక్ట్ పనులకు టెండర్లు పిలిచే క్రమంలో.. సాధారణంగా టెండర్లకు ఒకే బిడ్ వచ్చే సందర్భంలో.. తిరిగి టెండర్లు రీకాల్ చేయడం ఆనవాయితీ.. అయితే దీని కారణంగా తిరిగి మళ్లీ, మళ్లీ నూతనంగా టెండర్లు పిలవడం, బిడ్‌లు సమర్పించడం.. వాటిని ఫైనల్ చేసి, ఒప్పందాలు పూర్తిచేసి పనులు చేపట్టడానికి దాదాపు 45 రోజులు పైగా సమయం పడుతోంది. దీంతో పనులు సకాలంలో ప్రారంభం కాకపోవడంతో, అధ్వాన్నంగా మారిన రోడ్లతో ప్రజలు మరింత ఎక్కువకాలం ఇబ్బందులు పడే దారుణ పరిస్థితి నెలకొంటుంది. ఈ జాప్యాన్ని నివారించి, ప్రజా సౌకర్యార్థం, త్వరితగతిన రహదారుల మరమ్మతులు - అభివృద్ధి పనులు పూర్తి చేయడమే లక్ష్యంగా.. ఆర్ అండ్ బీ శాఖలో తొలిసారి టెండర్లు పిలిచినప్పుడు, కేవలం ఒక్క బిడ్ మాత్రమే వచ్చినప్పటికీ.. రీ కాల్‌కు ఆస్కారం లేకుండా.. దానిని పరిగణలోకి తీసుకుని, టెండర్ ఫైనల్ చేసి, పనులు ప్రారంభించేందుకు వెసులుబాటు కల్పిస్తూ, ఆర్ అండ్ బీ శాఖ నిర్ణయం తీసుకుందన్నారు.. తద్వారా అనవసర తాత్సారాన్ని నివారించడంతో పాటు, వేగవంతంగా పనులను పూర్తి చేసి, ప్రజలకు సకాలంలో మెరుగైన రహదారులు కల్పిస్తూ.. భద్రతతో కూడిన, సాఫీ ప్రయాణానికి

# ఇడి కేసులను వాదించడానికి ప్రత్యేక ఎపిపిగా 'వెన్నా'

**విజయవాడ కార్పొరేషన్, డిసెంబరు 16,ప్రభాత వార్త:** _ఇడి కేసులను వాదించేందుకు గాను విజయవాడకు చెందిన ప్రస్తుతం సిబిఐ కేసులను వాదిస్తున్న స్పెషల్ పిపి వెన్నా కళ్యాణ్ చక్రవర్తిని నియమిస్తూ కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.ఈడీకి స్పెషల్ పిపిగా నియామకం కావడంతో దేశం లోని రెండు ప్రతిష్టాత్మక కేంద్ర సంస్థలకు స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా ఏకకాలంలో సేవలు అందించే అరుదైన అవకాశాన్ని కళ్యాణ చక్రవర్తి దక్కించు కున్నారు.

# తిరుమల సమాచారం

## తిరుప్పావై ప్రవచనామృతంతో భగవంతుని కటాక్షం :పెదజీయర్‌స్వామి



**తిరుమల,డిసెంబర్ 16ప్రభాతవార్తప్రతినిధి:** పవిత్రమైన ధనుర్మాసంలో తిరుప్పావై ప్రవచనామృతంతో భగవంతుని కృపా కటాక్షాలకు పాత్రులు కావచ్చని పెద్దజీయం స్వామి అనుగ్రహభాషణం చేశారు. శ్రీవారి వైభవాన్ని పాశురాల ద్వారా వ్యాప్తిచేసిన 12మంది ఆళ్వార్లలో గోదాదేవి ఒకరని చెప్పారు. ధనుర్మాసం ఆరంభసూచకకంగా తిరుమల ఆలయంలో,తిరుపతిలోనిస్థానిక ఆలయాల్లో తిరుప్పావై ప్రవచనాల పారాయణం మొదలైంది. ఏడుకొండల వేంకటేశ్వం స్వామి ఆలయంలో వేకువ జామున సుప్రభాతం సేవ స్థానంలో తిరుప్పావై పారాయణం చేస్తారు. తిరుప్పావై ప్రవచనాలు పారాయణం మొదలైంది. ఈ సందర్భంగా పెద్దజీయర్‌స్వామి, చిన్నజీయర్‌స్వామి అనుగ్రహభాషణం చేస్తూ భగవంతుని ఆరాధనకు భాషతో పనిలేదని, భావన ముఖ్యమని చెప్పారు. వేదాల సారమే తిరుప్పావై అని, ధనుర్మాసంలో 30రోజుల పాటు భక్తుల హృదయాల్లో జ్ఞానజ్యోతులు వెలిగించేందుకు తిరుప్పావై ప్రవచనం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పవిత్రమైన వైకుంఠ ఏకాదశిఈ మాసంలోవస్తుందన్నారు. ఈ మాసంలో బ్రహ్మముహూర్తంలో భగవంతుని ఆరాధిస్తే మంచి ఫలితం వస్తుందని చెప్పారు.గోదాదేవి అమ్మవారు పూలమాలలతోపాటు పాశురాల మాలను శ్రీరంగనాథస్వామికి సమర్పించారని వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రవచనకర్త చక్రవర్తి రంగనాధన్, అన్నమాచార్యప్రాజెక్టు ప్రత్యేక అధికారి డాక్టర్ మేడసాని మోహన్, టిటిడి ఎస్టేట్ అధికారి సువర్ణమ్మ పాల్గొన్నారు.

## ఆధ్యాత్మిక నగరంలో మొదలైన ధనుర్మాస వేడుకలు




**తిరుపతి,డిసెంబర్ 16ప్రభాత వార్తప్రతినిధి:** ఆధ్యాత్మికనగరం తిరుపతిలో పవిత్రమైన ధనుర్మాసం వేడుకలు మంగళవారం వేకువజామున ఆరంభమయ్యాయి. ఈ వేడుకల్లో భాగంగా తిరుపతిలో కోదండరామ స్వామి ఆలయ మాఢవీధుల్లో రామలసీమ రంగస్థలి కళాసంస్థ ఛైర్మన్ గుండాల గోపీనాథరెడ్డి ఆధ్వర్యంలో కళాకారులు,భజనమండళ్ళు చిత్రపు హనుమంతరావుఎ, తొండమనాటి సుబ్రమణ్యంరెడ్డి,కృష్ణయ్య, కస్పాపద్మనాభం, కర్నాట మురళి, కేశవరెడ్డి, సురేశ్‌స్వామి, లోకప్రభాకర్‌నాయుడు, తిరుపాల ఆచారి, శారద,నిర్మల, భాగవతుల విజయలక్ష్మి, రంగనాథన్, రాజశేఖర్‌రెడ్డి, కెఎన్‌రాజ,కృష్ణమూర్తిరెడ్డి తదితరులు స్వాగత భజనలు, శ్రీరామ నామసంకీర్తనలు జరిగాయి. భక్తులకు ప్రత్యేక ప్రసాద వితరణ చేశారు.

## హిమగిరులను తలపిస్తున్న సప్తగిరులు - వణికిస్తున్న చలి




**తిరుమల,డిసెంబర్ 16ప్రభాత వార్తప్రతి నిధి:** తుఫాన్ కారణంగా ఇటీవల కురిసిన భారీ వర్షాలతో సప్తగిరులు హిమగిరులను తలపించేలా వాతావరణం మారింది. మంగళవారం ఉదయం చిరుజల్లులు కురవడంతో ఒక్కసారిగా తిరుమలలో వాతావరణం లో చలిగాలులు వీస్తున్నాయి. చల్లటి గాలులతో భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆలయంపైన, తిరుమల అంతటా పొగమంచు కమ్ముకుంది. చలిగాలులకు ఆలయం లోపలకు వెళ్ళే భక్తులు,ఆలయం వెలుపలకు వచ్చిన భక్తులు వణికిపోతున్నారు. భక్తులు తగిన జాగ్రత్తలు, స్వెట్టర్‌లు, తలకు టోపీలు ధరించకుంటే బయటకు రాలేని పరిస్థితి మారింది. ఈ వాతావరణం భక్తులకు మంచి ఆహ్లాద అనుభూతిని కలిగిస్తోంది. సూర్యుడు కనిపిస్తేగానీ ఎండప్రభావం ఉండటంలేదు.

# రాష్ట్ర స్థాయి వక్తృత్వం,శలాకా పోటీల ముగింపు కార్యక్రమం

**తిరుపతి విద్య, డిసెంబర్ 16 ప్రభాతవార్త** జాతీయ సంస్కృత వర్శిటీ లో రాష్ట్ర స్థాయి వక్తృత్వం , శలాకా పోటీల ముగింపు కార్యక్రమం (2025-26) వాగ్వర్ధిని పరిషత్ నిర్వహించబడింది.ఈ రెండు రోజులలో మొత్తం 36 పోటీలు నిర్వహించబడ్డాయి. ఆంధ్రప్రదేశ్ , తెలంగాణ నుండి వివిధ సంస్కృత సంస్థలు,గురుకులాల నుండి విద్యార్థులు ఈ రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొన్నారు. ఈ పోటీలలో రాష్ట్రవ్యాప్తంగా వివిధ సంస్థలకు ప్రాతినిధ్యం వహిస్తున్న విద్యార్థులు చురుకుగా పాల్గొన్నారు, వారి వాక్చాతుర్యం, పాండిత్య గభీరత , సంస్కృత అభ్యాసంపై పాండిత్యాన్ని ప్రదర్శించారు. తన ప్రత్యేక ప్రసంగంలో, రాష్ట్రపతి అవార్డు గ్రహీత , విద్యా వ్యవహారాల మాజీ డీన్ ప్రొ. కొంపెల్ల రామసూర్యనారాయణ మాట్లాడుతూ సంస్కృత భాష , సాంప్రదాయ జ్ఞాన వ్యవస్థలను సంరక్షి ంచడం , ప్రోత్సహించడం పట్ల వారి విశ్వాసం, వ్యక్తీకరణ స్పష్టత ,నిబద్ధతకు తార్కాణమని పాల్గొన్నవారిని అభినందించారు.సంస్కృత విద్యలో సమగ్ర బోధనా సాధనాలుగా వాక్చాతుర్యం , శలాకా (మౌఖిక పరీక్ష) ప్రాముఖ్యతను ఎన్.ఎస్.యు విద్యా వ్యవహారాల డీన్ ప్రొ. రజనీకాంత్ శుక్లా తెలిపారు. విద్యార్థులలో మేధో క్రమశిక్షణ, ఉచ్చారణ నైపుణ్యాలు , సాంస్కృతిక విలువలను అభివృద్ధి చేయడంలో వాటి పాత్రను నొక్కి చెప్పారు. రాష్ట్ర స్థాయిలో యువ పండితులు తమ ప్రతిభను ప్రదర్శించడానికి నిరంతరం వేదికను అందిస్తున్నందుకు వారు జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయాన్ని ప్రశంసించారు. ముగింపు సెషన్‌లో వక్తృత్వం మరియు శలాకా , ఇతర పోటీలలో విజేతలు పాల్గొన్నవారికి సర్టిఫికెట్లు , నగదు బహుమతులు ప్రదానం చేశారు.ఈ కార్యక్రమంలో వాగ్వర్ధిని కోఆర్డినేటర్లు డా. భరత్ భూషణ్ రథ్, డా.ప్రదీప్ కుమార్ భాగ్, వాగ్వర్ధిని అదనపు కో ఆర్డినేటర్ డా.ఉదయన హెగ్డే ,అధ్యాపకులు పాల్గొన్నారు.

## మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డితో రెసర్జెంట్ ఇండియా ప్రతినిధిభేటీ



**విజయవాడ, డిసెంబరు 16 ప్రభాతవార్త ప్రతినిధి:** విజయవాడలోని రాష్ట్ర రవాణా, యువజన క్రీడాశాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డిని ఆయన క్యాంపు కార్యాలయంలో రెసర్జెంట్ ఇండియా లిమిటెడ్ ప్రతినిధులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌లో ఈవీ మొబిలిటీ నెట్‌వర్క్ అభివృద్ధి, బస్ టెర్మినల్స్ ఆధునికీకరణ, ఆర్థిక సహకారం ప్రాజెక్ట్ అడ్వైజరీ అంశాలపై చర్చిస్తూ తమ ప్రతిపాదనలను మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. డెట్ సిండికేషన్, స్ట్రక్చర్డ్ ఫైనాన్సింగ్, గ్రీన్ బాండ్లు, పీపీపీ మోడళ్ల ద్వారా పూర్తి స్థాయి ఆర్థిక సహకారం అందించేందుకు సిద్ధమని తెలియజేశారు. అదేవిధంగా విజయవాడ పండిట్ నెహ్రూ బస్ స్టేషన్‌తో పాటు విశాఖపట్నం, తిరుపతి, రాజమహేంద్రవరం, కర్నూలు బస్ టెర్మినల్స్ ఆధునికీకరణకు అవకాశాలున్నాయని పేర్కొంటూ, ఈవీ మొబిలిటీతో సమగ్ర రవాణ.

ANDHRA PRADESH CAPITAL REGION DEVELOPMENT AUTHORITY
Rayapudi, Amaravati - 522 237 (A.P.)

E PROCUREMENT TENDER NOTICE

NIT No. 102/PROC/MAU61-USI0HB(OTH)/378/2025-HB, Dated: 16-12-2025
Name of the work: RFP for "Selection of Agency for Liaisoning and Obtaining Environmental Clearances for Desilting on Fore Shore area of Prakasam Barrage on Krishna River".
The bid can be downloaded on AP e-procurement portal from 17.12.2025 to 24.12.2025 up to 14.00 Hrs. Due date for submission of Bid is 24.12.2025 up to 15.00 Hrs. Technical bid opening 24.12.2025 @ 16.00 Hrs. The prebid Meeting on 20/12/2025.

E PROCUREMENT TENDER NOTICE (THIRD CALL)

NIT No. 81/MAU61-EE0ED(OTH)/16/2025-DP/3rd call, Dated: 16-12-2025
Name of Work: APCRDA-"RFP for Engagement of Developers for Development of the 30.34 Acres Land Parcel Located in Rayapudi Village, Amaravati Through PPP Mode".
The bid can be downloaded on AP e-procurement portal from 17.12.2025 to 01.01.2026 up to 14.00 Hrs. Due date for submission of Bid is 01.01.2026 up to 15.00 Hrs, Technical bid opening 01.01.2026 @ 16.00 Hrs.
For further details Please refer to www.apeprocurement.gov.in and www.crda.ap.gov.in.

EMPLOYMENT NOTIFICATION No.26/2025

Rc.No.MAU61-OPCS0CNTE(APPT)/31/2025-HR. Dt.15-12-2025
Notification is hereby issued for engagement of services of (01) Server Administrator Infrastructure and One (01) ICT Executive-Application Support in the Information Systems division in APCRDA, Vijayawada on contract basis.
Online application is available in the APCRDA website in careers tab and can be submitted from dt. 17.12.2025 to dt. 30.12.2025. For further details, please visit https://crda.ap.gov.in
Sd/- Commissioner, APCRDA, Amaravati

వార్త

బలీయమైన విశ్వాసాలకు, నైతిక సూత్రాలకు కట్టుబడని వారు ఏ పార్టీలో ఉన్నా వారికి ఆ పార్టీకి కూడా క్షేమం కలగదు.

-అండర్సన్

# ప్రకృతితో చెలగాటాలొద్దు


మానవ తప్పిదాల వల్లనే విపత్తులు ఒకదాని వెంట ఒకటి తోసుకువస్తున్నాయి. అపార ప్రాణ, ఆస్తి నష్టాలకు కారణమవుతున్నాయి. వాతావరణంలో తలెత్తుతున్న అనేక మార్పులు ప్రకృతి వైపరీత్యాలకు దారితీస్తున్నాయి. ఇందుకు ముందుగా నిందించాల్సింది, తప్పుపట్టాల్సింది మానవుడినే. మానవుని పర్యావరణ విధ్వంస చర్యలే ఈ బీభత్సానికి, విపత్తులకు కారణమవుతున్నాయని ఎన్నో అధ్యయనాలు స్పష్టం చేస్తున్నాయి. పర్యావరణాన్ని కాపాడుకోలేకపోతే మానవుడి మనుగడే భవిష్యత్తులో ప్రశ్నార్థకంగా మారుతుందని ఎందరో పర్యావరణ శాస్త్రవేత్తలు, ప్రేమికులు దశాబ్దాల తరబడి పదేపదే చెబుతూ ఆందోళన వ్యక్తం చేస్తున్నా పట్టించుకునే నాధుడే లేకుండాపోతున్నాడు. పర్యావరణాన్ని కాపాడడం అటుంచి దానికి తూట్లు పొడవడం దురదృష్టకరం. ఫలితంగా మానవాళిపై ప్రకృతి చేస్తున్న విలయతాండవంతో అతలాకుతలం అవుతున్నారు. సముద్రాలు పొంగి దేశాలకు దేశాలే కనుమరగయ్యే పరిస్థితులు ఏర్పడుతున్నాయి. తాజాగా తువాలా దేశం కనుమరగయ్యే ప్రమాదంలోకి చేరుకోవడంతో ఆ దేశ వాసులకు ఆస్ట్రేలియా ఆశ్రయం కల్పించేందుకు అంగీకరించింది. దశలవారీగా వారిని తమ దేశంలోకి అనుమతించి అన్ని వసతులు కల్పించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆస్ట్రేలియా ఇప్పటికే ప్రకటించింది. దీంతో ఒక్కసారిగా మూడువేల మంది తువాలా దేశస్థులు దరఖాస్తులు చేసుకున్నారు. అయితే దశల వారీగా వారిని అనుమతిస్తామని ప్రస్తుతం మొదటి విడతగా 280మందిని మాత్రమే అనుమతికి ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆ దేశం ప్రకటించింది. సముద్ర తీరంలో ఉన్న అనేక దేశాల పరిస్థితి రానురాను ఆందోళనకరంగా తయారవుతున్నది. పర్యావరణాన్ని మానవుడు ఎంతటి విఘాతం కల్పిస్తున్నాడో అంతకు రెట్టింపు స్థాయిలో ప్రకృతి విరుచుకుపడుతున్నది. అభివృద్ధి పేరుతో ప్రభుత్వాలు చేపడుతున్న కార్యక్రమాలు కూడా పర్యావరణానికి చేటుతెస్తున్నాయి. ఇష్టానుసారంగా ఇసుక తవ్వకాల నుంచి మొదలుపెడితే కొండలను తొలచి, ప్రాజెక్టులు, రహదారుల నిర్మాణం, నగరీకరణ పేరుతో ప్రపంచవ్యాప్తంగా కోట్లాది ఎకరాల పంట పొలాలను జనావాసాలుగా మార్చడం ఒక్కటేమిటి ఎన్ని విధాలుగా పర్యావరణానికి నష్టం చేయగలుగుతారో అన్నిమార్గాల్లో నిత్యం అన్వేషణ, విధ్వంసం కొనసాగుతూనే ఉన్నది. ఐక్యరాజ్యసమితి నివేదిక ప్రకారం మరో ఏడెనిమిదేళ్లలో ఇండియా జనాభా 150 కోట్లకుపైగా చేరుకుంటుందని అందుకు తగినట్టుగా సహజవనరులపై ఒత్తిడి పెరుగుతుందని ముఖ్యంగాఅటవీ సంపద హరించుకుపోతుందని స్పష్టం చేసింది. ఇప్పటికే భారతదేశంలో దాదాపుప్రతిరోజూ మూడువందల ముప్పై ఎకరాలకుపైగా అటవీ భూమి అదృశ్యమైపోతున్నదని ఐక్యరాజ్యసమితి నివేదికలో వెల్లడించింది. బొగ్గు గనులు, థర్మల్ విద్యుత్ కేంద్రాలు, పరిశ్రమలు, నదీలోయల్లోప్రాజెక్టుల కోసం యధేచ్ఛగా అడవులను నరికివేస్తున్నారు. ఇలాంటి కారణాలు ఎన్నో పర్యావరణానికి విఘాతం కల్పిస్తున్నాయి. ఇక ప్లాస్టిక్ సంచి మట్టిలో కలిసిపోవడానికి కొన్ని వందల సంవత్సరాలు పడుతుంది. కొన్ని ప్లాస్టిక్ వస్తువులను నిషేధించినా అవి కాగితాలకే పరిమితమైపోతున్నది. ప్లాస్టిక్ వినియోగం పర్యావరణానికి ఎంతటినష్టం చేకూరుస్తున్నదో ప్రజల్లోఅవగాహన కల్పించడంలోఅధికార వర్గాలు విఫలమవుతున్నాయని చెప్పొచ్చు. ఇక పెట్రోలు, డీజిల్ వంటి ఇంధనాల వాడకం గురించి చెప్పక్కర్లేదు. పరిశ్రమలు వదులుతున్న పొగ, ధూళికణాలు, తదితరవన్నీ కలిసి వాయు కాలుష్యాన్ని పెంచుతున్నాయి. తాజాగా ఢిల్లీలో వాయుకాలుష్యం తారస్థాయికి చేరుకున్నది. ఎన్నో పరిమితులు విధించారు. డీజిల్ వాహనాలు తిరగకుండా నిషేధం విధించారు. మరోకపక్క పాఠశాలలకు సెలవులు ప్రకటించి వర్క్‌ఫ్రమ్ హోమ్‌లో నడుపుతున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే ఉష్ణోగ్రత పెరిగిప్రపంచంలోని తీర ప్రాంతాలు, దీవులతోసహా అనేక దేశాలు ముంపునకుగురయ్యే ప్రమాదం ఉందని ఏనాడోపర్యావరణ శాస్త్రవేత్తలు హెచ్చరించారు. మరొకపక్క పర్యా వరణ సమతుల్యం దెబ్బతిన్న కారణంగా వర్షాలు కురవక పోవడం, కురిస్తే ఒకే ప్రాంతంలో కుంభవృష్టి కురవడం ఇటీవల కాలంలో పెరిగిపోయింది. అంతేకాదు వరదలు, తుఫాన్‌లు, భూకంపాలు లాంటివి ఉపద్రవాలు చోటు చేసుకుంటున్నాయి. యేటా 380కిపైగా ప్రపంచవ్యాప్తంగా ఉపద్రవాలు సంభవిస్తున్నట్లు అధికార రికార్డులే వెల్ల డిస్తున్నాయి. లక్షలాది మంది ఈఉపద్రవాలతో ప్రాణాలు పోగొట్టుకుంటుంటే కోట్లసంఖ్యలో రోగపీడితులు అవుతున్నారు. పాకిస్థాన్, ఇరాన్, హైతి, న్యూజిలాండ్ నేపాలు, జపాన్, జర్మనీ లాంటి దేశాల్లో గత నాలుగైదేళ్లుగా వస్తున్న భూకంపాలు ప్రళయాలనే సృష్టిస్తున్నాయని చెప్పొచ్చు. మొన్న ఆ మధ్య సిరియాలో భూకంపం కారణంగా దాదాపు తొమ్మిదివేల మందికిపైగా అసువులు భాసారు. మొరాకలో వచ్చిన ప్రకంపనాలతో దాదాపు నాలుగువేల మంది జీవితాలు సజీవ సమాధి అయిపోయాయి. పశ్చిమ పాకిస్థాన్‌లో తరుచుగా వస్తున్న భూకం పాలకు అక్కడిప్రజలు వణికిపోతున్నారు. భారత దేశానికి సంబంధించి కూడా అనేక ప్రాంతాల్లో భూప్రకంపనాలు కన్పిస్తూనే ఉన్నాయి. పాలకులు తీసుకుంటున్న ముందు జాగ్రత్తల వల్ల ఉపద్రవాలకు సంబంధించి ప్రాణ, ఆస్తుల నష్టం కొంతవరకు నియంత్రించగలుగుతున్నారు. కానీ పర్యావరణ సమతుల్యత దెబ్బతిన్న కారణంగా ఏర్పడుతున్న ప్రకృతి విజృంభణకు అడ్డుకట్టవేయలేకపోతున్నారు. ఏదిఏమైనా ఈఉపద్రవాలనియంత్రణకుపర్యావరణాన్ని కాపాడేందుకు త్రికరణశుద్ధిగా కృషి చేయాలి.

లోకులు తొందరగా నిందిస్తారు. అంతే త్వరగా అభినందిస్తారు కూడా. అందువల్ల ఇతరులు నిన్ను గురించి అనుకునే మాటలకు అంత విలువ ఇవ్వొద్దు.



రామకృష్ణ పరమహంస

మూర్ఖుని హృదయం నాలుక మీద ఉంటుంది. వివేకవంతుని నాలుక హృదయంలో ఉంటుంది.



ఫ్రాంక్లిన్

# ప్రజావాక్కు



## దీర్ఘకాలిక సవాళ్లు

**భూవాతావరణంలో** చోటుచేసుకుంటున్న వేగవంతమైన మార్పులు ప్రకృతి విపత్తులను అరుదైన ఘటనలుగా కాకుండా, తరచూ ఎదురయ్యే సాధారణ ప్రమాదాలుగా మార్చేశాయి. ఈఏడాది దక్షిణాసియాలో కురిసిన అసాధారణవర్షాలు, వరదలు థాయిలాండ్, ఇండోనేషియా, శ్రీలంక వంటి దేశాలను తీవ్రంగా దెబ్బతీశాయి. వందలాది ప్రాణ నష్టం సంభవించగా, వేలకుటుంబాలు నిరాశ్రయులయ్యాయి. ఈ విధ్వంసం, ప్రకృతి పట్ల మనం వ్యవహరించిన నిర్లక్ష్యానికి పర్యవసానమని నిపుణులు హెచ్చరిస్తున్నారు. భారతదేశంలో మాత్రంప్రభుత్వయంత్రాంగం అనుభవం, ముందస్తు హెచ్చరికలు, సకాలంలో ప్రజలను తరలించడం, రక్షణ బృందాల సంసిద్ధ వలన ప్రాణ నష్టం కొంత వరకు తగ్గింది. ప్రజల రక్షణకు ప్రాధాన్యత ఇవ్వడం ఒక సానుకూల పరిణామం.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

## విద్యార్థులపై ఒత్తిడి పెంచకండి

**ప్రభుత్వ** పాఠశాలలు ,జిల్లా పరిషత్, మండల పరిషత్ పాఠశాలలను ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వాలు నిర్వహించాలి. వాటి నిర్వహణ తీరును చూసి ప్రభుత్వ అనుమతితో, ఎలాంటి లాభాపేక్ష లేకుండా నాన్ గవర్నమెంట్ ఆర్గనైజేషన్ హెక్టార్లలో నడపబడుతున్న ప్రైవేటు కార్పొరేట్ స్కూల్స్ ప్రభుత్వం విధిస్తున్న మార్గదర్శకాలు విధిగా పాటించాలి. కానీఅందుకు విరుద్ధంగా ఈరోజుల్లో ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలు తీరును ప్రభుత్వ పాఠశాలల్లో కళాశాలల్లో విద్యార్థిని విద్యార్థుల మీద ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు మీద రుద్దాలని ఉన్నతాధికారులు చూడడం సరి అయినది కానే కాదు.

- వీరగంట భాస్కర్ రావు, బొబ్బిలి

## రైజింగ్ తెలంగాణ

**స్థానిక సంస్థలు** ఎన్నికలు ఒకరకంగా ప్రభుత్వానికి హెచ్చరికలు పంపుతున్నాయి. ఎంఎల్ఏల ఇలాకాలలో కూడా విపక్షం జెండా ఎగురుతున్న నేపథ్యాలు చూస్తున్నాం. భారత రాష్ట్ర సమితికి మళ్లీ జీవం పోసే దిశగా ఈ ఫలితాలు ఉంటున్నాయి. భారత రాష్ట్ర సమితిని శాసన సభ ఎన్నికలలో ఓడించిన గ్రామీణ ప్రజానీకం ఇప్పుడు అధికార పార్టీకి హెచ్చరికలు పంపుతున్నారు.

- భారత అవినాష్, జనగామ్

## నిజాయితీకి తూట్లు..

**ఆంధ్రప్రదేశ్** ఇంటర్ విద్యా వ్యవస్థలో రెగ్యులర్, ఎం.టి.ఎస్, పార్ట్ టైం, కాంట్రాక్ట్, గెస్ట్ అని ఐదు రకాల నియామకాలతో ప్రభుత్వం ద్వారా తరగతులు నడుస్తున్నాయి. అందరు చేసేది పని ఒకటే. కాని వేతనాల వ్యత్యాసం కొండకు కొమ్మకు ఉన్నంత ఉంటుంది. వీరిలోనే అన్నిరకాల ఉన్నత విద్యావంతులున్నప్పటికీ గౌరవ మర్యాదల్లో కూడా చాలా వ్యత్యాసముంటుంది. ఏదో ఒక రూపంలో పని చేయించుకొని పబ్బం గడుపుకొనే ధోరణే తప్ప మానవతా దృక్పథంతో ఆలోచించేవారు లేరు. అంతేకాదు గెస్ట్‌లెక్చరర్ల వంటి కొన్ని నియామకాలు, అనుభవానికి, ఉన్నత విద్యలకు, అవకాశమివ్వాలని ఉన్నతాధికారుల గైడ్లెన్స్ ఉన్నప్పటికీ, ప్రజాప్రతినిధులు సిఫారసు చేసినప్పటికీ లక్ష్యపెట్టక అక్కడి అధికారులు లంచాలు, బంధుప్రీతితో తన జాబులో పనిలా తమకనుకూలురను నియమించుకొని నిజాయితీకి తూట్లు పొడిచారు.

- డి. అప్పలనాయుడు, చీపురుపల్లి

## మాతృభాషలో విద్యకు ప్రాధాన్యమివ్వాలి

**భారత** విద్యావ్యవస్థలో రోటు లెర్నింగ్ పద్ధతి ఇంకా ప్రబలంగా ఉంది. విద్యార్థులు పాఠ్యాంశాలను కంఠస్థం చేయడంలోనే పరిమితం అవ్వడంతో, వారిఆలోచన శక్తి, సృజనాత్మకత, సమస్య పరిష్కార నైపుణ్యాలు పరిమితమవుతున్నాయి. ఈ పరిస్థితిని మార్చేందుకు సృజనాత్మకత, లేటరల్ థింకింగ్, సాఫ్ట్ స్కిల్స్ అభివృద్ధి అత్యవసరం. విద్య పరీక్షల మార్కులకు మాత్రమే పరిమితం కాకుండా, విద్యార్థుల మేధో వికాసానికి దోహదపడేలా ఉండాలి. ప్రపంచంలోని ఉత్తమవిద్యా విధానాలు వ్యక్తిత్వ వికాసం, భారత విద్యలో కూడా ఇలాంటి మార్పులు అవసరం. పాఠ్యాంశాల్లో సృజనాత్మక ప్రాజెక్టులు, ఆవిష్కరణాత్మకపనులు, సమస్యల పరిష్కారంపై కార్యకలాపాలుండాలి..

- కె.ఎల్.రామారావు, హైదరాబాద్

## వైద్యులకు సదుపాయాలు కల్పించాలి

**వైద్యుడు** మనిషి ప్రాణం కాపాడేదేవుడు. ఆ అవకాశం అందరికీ రాదు. వైద్య విద్య తర్వాత ఉన్నత పట్టా పొందిన వారికి సీనియారిటీ, మెరిట్ ప్రకారం వైద్యుల ఖాళీలు గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో కూడా ఉండొచ్చు. ఆ పోస్టులకు వారిని నియామకం జరిగినప్పుడు పట్టణ ప్రాంతాల్లో ఉన్న సదుపాయాలు అక్కడ ఉండవు. అక్కడి ప్రజలకు ప్రభుత్వ వైద్యశాలే శరణ్యం. విధి నిర్వహణ ఒక అవకాశంగా తీసుకొని, సేవ చేయాలి.

-బి. మేఘనాధం, విశాఖపట్నం

మనవి | ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# ఆర్థికపంథా మారితేనే ముందడుగు

*ప్రజలందరూ జీవించడానికి కనీసమౌలిక సదుపాయాలు కావాలి. పరిశుభ్రమైన త్రాగునీరు, వ్యవసాయానికి సాగునీరు పుష్కలంగా అందుబాటులో ఉండాలి. రైల్వే, రోడ్డు, సదుపాయాలు మరింతగా మెరుగుపడాలి. గ్రామీణ ప్రాంతాల్లో నేటికీ రోడ్లు అస్తవ్యస్తంగా ఉన్నాయి. ప్రజలందరికీఉచిత విద్య అందించాలి. ఉపాధి అవకాశాలు కల్పించాలి. ఆకలితో తనువు చాలించే పరిస్థితులు మారాలి. ఉచిత పథకాల వలన ప్రజలపైమోయ లేనిపన్నుల భారంపడతుండడం సముచి తంకాదు. గతంలో పోల్చిచూస్తే భారత్‌లోఉపాధి అవకాశాలు పెరిగిన మాటవాస్తవం. సర్వీసు రంగం, తయారీ రంగం పుంజుకున్న మాటయథార్థం. అయితే నేటికీ భారత్‌ను అభివృద్ధి చెందుతున్న దేశంగానే పరిగణిస్తున్నారే తప్పఅభివృద్ధి చెందిన దేశంగా భావించడం లేదెందుకు? ఈ పరిస్థితులను బేరీజు వేసుకుని భారత్ తన ఆర్థికపంథాను నిర్ణయించుకోవాలి. దేశంలోని సహజ సంపదను, యువశక్తిని సద్వినియోగం చేసుకుని ప్రపంచ దేశాలకుధీటుగా ఎదగాలి.*



సుంకవల్లి సత్తిరాజు

అంకెలు అభివృద్ధిని సూచిస్తాయా? అంచనాలు అభివృద్ధికి సంకేతాలా? అనే మీమాంస ప్రజల్లో కలగడం సహజం. అభివృద్ధికి కేరాఫ్ అడ్రస్‌గా చెప్పుకుంటున్న అమెరికా లాంటి దేశాలే అనేక ఆర్థిక ఒడిదుడుకులనుఎదుర్కొంటున్న విషయం తెలిసిందే. ఇతర దేశాల బలహీనతలను ఆసరాగా చేసుకుని ఆయా దేశాల్లోని విలువైన ఖనిజ సంపదను కొల్లగొట్టి, తన ఆర్థికవ్యవస్థను చక్కదిద్దుకోవడానికి అమెరికా చేస్తున్న ప్రయత్నాలే ఇందుకు ప్రత్యక్ష తార్కాణం. కొన్ని దేశాలు ఆర్థికంగా దివాలాతీసి, అప్పులతో నెట్టుకొస్తున్నా వాటిని కూడా ఆర్థికంగా ఉన్నతమైన దేశాలుగా కొన్ని ప్రపంచ ప్రఖ్యాత ఆర్థిక అంచనా సంస్థలు పేర్కొనడం వర్తమానంలో జరుగుతున్న ఒక ప్రహసనంగా పేర్కొనవచ్చు. ఈ నేపథ్యంలో అభివృద్ధికి, బలమైన ఆర్థిక వ్యవస్థకు నిజమైన నిర్వచనం అన్వేషించవలసిన పరిస్థితులు ఉత్పన్నమైనాయి. జర్మనీ, జపాన్ దేశాలు రెండవ ప్రపంచ యుద్ధానంతరం వేగంగా అభివృద్ధి చెందడం జరిగింది. వినాశనం నుండి అభివృద్ధి సాధన దిశగా ఈ రెండు దేశాలు పరివర్తన చెందడానికి ప్రధాన కారణం ఆయా దేశాలు అనుసరించిన ఆర్థిక, పారిశ్రామిక, సాంకేతిక విధానాలే కారణం. ఎన్నో ఆర్థిక సంక్షోభాలు ఎదుర్కొంటున్నా నేటికీ అమెరికా డాలర్ విలువ పెరుగుతూనే ఉంది. ప్రపంచాన్ని డాలర్ శాసిస్తూనే ఉంది. 30.5 ట్రిలియన్ల డాలర్లతో అమెరికా ప్రపంచంలో అగ్ర ఆర్థిక వ్యవస్థగా కొనసాగుతూనే ఉంది. చైనా 19.23 ట్రిలియన్ డాలర్లతో, జర్మనీ 4.74 ట్రిలియన్ల డాలర్లతో, జపాన్ 4.19 ట్రిలియన్ల డాలర్లతో బలమైన ఆర్థిక వ్యవస్థలను కలిగిఉన్నాయి. ఐ.ఎం.ఎఫ్ అంచనా ప్రకారం జపాన్ 4.186 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థను అధిగమించి స్వల్ప వ్యత్యాసంతో ఇండియా 4.187 ట్రిలియన్ డాలర్లతో ప్రపంచంలో నాల్గవ ఆర్థిక వ్యవస్థగా ఎదిగింది. రాబోయే రెండు మూడేళ్లలో భారత్ జర్మనీని అధిగమించి మూడవ ఆర్థిక వ్యవస్థగా ఎదుగుతుందని నీతి ఆయోగ్ అంచనా వేసింది. అయితే భారత్‌లో ప్రజల జీవన ప్రమాణాల స్థాయి ఆశించినంతగా పెరగలేదనే అంచనాలున్నాయి. జపాన్ జనాభా 12కోట్లు, జర్మనీ 8.5 కోట్లు. ఈ రెండు దేశాలు ఎన్నో దశాబ్దాల క్రిందటే అభివృద్ధిబాటలో కొనసాగుతున్నాయి. 140 కోట్ల జనాభా గల భారత దేశం జపాన్, జర్మనీ ఆర్థిక వ్యవస్థలను అధిగమించడంలో ఆశ్చర్యంలేదు. ఎందుకంటే ఇవి భారత్‌తో పోల్చిచూస్తే జనాభా పరంగాను, భూవిస్తీర్ణంలోను చిన్నదేశాలు. అయినప్పటికీ ఈదేశాలుబలమైన పారిశ్రామిక దేశాలుగా ఎదిగాయి. భారత్ కంటే ఎన్నో రెట్లు భూవిస్తీర్ణం కలిగి, తక్కువ జనాభాతో అన్నిరంగాల్లో ముందంజలో ఉండి బలమైన ఆర్థిక వ్యవస్థగా ఉన్న అమెరికాను ఢీకొట్టడం భారత్‌కు ఇప్పట్లో సాధ్యమయ్యే పని కాదు. భారత దేశం బలమైన ఆర్థిక వ్యవస్థగా ఎదగాలంటే చైనాతో పోటీపడాలి. చైనా మాదిరి క్రమశిక్షణతో అన్ని రంగాల్లో స్వయం స్వావలంభన సాధించగలగాలి. అప్పులను తగ్గించుకోవాలి. ప్రజలపైభారం పడకుండా దేశంలోని అన్నిరాష్ట్రాలు తమ ఆదాయ మార్గాలను పెంచుకోవాలి. అనవసరమైన ఉచిత పథకాలకు స్వస్తి చెప్పాలి. ఇందుకు అన్ని రాజకీయ పక్షాలు అంగీకారం తెలపాలి. అప్పుల భారం తగ్గించుకుని ఆర్థిక వృద్ధి రేటును పెంపొందించుకోవాలి. భారత దేశం అప్పు 192 శాతం పెరిగింది. గతపదేళ్లలో 62లక్షల కోట్ల నుండి 181లక్షల కోట్లకు అప్పుపెరిగిందని 2025 ప్రథమంలో పేర్కొన్నారు. 2026నాటికి 196197 లక్షల కోట్లకు అప్పు చేరుతుందనే అంచనా ఉంది. అయితే కేంద్రం




మాత్రం అప్పుల భారం తగ్గిందని, ఆర్థిక వ్యవస్థ పుంజుకుందని పేర్కొనడంలో గల ఔచిత్యం ఏమిటో తెలియదు. ఐ.ఎమ్.ఎఫ్ అంచనాల ప్రకారం భారత్ అప్పు 212 లక్షల కోట్లు ఉంటుందని అవగతమవుతున్నది. భారత దేశ జి.డి.పిలో 83శాతం అప్పులే ఉండవచ్చని కొన్ని నివేదికలు సూచిస్తున్నాయి. అయితే 2026నాటికి భారత్ అప్పు 200 లక్షల కోట్లు ఉంటుందని మరో అంచనాఉంది. భారత ఆర్థిక వ్యవస్థ పుంజుకుంటుందనే ఆనందం అప్పుల కారణంగా ఆవిరైపోతున్నది. డాలర్ విలువ పెరిగిపోతూ భారతీయ రూపాయి వెలవెలపోవడం ఆందోళన కలిగిస్తున్నది. భారతీయ రూపాయితో పోల్చితే అమెరికా డాలర్ 90రూపాయలు దాటడం దేనికి సంకేతం? భారతీయుల ప్రస్తుత తలసరి ఆదాయం 2.4 లక్షలని అనధికార అంచనా. 2026 నాటికి భారతదేశ తలసరి జి.డి.పి 3200 డాలర్లుగా ఉండొచ్చని అంచనా. భారత దేశంలో ప్రతీవ్యక్తి మీద అప్పుభారం 2026 నాటికి 1.4లక్షలు ఉండవచ్చని అంచనా. ప్రభుత్వ అప్పులతో కలిపి దీనిపరిమాణం 2.2లక్షలకు చేరవచ్చు. భారత్ నాలుగవ ఆర్థిక వ్యవస్థగా అవతరించినా ట్రంప్ భారత్‌ను డెడ్ ఎకానమీగా అభివర్ణించడంలో గల ఆంతర్యమేమిటి? భారత్ ఆర్థికవ్యవస్థ ముఖ చిత్రం ఎలా ఉంది అనే నిజంతెలియాలి. దేశంలో హైవేలు పెరిగాయి. ప్రజలకు ఉపాధి అవకాశాలు లభిస్తున్న మాట వాస్తవం. ప్రపంచ దిగ్గజ కంపెనీలు భారత్‌కు రావడానికి ఎదురుచూస్తున్న సంగతిని కాదనలేము. ఒకప్పుడు భారత్ ను హేళన చేసిన దేశాలు ప్రస్తుతం భారత్ పట్ల సానుకూల దృక్పథం కలిగి ఉండడమే కాకుండా, భారత్‌తో ద్వైపాక్షిక వాణిజ్య సంబంధాల కోసం ఎదురుచూస్తున్న మాట వాస్తవం. భారత్ జనాభా, యువత దేశానికివరం. అయితే ట్రంప్ భారత్‌పై అక్కసుతో విభేదాలు పెంచుకుంటున్నాడు. ప్రతీకార సుంకాలు పెంచుకుంటూపోతున్నాడు. రష్యాతో స్నేహం వద్దని భారత్‌ను హెచ్చరిస్తున్నాడు. అనేక రకాలుగా బెదిరిస్తున్నాడు. ఉగ్రవాద కార్యకలాపాలతో బెదిరించి, భారత్ చేతిలో చావు దెబ్బతిన్న పాక్ మాత్రం తన ధోరణి మార్చుకోకపోయినా, అమెరికా మాత్రం పాక్‌కు వంతపాడుతూ, ఆదేశానికి సహాయం అందించడానికే ప్రాధాన్యతనిస్తున్నది. ఇజ్రాయిల్ అరాచకత్వాన్ని అమెరికా ప్రోత్సహించింది. ఇరాన్ పై ప్రత్యక్ష దాడికి దిగింది. ఆ తర్వాత క్రమంలో ఇజ్రాయెల్ ఇరాక్‌ల మధ్య శాంతి ఒప్పందం కుదిరింది. ఉక్రెయిన్‌ను రెచ్చగొట్టి రష్యాపై ఇంతకాలం యుద్ధం కొనసాగించడానికి అమెరికా కారణమైనా, ప్రపంచ దేశాలు అమెరికాను నిందిం చడం లేదు. అమెరికాకు మిత్ర దేశంగా కొనసాగుతున్న భారత్‌ను ప్రస్తుతం ట్రంప్ శతృవులా చూస్తున్నాడు. డోనాల్డ్ ట్రంప్ చేష్టలను భారత్ ఖండించడంలేదు కదా కనీసం స్పందించడం కూడాలేదు. ఇటీవల రష్యా అధ్యక్షుడు పుతిన్‌భారత్‌ను సందర్శించి ద్వైపాక్షిక సంబంధాలను మరింత మెరుగుపరచుకోవడమే కాకుండా, ఆయుధ ఒప్పందాలను కూడా కుదుర్చుకోవడం కూడా జరిగింది. యథాశక్తి అమెరికా తనఅక్కసు వెళ్ళగక్కుతూనే ఉంది. అయినా భారత్‌కు రష్యాతో గల చిరకాల స్నేహాన్ని భారత్ విడనాడలేదు. ట్రంప్ టారిఫ్ యుద్ధాన్ని తట్టుకుంటూనే, అమెరికాకు ఎదురు చెప్పకుండానే, భారత్ నొప్పించక తానొవ్వక...అనే రీతిలో తన వ్యూహాన్ని నిశ్శబ్ధంగా అమలు పరచుకుంటూపోతున్నది. భారత్ శాస్త్ర, సాంకేతిక రంగాల్లో దూసుకుపోతున్నా, అభివృద్ధి సాధిస్తున్నా, సాధించిన అభివృద్ధి ఫలాలు మధ్యతరగతికి అందడం లేదనే భావన వ్యాపించింది. కార్పొరేట్లు మరింత కుబేరులుగా మారుతున్నారన్నఅభిప్రాయం సర్వత్రా నెలకొన్నది. భారత్‌లో నేటికీ పేదరికం కొనసాగుతూనేఉంది. ప్రజలు ఆర్థికంగా బలోపేతమైతేనే నిజమైన అభివృద్ధిసాధించినట్టుగా భావించాలి. అభివృద్ధికి అర్థవంతమైన నిర్వచనం కావాలి. ప్రజలందరూ జీవించడానికి కనీసమౌలిక సదుపాయాలు కావాలి. పరిశుభ్రమైన త్రాగు నీరు, వ్యవసాయానికి సాగునీరు పుష్కలంగా అందుబాటులోఉండాలి. రైల్వే, రోడ్డు, సదుపాయాలు మరింతగా మెరుగుపడాలి. గ్రామీణ ప్రాంతాల్లో నేటికీ రోడ్లు అస్తవ్యస్తంగా ఉన్నాయి. ప్రజలందరికీఉచిత విద్య అందించాలి. ఉపాధి అవకాశాలు కల్పించాలి. ఆకలితో తనువు చాలించే పరిస్థితులు మారాలి. ఉచిత పథకాల వలన ప్రజలపై మోయలేని పన్నుల భారంపడతుండడం సముచితంకాదు. గతంలో పోల్చిచూస్తే భారత్‌లోఉపాధి అవకాశాలు పెరిగిన మాట వాస్తవం. సర్వీసు రంగం, తయారీ రంగం పుంజుకున్న మాటయథార్థం. అయితే నేటికీ భారత్‌ను అభివృద్ధి చెందుతున్న దేశంగానే పరిగణిస్తున్నారే తప్పఅభివృద్ధి చెందిన దేశంగా భావించడం లేదెందుకు? ఈ పరిస్థితులను బేరీజు వేసుకుని భారత్ తన ఆర్థికపంథాను నిర్ణయించుకోవాలి. దేశంలోని సహజ సంపదను, యువశక్తిని సద్వినియోగం చేసుకుని ప్రపంచ దేశాలకుధీటుగా ఎదగాలి. ●

# పెన్షనర్ల సమస్యలకు ఏదీ పరిష్కారం?

మేకిరి దామోదర్

ప్రభుత్వాలకు ప్రజలకు మధ్య అనుసంధాన కర్తలుగా మూడు-నాలుగు దశాబ్దాల పాటు అంకితభావంతో పనిచేసిన ఉద్యోగులు, ఉపాధ్యాయులు పదవీ విరమణ అనంతరం పొందే పెన్షన్ అనేది దానం కాదు చట్టబద్ధ హక్కు. వారి చెమట, శ్రమ, అనుభవం దేశ నిర్మాణానికి పునాది. ఇలాంటి వృద్ధ ఉద్యోగుల కోసం ప్రతి సంవత్సరం డిసెంబర్ 17న జాతీయ పెన్షనర్స్ డే జరుపుకుంటారు. ఇది కేవలం ఒక ఉత్సవం కాదు వారికి గౌరవం, కృతజ్ఞత చాటి చెప్పే రోజు. ఈ సందేశాన్ని గుర్తు చేసుకుంటున్న వేళ, తెలంగాణలో పెన్షనర్లు ఎదుర్కొంటున్న పరిస్థితులు మాత్రం హృదయ విదారకంగా ఉన్నాయి. చెల్లించాల్సిన బకాయిలు శూన్యం. 2024 మార్చి నుంచి ఇప్పటి వరకు సుమారు 16 వేలమంది ఉద్యోగ-ఉపాధ్యాయ పెన్షనర్లకు చట్టబద్ధంగా ఇవ్వాల్సిన రిటైర్మెంట్ బకాయిలు, గ్రాట్యుటీ, కమ్యూటేషన్, జీపీఎఫ్, టీఎస్‌జీఎల్ఐ, సరెండర్ లీవ్, లీవ్ ఎన్‌కాష్‌మెంట్ ఇవన్నీ ఒక్కరూపాయి కూడా విడుదల కాకపోవడం ప్రభుత్వం చూపుతున్న నిర్లక్ష్యానికి నిదర్శనం. జీవితాంతం క్రమశిక్షణతో సేవ చేసిన ఉద్యోగులకు రిటైర్మెంట్ రోజునే ఇవ్వాల్సిన మొత్తాన్ని ఎటూ తేల్చకుండా నెలల తరబడి నిలిపి వేయడం అమానవీయం కాదా? ఈ మొత్తాలు గృహం నిర్మించుకోవడానికి, వైద్యచికిత్సకు, అప్పుల చెల్లింపులకు ఉపయోగపడతాయని ఆశించిన వృద్ధులు నేడు అప్పుల దెబ్బకు, ఈఎంఐల ఒత్తిడిలో, అనారోగ్యంతో, మానసిక వేదనతో కుమిలిపోతున్నారు. వృద్ధాప్యంలో ఇలాంటి అవమానకర పరిస్థితి ఎవరికి రాకూడదు. ఆవేదనలో ఒత్తిడి గురైన కారణంగా ఇప్పటి వరకు సుమారు 28మంది పెన్షనర్లు మరణించడం ఈ సమస్య భయంకర తీవ్రతను చూపుతుంది. అయినప్పటికీ






ప్రభుత్వం స్పందించకపోవడం మరణాల కంటే భయంకరమైన విషయం. పెన్షనర్ల జీర్ణించుకోలేకపోతున్నా రు. సేవలో ఉన్నప్పుడు ఉద్యోగుల కోసం పోరాడిన సంఘా లు, నేడు అదే పెన్షనర్ల సమస్యలపై నోరు విప్పకపోవడం ఘోర అవమానం. వారి డిమాండ్లు అధికారిక జాబితాల్లో కూడా లేకపోవడం పెన్షనర్లలో తీవ్ర వేదన కలిగిస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా ఉద్య మం ఈ నిర్లక్ష్యానికి వ్యతిరేకంగా 2024మార్చి తర్వాత పదవీ విరమణ చేసిన వృద్ధపెన్షనర్లు జిల్లాల వారీగా ఐక్యమై రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ -తెలంగాణ (2024-25) రూపంలో రాష్ట్రస్థాయిలో బకాయిల సాధన సమితిని ఏర్పాటు చేశారు. వైద్య సమస్యలతో, వయస్సుతో బాధపడుతున్నా ప్రజాస్వామ్య పద్ధతిలోఎమ్మెల్యేలు, మంత్రులు, సీఎంఓ వరకు వినతిపత్రాలు సమర్పించారు. వాగ్దానాలకే పరిమితమై, అమలు మాత్రం కనిపించకపోవడం నిరాశ కలిగిస్తోంది. డిసెంబర్ 17 నాడు మనం పెన్షనర్లకుకృతజ్ఞత తెలియజేసే వేళ తెలంగాణలో వేలాదిపెన్షనర్లు తమ హక్కుల కోసం రోడ్డెక్కాల్సిన పరిస్థితి ఉండటం ఎంత దురదృష్టకరం? జాతీయ పెన్షనర్స్‌డే సందేశం స్పష్టం చేస్తుంది. పెన్షన్ భిక్షకాదు హక్కుదేశ నిర్మాణానికి సేవ చేసిన పెద్దలను తల్లిదండ్రుల్లా గౌరవించి వారికి రావాల్సిన బకాయిలను వెంటనే అందించడమే నిజమైన మానవీయ పాలనకు నిదర్శనం. ప్రజాప్రతినిధులు తమ వేతనాలు, అలవెన్సులు నిలిపివేస్తే? ఒకరోజు కూడా తట్టుకోవటం కష్టం. అయితే వేలాది వృద్ధుల రిటైర్మెంట్ బకాయిలను ఆర్థికలోటు పేరుతో నిలిపివేయడం ఎంత వరకు న్యాయం? రెండు మూడు పెన్షన్లు తీసుకునే వారు ఉన్న చోట, ఒక్క పెన్షన్‌కూ నోచుకోని వృద్ధులకు రిటైర్మెంట్ బకాయిలు ఆలస్యం కావడం మానవత్వానికి ప్రశ్న. ప్రజాస్వామ్యంలో చట్టబద్ధంగా ఇవ్వాల్సిన బకాయిలను ఇవ్వ కపో వడం వల్ల పెన్షనర్ల మరణాలకు ప్రభుత్వం బాధ్యత వహించాల్సిన పరిస్థితి నెలకొంటోంది. జాతీయ పెన్షనర్స్ డే సందేశాన్ని గౌరవించాలంటే రిటైర్మెంట్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలి. ప్రభుత్వం మాటలు కాదు? కార్యా చరణ చూపాలి. ●

# కనురెప్పలే కాటేస్తే కాపెవ్వరు కంటికి!

పూసాల సత్యనారాయణ

ప్రజా ప్రతినిధులే ప్రభుత్వ భూములు ఆక్రమించితే ప్రజలకు రక్షణ సంక్షేమం ఇంకెక్కడా? హైదరాబాద్ జిహెచ్ఎంసి పరిధిలోని చెరువులు పార్కులు, లేఅవుట్‌లోని ఖాళీస్థలాలు, ఆటస్థలాలు, నాలాలు, రహదారులు, ఫుట్‌పాత్‌లు, క్రమేణా ఆక్రమణలకు గురై ప్రజానీకానికి నష్టంజరుగుతూఉంటే పాలకులు బాహుబలి సినిమాలా చూస్తున్నారా? రాజకీయాలకు అతీతంగా చెప్పాలంటే కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హైడ్రాను ఏర్పాటు చేసి‘ దేర్అండ్ డైనమిక్ లీడర్’అనిపించుకున్నారు. నీతి నిజాయితీగా పనిచేసి రాష్ట్రపతి గ్యాలంటరీ అవార్డ్ తీసుకున్న రంగనాథ్ గారిని హైడ్రా కమిషనర్ నియమించడం హర్షించదగిన విషయం. హైదరాబాద్ ప్రభుత్వ భూములకు రక్షణ కవచంగా పనిచేస్తుందని ప్రసార మాధ్యమాలు చేసే రుజువు చాలదా! రాజకీయ ఒత్తిడిలకు లొంగకుండా 50,000 కోట్లు విలువైన ప్రభుత్వ భూములను ఆక్రమణ దారుల నుండి తిరిగి స్వాధీనం చేసుకోవడం అంటే చరిత్ర తిరిగి రాసినట్లే కదా! ఫిర్యాదులు రాగానేవెంటనే స్పందించి చర్యలు చేపట్టే ఉన్నతాధికారులు జల్లెడ పట్టినా కనబడ్డారా! ఒక్క రంగనాథ్ హైడ్రా కమిషనర్ తప్ప. ప్రభుత్వ ఖజానా ఖాళీ చేసే వారేకాని ఆదా చేసి ప్రజా సంక్షేమాలకు ఖర్చు పెట్టే పాలకులు ఉంటే ఒట్టు. అప్పులు చేసిగ్యారంటీ పథకాలు కూడా అమలు చేయని రాష్ట్ర ప్రభుత్వాలు ఎందుకు? నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటడానికేనా? తళుకు బెళుకు ఉన్నతాధికారులు ఎంత మంది ఉంటే ఏమి లాభం? కొరడా ఝుళిపించి ప్రభుత్వానికి ఆదాయం తెచ్చి పెట్టడం ఒక్కటే కాదు నీటి కొరత తీర్చుకుంటూ వరద ముప్పు నుండి కాపాడు దృశ్యాలు కొనియాడదగినవికాదా? ప్రకృతిని కొల్లగొట్టే వారే కాని దానికి పాలిచ్చి పెంచిపోషించే వారేరి? రక్షించే వారు ముక్కోటి దేవతలు కళ్ళముందు కదలాడే హైడ్రానే నండోయి ! అభివృద్ధి పేర కొండలు కోనలు, నదులు ధ్వంసం చేసేది ఎవరు? భూకంపాలు సునామీ సృష్టించే వారెవ్వరు? ప్రజోపకరమైన పనులు చేస్తుంటే రాజకీయాలకతీతంగా వెన్నుతట్టి ప్రోత్సహించే వారేరి? భారీ వర్షాల్లో వరదలు ముప్పు తప్పించిన ప్రభుత్వాలు ఉన్నాయా! హాల్‌చల్ చేసి సైలెంట్‌గా ఉండే అధికారులే కదా ! అందుకే ‘యాదర్థ వాది లోక విరోధి’



అన్నారు. బాల్ లింగంపల్లి, శ్రీనగర్ బస్తీ వాసులు ర్యాలీలుతీసి హైడ్రాకు అభినందనలు తెలుపుతూ ప్లకార్డులు ప్రదర్శించడం హైడ్రా విజయానికి సంకేతమే మరి ! వర్షంపడితే నడుం లోతు నీటిలో బస్తీనీ వరద ముంచెత్తేది. హైడ్రాకు ఫిర్యాదు చేయగానే వరద ముప్పు తప్పించి దశాబ్దాలుగా ఉన్న సమస్యను పరిష్కారం చేసినారని కాలని వాసులు హైడ్రా చర్యలను అభినందనలతో ముంచెత్తి దసరా దీపావళి సంబరాలు చేసుకున్నారే? స్థానిక ప్రజా ప్రతినిధులు వరద కాలువను ఆక్రమించి మళ్లించడం వలన వరదలు ఇంటిలోకి రావడంతో ఇబ్బంది పడ్డామని బాధితులు చెప్పడం స్థానిక నాయకులకు సిగ్గుచేటు కాదా ! హైదరాబాద్ శివారు ప్రాంతంలోని చెరువు కుంటలు, నాలాలు, కబ్జాల నుండి విముక్తి చేయడం ఎవరి తరం? వందల కోట్ల రూపాయల ప్రభుత్వ ఆక్రమణ భూములను విడిపించి తెలంగాణ కోటి రత్నాల వీణ మీటింది ఎవరు? ఆ ఘనత హైడ్రాకు కాక ఇంకెవ్వరికీ ? భాగ్యనగరానికి చెరువులు, కుంటలు అందమైన అలంకారం ఆకర్షణీయం కాదా ? గండిపేట మండలం మణికొండ మునిసిపాలిటీ పరిధిలోని శ్రీ వెంకటేశ్వర కాలనీలో ఉన్న 1600 గజాల స్థలంలోని పార్కును ఆక్రమణ నుండి విముక్తి చేయిస్తే స్థానికుల కళ్లలో ఆనందం వెల్లివిరియలేదా ? ఆక్రమణ దారుల గుండెల్లో రైళ్లు పరుగులు తీయించింది హైడ్రానే కదా! ర్యాలీలు ప్రదర్శనలతో హైడ్రా పై దుష్ప్రచారాన్ని తిప్పి కొట్టింది ప్రజలే కదా ? చెరువులు, కుంటలు, కబ్జా చేసుకొని వ్యాపారం చేసే బడా బాబులు వరద ముంపునకు కారణం కాదా ?వారిని దేశద్రోహులు అనవచ్చా ! భారత శిక్షా స్మృతి ప్రకారం ఏ నేరం కింద పరిగణించవచ్చు? కఠిన శిక్షలకు దుబాయ్‌లోని రాజుల వద్దనేర్చుకోవాలి. పేదలు మాత్రం బఫర్ జోన్‌లోనే గుడిసెలు వేసుకొని చెరువులను ఏడిపించడం ఎందుకు? వారికి మద్దతుగా రాజకీయ నాటకాలుచేసే పార్టీలు మాత్రం అధికారంలో ఉన్నప్పుడు చేసిన నిర్వాకంఏమి? బతుకమ్మకుంట, తమ్మిడి కుంట, నల్లచెరువు, సున్నం చెరువులకు జీవంపోసి పూర్వవైభవానికి దారులు చూపింది ‘హైదరాబాద్ డిసాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్స్ ప్రొటెక్షన్ ఏజెన్సీ’ కాదా ? చెరువు ,కుంటలు నిండు కుండాలా ఉండాలి. బతుకమ్మ బోనాల పండుగలు మత్తడి దుంకాలి. దీపావళి దసరాలు గుస్సాడి నాట్యం చెయ్యాలి. రంజాన్, క్రిస్టమస్ ప్రార్థనలు ఆకాశంలో మార్మోగాలి. మూసినదీ మురుగు వాసన లేక మురిసి మురిసి పోవాలి. హైడ్రా అంటే అభయహస్తమే నండోయి! హై డ్రామా మాత్రం కాదండోయ్ ! ●

# కోల్‌కతా మెస్సీ ఘటన: క్రీడామంత్రి రాజీనామా



**కోల్‌కతా, డిసెంబర్ 16:** అర్జెంటీని ఫుట్‌బాల్ దిగ్గజం లియోనెల్ మెస్సి పర్యటన వేళ కోల్‌కతా స్టేడియంలో ఉద్రిక్తతలు చోటుచేసుకున్న సంగతి తెలిసిందే. ఈ ఘటనపై బెంగాల్ ప్రభుత్వం దర్యాప్తు చేస్తున్న నేపథ్యంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. రాష్ట్ర క్రీడల మంత్రి అరూప్ బిశ్వాస్ తన పదవికి రాజీనామా చేశారు. స్టేడియంలో గందరగోళం విషయంలో ఆయనపై తీవ్ర విమర్శలు వస్తుండడంతో ఈ ఘటనపై న్యాయబద్ధంగా దర్యాప్తు జరిగేందుకు వీలుగా తాను రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు ముఖ్యమంత్రి మమతా బెనర్జీకి తన రాజీనామా లేఖను పంపినట్లు తెలిపారు. ఈ ఘటనపై దర్యాప్తు చేస్తున్న విచారణ కమిటీ సూచనల మేరకు బెంగాల్ ప్రభుత్వం డిజిపి రాజీవ్‌కుమార్, బిధాన్‌నగర్ పోలీస్ కమిషనర్ ముఖేశ్‌కుమార్, యువజన వ్యవహారాలు క్రీడాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ రాజేశ్ కుమార్ సిన్హాలకు షోకాజ్ నోటీసులు జారీ చేసింది. ఘటనలో లోపాలపై 24 గంటల్లోగా వివరణ ఇవ్వాలని ఆదేశించింది. బిధాన్‌నగర్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ అనీష్ సర్కార్‌ను విధుల నుంచి సస్పెండ్ చేసి, శాఖాపరమైన చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు వెల్లడించారు. భారత పర్యటనలో భాగంగా కోల్‌కతా స్టేడియానికి వచ్చిన మెస్సి కొన్ని నిమిషాల్లోనే అక్కడి నుంచి వెళ్లిపోవడంతో ప్రేక్షకులు ఆగ్రహానికి గురయ్యారు. కొంత మంది బారికేడ్లను దాటి మైదానంలోకి దూసుకెళ్లారు. క్రీడాశాఖమంత్రి అరూప్ బిశ్వాస్, ఈవెంట్ నిర్వాహకుడు శతద్రు దత్తాను అరెస్టు చేయాలని నినాదాలు చేశారు. దీంతో ఈ ఘటనపై దర్యాప్తుకు రాష్ట్ర ప్రభుత్వం విచారణ కమిటీని ఏర్పాటు చేసింది.

# గాంధీ ఉపాధి పథకానికి చెల్లుచీటీ!

## ఆ స్థానంలో కొత్త పథకం తెస్తున్న ఎన్డీయే సర్కారు



**న్యూఢిల్లీ, డిసెంబరు 16:** దేశ గ్రామీణ ఉపాధి వ్యవస్థలో భారీ మార్పులకు కేంద్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. రెండు దశాబ్దాలుగా అమల్లో ఉన్న మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం స్థానంలో సరికొత్త చట్టాన్ని తీసుకురానుంది. "వికసిత భారత్ గ్యారెంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవికా మిషన్ (గ్రామీణ్)" బిల్లు, 2025 పేరుతో రూపొందించిన ఈ బిల్లును కేంద్రం లోక్‌సభలో ప్రవేశపెట్టేందుకు సిద్ధమైంది. వికసిత భారత్ 2047 లక్ష్యాలకు అనుగుణంగా గ్రామీణ ఉపాధి, అభివృద్ధి కార్యక్రమాలను తీర్చిదిద్దడమే ఈ కొత్త చట్టం ముఖ్య ఉద్దేశం. ఉపాధి హామీ చట్టం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు మెరుగుపడినప్పటికీ, దాని అమలులో అనేక నిర్మాణాత్మక లోపాలు ఉన్నాయని కేంద్రం భావిస్తోంది. నిధుల దుర్వినియోగం, డిజిటల్ హాజరును పక్కదారి పట్టించడం, చేపట్టిన పనులకు, పెట్టిన ఖర్చుకు పొంతన లేకపోవడం వంటి సమస్యలు వ్యవస్థను బలహీనపరిచాయని పేర్కొంది. ఈ నేపథ్యంలోనే పాత చట్టాన్ని రద్దు చేసి, మరింత ఆధునిక, పారదర్శక విధానాలతో కూడిన కొత్త చట్టాన్ని తీసుకురావాల్సిన అవసరం ఏర్పడిందని వివరించింది. ప్రస్తుత ఉపాధి హామీ పథకం కింద ప్రతి గ్రామీణ కుటుంబానికి ఏడాదికి 100 రోజుల పని దినాలు కల్పిస్తుండగా, కొత్త బిల్లులో దీనిని 125 రోజులకు పెంచారు. నైపుణ్యం అవసరం లేని పనులు చేయడానికి ముందుకొచ్చే వయోజన సభ్యులకు ఈ గ్యారెంటీ వర్తిస్తుంది. నిధుల కేటాయింపులో మార్పు: ప్రస్తుతం అమల్లో ఉన్న ఉపాధి హామీ చట్టం ప్రకారం, నైపుణ్యం లేని కార్మికుల వేతనాల ఖర్చును పూర్తిగా కేంద్ర ప్రభుత్వమే భరిస్తోంది. పనులకు అవసరమైన సామగ్రి ఖర్చులో నాలుగింట మూడు వంతులు (75 శాతం), నైపుణ్యం కలిగిన, పాక్షిక నైపుణ్యం ఉన్న కార్మికుల వేతనాల్లో నాలుగింట మూడు వంతుల వాటాను కూడా కేంద్రమే అందిస్తోంది. సాధారణ రాష్ట్రాల్లో కూలీల వేతనాల చెల్లింపులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వాటా 60:40 నిష్పత్తిలో ఉంటుంది. ప్రత్యేక కేటగిరీ ప్రాంతాలకు ఇది 90:10గా ఉంటుంది. నిరుద్యోగ భృతిని మాత్రం రాష్ట్రాలే చెల్లించాల్సి ఉంటుంది. వ్యవసాయ పనులు ఎక్కువగా ఉండే కాలంలో కూలీల కొరతను నివారించేందుకు రాష్ట్రాలకు కొత్త అధికారాన్ని కల్పించారు. ఒక ఆర్థిక సంవత్సరంలో గరిష్ఠంగా 60 రోజుల పాటు పనులను నిలిపివేయవచ్చు. ఈ 60 రోజులు నిరంతరాయంగా ఉండాల్సిన అవసరం లేదు. మిగిలిన రోజుల్లో కార్మికులకు పూర్తి 125 రోజుల పని కల్పించాల్సి ఉంటుంది. కూలీలకు ప్రతి వారం వేతనాలు చెల్లించాలని, గరిష్ఠంగా పదిహేను రోజులకు మించి ఆలస్యం చేయరాదని బిల్లులో స్పష్టంగా పేర్కొన్నారు. కొత్త వ్యవస్థలో పారదర్శకత, జవాబుదారీతనం పెంచేందుకు ఆధునిక సాంకేతికతను వినియోగించనున్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత మోసాల గుర్తింపు, జీపీఎస్, మొబైల్ ఆధారిత పర్యవేక్షణ, రియల్‌టైమ్ డాష్‌బోర్డులు, మెరుగైన సోషల్ ఆడిట్‌లు వంటివి అమలు చేయనున్నారు. కేంద్ర, రాష్ట్ర స్థాయిల్లో పర్యవేక్షణ కమిటీలు కూడా ఏర్పాటు కానున్నాయి. ఈ చట్టం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో ఉత్పాదక ఆస్తుల కల్పన, నీటి భద్రత, మౌలిక వసతుల కల్పన పెరుగుతుంది. తద్వారా గ్రామీణుల ఆదాయాలు పెరిగి, ఆర్థిక స్థితి మెరుగుపడుతుంది. వలసలు తగ్గుముఖం పడతాయి. విత్తనాలు వేసే, పంట కోతల సమయంలో 60 రోజుల పాటు పనులకు విరామం ఇవ్వడం వల్ల వ్యవసాయ పనులకు కూలీల కొరత ఉండదు. నీటిపారుదల పనులకు అధిక ప్రాధాన్యత ఇవ్వడం వల్ల భూగర్భ జలాలు పెరిగి, ఎక్కువ కాలం పంటలు పండించే అవకాశం కలుగుతుంది. 125కి పెరగడంతో కూలీల వార్షిక ఆదాయం పెరుగుతుంది. ప్రతి వారం వేతనాలు చెల్లించడం, గరిష్ఠంగా పదిహేను రోజుల్లోపు చెల్లింపులు పూర్తిచేయాలనే నిబంధన వారికి ఆర్థిక భరోసా ఇస్తుంది.

# ఐదేళ్లూ సిఎం నేనే..

## అసెంబ్లీలో సిద్ధరామయ్య ప్రకటన

**బెంగళూరు, డిసెంబరు 16:** కర్ణాటక రాజకీయాల్లో ముఖ్యమంత్రి పదవి మార్పుపై జరుగుతున్న ప్రచారానికి ముఖ్యమంత్రి సిద్ధరామయ్య అసెంబ్లీ వేదికగా ముగింపు పలికారు. ప్రజలు తనను ఐదేళ్ల కాలానికి ఎన్నుకున్నారని, పూర్తికాలం తానే ముఖ్యమంత్రిగా కొనసాగుతానని మంగళవారం శాసనసభలో ఆయన తెగేసి చెప్పారు. ఉప ముఖ్యమంత్రి, పీసీసీ అధ్యక్షుడు డీకే శివకుమార్ సీఎం రేసులో ఉన్న నేపథ్యంలో సిద్ధరామయ్య చేసిన ఈ వ్యాఖ్యలు రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకున్నాయి. గతంలో సీఎం పదవి మార్పుపై అధిష్ఠానం ఏ నిర్ణయం తీసుకున్నా కట్టుబడి ఉంటానని చెప్పిన సిద్ధరామయ్య, ఇప్పుడు అందుకు భిన్నంగా మాట్లాడటం గమనార్హం. అసెంబ్లీ సమావేశాల్లో డీసీసీ బ్యాంకుల ద్వారా రైతులకు రుణాల పంపిణీలో వివక్ష జరుగుతోందన్న అంశంపై చర్చ జరిగింది. ముఖ్యంగా సిద్ధరామయ్య సన్నిహితుడు కేఎన్ రాజన్న ప్రాతినిధ్యం వహిస్తున్న మధుగిరి, డీకే శివకుమార్ మద్దతుదారుడైన హెచ్‌డీ రంగనాథ్ ప్రాతినిధ్యం వహిస్తున్న కుణిగల్ నియోజక వర్గాల ప్రస్తావన వచ్చింది. ఈ సమయంలో జోక్యం చేసుకున్న ప్రతిపక్ష నేత ఆర్. అశోక్, ఇది కాంగ్రెస్‌లోని అంతర్గత కలహాల ఫలితమేమోనని వ్యాఖ్యానించారు. దీనికి సిద్ధరామయ్య బదులిస్తూ అగ్నికి ఆజ్యం పోసే పనులు చేయవద్దని హితవు పలికారు. అయితే, పార్టీలో అగ్గి ఉందని ముఖ్యమంత్రే ఒప్పుకున్నారని అశోక్ ఎద్దేవా చేశారు. తాను కేవలం సామెత మాత్రమే చెప్పానని సిద్ధరామయ్య స్పష్టం చేసినప్పటికీ, బీజేపీ ఎమ్మెల్యేలు ఈ అంశాన్ని వదల్లేదు. కాంగ్రెస్‌లో కొందరు నేతలు సీఎం అయ్యేందుకు ప్రత్యేక పూజలు, యాగాలు చేస్తున్నారని అశోక్ విమర్శించారు. దీనిపై సిద్ధరామయ్య తీవ్రంగా స్పందిస్తూ, తమ ప్రభుత్వానికి ఎలాంటి ధోకా లేదని, 140 మంది ఎమ్మెల్యేలు తనతోనే ఉన్నారని ధీమా వ్యక్తం చేశారు. ప్రతిపక్షాలు ఎన్ని ప్రయత్నాలు చేసినా తమ నేతలు రెచ్చిపోరని అన్నారు. ఈ క్రమంలో అశోక్ సూటిగా మీరు నిజంగా పూర్తికాలం సీఎంగా ఉంటారా అని ప్రశ్నించారు. దీనికి సిద్ధరామయ్య బదులిస్తూ, వినండి ప్రజలు మమ్మల్ని ఐదేళ్లపాటు ఆశీర్వదించారు. పూర్తికాలం నేనే ముఖ్యమంత్రిగా ఉంటానని నిక్కచ్చిగా తేల్చిచెప్పారు.

# నేషనల్ హెరాల్డ్ కేసులో సోనియా, రాహుల్‌కు ఊరట

**న్యూఢిల్లీ, డిసెంబరు 16:** నేషనల్ హెరాల్డ్ మనీలాండరింగ్ కేసులో కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీలకు తాత్కాలిక ఊరట లభించింది. ఈ కేసుకు సంబంధించి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) దాఖలు చేసిన ఛార్జ్‌షీట్‌ను పరిగణనలోకి తీసుకోవడానికి ఢిల్లీలోని రౌస్ అవెన్యూ కోర్టు నిరాకరించింది. ఈ సందర్భంగా దర్యాప్తు తీరుపై న్యాయస్థానం కీలక వ్యాఖ్యలు చేసింది. ఈడీ అధికారులు ఏ ఎఫ్ఐఆర్ ఆధారంగా దర్యాప్తు చేస్తున్నారని కోర్టు ప్రశ్నించింది. కేవలం బీజేపీ నేత సుబ్రమణియన్ స్వామి ఇచ్చిన ప్రైవేట్ ఫిర్యాదు ఆధారంగా నమోదైన కేసులో ఛార్జ్‌షీట్‌ను పరిగణనలోకి తీసుకోలేమని స్పష్టం చేసింది. మేజిస్ట్రేట్ ఇచ్చిన సమన్ల ఆదేశాల మేరకు కాకుండా, ఎఫ్ఐఆర్ ఆధారంగానే కేసు విచారణ జరగాలని పేర్కొంది. అయితే, ఈ కేసులో తదుపరి దర్యాప్తు కొనసాగించడానికి ఈడీకి న్యాయస్థానం అనుమతి ఇచ్చింది. దర్యాప్తును నిలిపివేయలేదని స్పష్టం చేసింది.

అదే సమయంలో, ఈ దశలో నిందితులుగా ఉన్న సోనియా, రాహుల్ గాంధీలకు ఎఫ్ఐఆర్ కాపీని పొందే అర్హత లేదని కూడా కోర్టు పేర్కొనడం గమనార్హం. తాజా పరిణామంతో గాంధీ కుటుంబానికి ఈ కేసులో కొంత ఉపశమనం లభించినట్లయింది.

# మంటల్లో కాలి బస్సులు బుగ్గి.. 13 మంది మృత్యువాత

**లక్నో, డిసెంబరు 16:** ఉత్తరప్రదేశ్‌లోని మథుర వద్ద ఢిల్లీ-ఆగ్రా ఎక్స్‌ప్రెస్ హైవేపై ఘోర ప్రమాదం జరిగిన విషయం తెలిసిందే. మంగళవారం తెల్లవారుజామున పొగమంచు కారణంగా బస్సులు, కార్లు ఒకదానికొకి ఢీ కొన్నాయి. ఆ తర్వాత భారీగా మంటలు చెలరేగి.. వాహనాలు దగ్ధమయ్యాయి. ఈ దుర్ఘటనలో మృతుల సంఖ్య 13కు పెరిగినట్లు అధికారులు తాజాగా తెలిపారు. ఈ ప్రమాదంలో సుమారు 80 మంది గాయపడినట్లు వెల్లడించారు. మంగళవారం తెల్లవారుజామున 2 గంటల సమయంలో ఢిల్లీ-ఆగ్రా ఎక్స్‌ప్రెస్ హైవేపై పది బస్సులు, పలు కార్లు ఒకదానికొకటి ఢీకొన్నాయి. దీంతో బస్సులకు మంటలు అంటుకున్నాయి. పెద్ద ఎత్తున అగ్నికీలలు ఎగసిపడటంతో ఏడు బస్సులు, కార్లు కాలి బూడిదయ్యాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని 11 అగ్నిమాపక శకటాలతో మంటలను అదుపు చేశారు.

## బ్రెజిల్‌లో ఈదురుగాలులకు కూలిపోయిన 'స్టాట్యూ ఆఫ్ లిబర్టీ'

**బ్రాసిలియా, డిసెంబరు 16:** బ్రెజిల్‌లో భారీ ఈదురు గాలుల కారణంగా ఓ షాపింగ్ స్టోర్ వెలుపల ఏర్పాటు చేసిన స్టాట్యూ ఆఫ్ లిబర్టీ నమూనా విగ్రహం కుప్పకూలింది. గ్వాబా నగరంలో నిన్న ఈ ఘటన చోటుచేసుకుంది. అదృష్టవశాత్తు ఈ ప్రమాదంలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. పోర్టో అలెగ్రే మెట్రోపాలిటన్ ప్రాంతంలోని "హవన్" రిటైల్ స్టోర్ కార్ పార్కింగ్ ఏరియాలో ఈ 24 మీటర్ల ఎత్తైన విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఆ ప్రాంతంలో గంటకు 90 కిలోమీటర్లకు పైగా వేగంతో బలమైన గాలులు వీచాయి. ఈ గాలుల ధాటికి తట్టుకోలేక విగ్రహం నెమ్మదిగా పక్కకు ఒరిగి, పార్కింగ్‌లో ఉన్న వాహనాల సమీపంలో కూలిపోయింది. ఈ ఘటనపై హవన్ స్టోర్ యాజమాన్యం ఒక ప్రకటన విడుదల చేసింది. దేశంలో నిర్దేశించిన సాంకేతిక ప్రమాణాలకు అనుగుణంగానే విగ్రహాన్ని నిర్మించామని, అయినప్పటికీ అంతర్గత విచారణ జరుపుతున్నామని తెలిపింది. ప్రమాదాన్ని ముందే పసిగట్టి ఆ ప్రాంతాన్ని ఖాళీ చేయించడం వల్ల ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని పేర్కొంది. బ్రెజిల్ అధికారులు కూడా ఈ ఘటనపై విచారణ చేపట్టారు. స్థానిక అధికారులు వేగంగా స్పందించారని గ్వాబా మేయర్ మార్సెలో మరానటా ప్రశంసించారు. వాతావరణ శాఖ ముందుగానే ఈ ప్రాంతంలో తుపాను హెచ్చరికలు జారీ చేసింది. శీతల గాలుల ప్రభావంతో ఈ పరిస్థితి ఏర్పడిందని, ఇవాళ్టి నుంచి వాతావరణం మెరుగుపడే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

# ఇమ్రాన్‌ను జైల్లో పెట్టి.. మునీర్‌కు సర్వాధికారాలా?

## ఐక్యరాజ్యసమితిలో పాక్‌ను ఎండగట్టిన భారత్



**న్యూయార్క్, డిసెంబరు 16:** ఐక్యరాజ్య సమితి భద్రతా మండలిలో దాయాది పాకిస్థాన్‌ను భారత్ మరోసారి ఎండగట్టింది. శాంతి గురించి బహిరంగంగా చర్చ సందర్భంగా జమ్మూ కాశ్మీర్ అంశాన్ని ప్రస్తావించిన పాక్‌కు భారత్ గట్టిగా బదులిచ్చింది. పాకిస్థాన్ మాజీ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్‌ను జైలుకు పంపి.. అతడికి విరోధి అయిన ఆసిమ్‌మునీర్‌కు సర్వాధికారాలు ఇచ్చిన ఘనత ఆ దేశానికే దక్కుతుందంటూ చురకలంటించింది. 'లీడర్‌షిప్ ఫర్ పీస్' అనే అంశంపై ఐక్యరాజ్య సమితి భద్రతా మండలిలో బహిరంగ చర్చ జరిగింది. ఈ చర్చ సందర్భంగా పాక్ ప్రతినిధి ఆసిమ్ ఇఫ్తికార్ అహ్మద్ మాట్లాడుతూ.. జమ్మూకాశ్మీర్ అంశాన్ని ప్రస్తావించారు. అంతేకాదు సింధూ జలాల ఒప్పందాన్ని భారత్ ఏకపక్షంగా నిలిపివేసిందంటూ ఆరోపణలు చేశారు. పాక్ వ్యాఖ్యలపై భారత్ ధీటుగా బదులిచ్చింది. ఈ మేరకు ఐరాస భారత్ శాశ్వత ప్రతినిధి హరీశ్ పర్వతనేని మాట్లాడుతూ.. జమ్మూ కాశ్మీర్, లద్దాఖ్‌లు భారత్‌లో అంతర్భాగమని, వాటిని విడదీయలేమని పునరుద్ఘాటించారు. భారత్‌కు, దేశంలోని ప్రజలకు హానికలిగించడంపైనే పాక్ దృష్టి ఉంటుందని విమర్శించారు. ఇక సింధూ జలాల ఒప్పందాన్ని భారత్ ఎందుకు ముగించిందో కూడా ఈ సందర్భంగా హరీశ్ పర్వతనేని వివరించారు. భారత్ 65 యేళ్ల కిందట విశ్వాసం, సంకల్పం, స్నేహ స్ఫూర్తితో సింధూ జలాల ఒప్పందం కుదుర్చుకుందని గుర్తు చేశారు. ఈ ఆరున్నర దశాబ్దాలుగా భారత్‌పై పాక్ మూడు యుద్ధాలు, వేలాది ఉగ్రదాడులకు పాల్పడి ఒప్పందాన్ని ఉల్లంఘించిందని మండిపడ్డారు. గత నాలుగు దశాబ్దాల్లో పాక్ జరిపిన ఉగ్రదాడుల్లో పదివేల మంది భారతీయులు ప్రాణాలు కోల్పోయినట్లు చెప్పారు. ఈ యేడాది ఏప్రిల్‌లో జమ్మూ కాశ్మీర్‌లోని పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడిని కూడా పర్వతనేని హరీశ్ ప్రస్తావించారు. ఈ దాడిలో ఓ విదేశీయుడు సహా 26 మంది పౌరులు మరణించినట్లు గుర్తు చేశారు. అందుకే ప్రపంచ ఉగ్రవాదానికి కేంద్రంగా ఉన్న పాకిస్థాన్.. ఉగ్రవాదానికి మద్దతు ముగించే వరకూ ఈ ఒప్పందాన్ని నిలుపుదల చేస్తామని ప్రకటించినట్లు వివరించారు. పాక్ ఉగ్రవాదం ఏ రూపంలో వచ్చిన భారత్ దాన్ని శక్తిమంతంగా ఎదుర్కొంటుందన్నారు.

# ఎంజిఎన్‌రేగా పేరు మార్పుపై ప్రియాంక తీవ్ర నిరసన

**న్యూఢిల్లీ, డిసెంబరు 16:** మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం స్థానంలో కొత్త చట్టాన్ని తీసుకురావాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించడంపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ లోక్‌సభలో వికసిత్ భారత్ రోజ్‌గార్ అండ్ ఆజీవికా మిషన్ (గ్రామీణ్) బిల్లు2025ను ప్రవేశపెట్టారు. ఈ బిల్లును కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా వ్యతిరేకించింది. కాంగ్రెస్ అగ్ర నాయకురాలు, వయనాడ్ ఎంపీ ప్రియాంక గాంధీ వాద్రా ఈ బిల్లును వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. లోక్‌సభలో రూల్ 72(1) కింద ఈ బిల్లును వ్యతిరేకిస్తున్నట్లు ప్రియాంక తెలిపారు. గత 20 ఏళ్లుగా గ్రామీణ ప్రజలకు ఉపాధి కల్పిస్తూ, గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసిన చట్టాన్ని బలహీనపరిచే కొత్త బిల్లును మేం తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని ఆమె స్పష్టం చేశారు. కొత్త చట్టం ప్రకారం డిమాండ్ ఆధారిత నిధుల కేటాయింపు విధానాన్ని రద్దు చేసి, కేంద్రమే ముందుగా నిధులు నిర్ణయించేలా మార్పులు చేస్తున్నారని ఆమె ఆరోపించారు. దీనివల్ల గ్రామ సభల పాత్ర కూడా బలహీనపడుతుందని, ఇది రాజ్యాంగ విరుద్ధమని అన్నారు.

చాలా రాష్ట్రాలకు కేంద్రం వాటాను 60 శాతానికి తగ్గించడం వల్ల ఇప్పటికే జీఎస్టీ బకాయిల కోసం ఎదురుచూస్తున్న రాష్ట్రాలపై మరింత భారం పడుతుందని ప్రియాంక ఆందోళన వ్యక్తం చేశారు. ఈ క్రమంలో ట్రెజరీ బెంచీల నుంచి కుటుంబం గురించి ఒకరు వ్యాఖ్యానించగా మహాత్మా గాంధీ నా కుటుంబ సభ్యుడు కాదు, కానీ నా కుటుంబ సభ్యుడి లాంటి వారు. దేశం మొత్తం అలాగే భావిస్తుందని ఆమె గట్టిగా బదులిచ్చారు. మరోవైపు, ఈ విమర్శలపై ప్రభుత్వ వర్గాలు స్పందిస్తూవికసిత్ భారత్ 2047 లక్ష్యానికి అనుగుణంగానే ఈ బిల్లును రూపొందించినట్లు తెలిపాయి.

# అత్యవసర లాండింగ్‌లో కుప్పకూలిన విమానం

## ఏడుగురు సజీవదహనం



**మెక్సికోసిటీ, డిసెంబరు 16:** మెక్సికోలో ఘోర విమాన ప్రమాదం చోటుచేసుకుంది. అత్యవసర ల్యాండింగ్ చేసేందుకు ప్రయత్నిస్తూ ఓ ప్రైవేట్ విమానం కుప్పకూలిన ఘటనలో ఏడుగురు దుర్మరణం పాలయ్యారు. ఈ విషయాన్ని మెక్సికో స్టేట్ సివిల్ ప్రొటెక్షన్ కోఆర్డినేటర్ అడ్రిన్ హెర్నాండెజ్ అధికారికంగా ధ్రువీకరించారు. మెక్సికో సిటీకి పశ్చిమాన సుమారు 50 కిలోమీటర్ల దూరంలో ఉన్న టొలుకా ఎయిర్‌పోర్ట్‌కు సమీపంలోని శాన్ మాటియో అటెంకో అనే పారిశ్రామిక ప్రాంతంలో ఈ దుర్ఘటన జరిగింది. పసిఫిక్ తీరంలోని అకాపుల్కో నుంచి బయల్దేరిన ఈ విమానంలో ఇద్దరు సిబ్బంది, ఎనిమిది మంది ప్రయాణికులు ఉన్నారు. ప్రమాదం జరిగిన చాలా గంటల తర్వాత కూడా ఏడు మృతదేహాలను మాత్రమే గుర్తించినట్లు అధికారులు తెలిపారు. సమీపంలోని సాకర్ మైదానంలో విమానాన్ని అత్యవసరంగా ల్యాండ్ చేసేందుకు పైలట్ ప్రయత్నించినట్లు తెలుస్తోంది. అయితే, అదుపుతప్పిన విమానం ఓ వాణిజ్య భవనం పైకప్పును బలంగా ఢీకొట్టింది. దీంతో ఒక్కసారిగా భారీగా మంటలు చెలరేగాయి. ముందుజాగ్రత్త చర్యగా ప్రమాద స్థలం నుంచి సుమారు 130 మందిని ఖాళీ చేయించినట్లు శాన్ మాటియో అటెంకో మేయర్ అనా మునిజ్ వెల్లడించారు. ప్రమాదానికి గల కారణాలపై అధికారులు దర్యాప్తు ప్రారంభించారు.

# బిబిసిపై ట్రంప్ రూ.90వేల కోట్లకు దావా



**మియామి, డిసెంబరు 16:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ప్రఖ్యాత మీడియా సంస్థ బీబీసీ మధ్య వివాదంమరింతగారాజుకుంది. 2021 జనవరి 6వ తేదీన ఆయన చేసిన ప్రసంగాన్ని బీబీసీ ఛానల్ తప్పుడు అర్థం వచ్చేలా మార్చేసి ప్రసారం చేయడం వల్లే క్యాపిటల్ హిల్‌లో అల్లర్లు జరిగినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో బీబీసీకి ట్రంప్ తాజాగా గట్టి షాకిచ్చారు. సంస్థపై పరువు నష్టం దావా వేశారు. 10 బిలియన్ డాలర్లు నష్టపరిహారం డిమాండ్ చేశారు. మియామిలోని ఫెడరల్ కోర్టులో ట్రంప్ దావా వేశారు. భారత కరెన్సీలో ఈ పది బిలియన్ డాలర్లు అంటే సుమారు 90 వేల కోట్ల రూపాయలు అన్న మాట. భారీ మొత్తం డిమాండ్‌చేస్తూ ట్రంప్ బిబిసి పనిపడతామన్నట్లుగా ఈ దావా దాఖలుచేసినట్లు తెలుస్తోంది. వివరాల్లోకి వెళితే, 2020లో జరిగిన దేశాధ్యక్ష ఎన్నికల ఫలితాలు వెలువడిన తర్వాత 2021 జనవరి 6న వాషింగ్టన్‌లోని క్యాపిటల్ హిల్‌పై ఆయన మద్దతుదారులు దాడి చేశారు. ఆ సందర్భంగా ట్రంప్ దాదాపు గంటసేపు ప్రసంగించారు. దీనిపై బీబీసీ ప్రసారం చేసిన డాక్యుమెంటరీలో తన ప్రసంగాన్ని వక్రీకరించారని ట్రంప్ ఆరోపిస్తున్నారు. ఇక ఈ వివాదం నేపథ్యంలో ట్రంప్‌కు బీబీసీ క్షమాపణలు కూడా చెప్పింది. బీబీసీ చైర్మెన్ సమీర్ షా వైట్‌హౌజ్‌కు ప్రత్యేకంగా లేఖ రాశారు. ట్రంప్ ప్రసంగాన్ని ఎడిట్ చేసిన అంశంలో తనతో పాటు సంస్థ క్షమాపణలు చెబుతున్నట్లు పేర్కొన్నారు. తాము ప్రసారం చేసిన ఆ వివాదాస్పద డాక్యుమెంటరీని మళ్లీ ప్రసారం చేసే ప్రణాళిక లేదని బీబీసీ వెల్లడించింది. తాము ఎడిట్ చేసిన ట్రంప్ ప్రసంగం తప్పుదోవ పట్టించే రీతిలో ఉన్నట్లు అంగీకరిస్తున్నామని బీబీసీ చెప్పింది. దీన్ని ఫేక్ న్యూస్‌గా అభివర్ణించారు. వార్తల తయారీలో ఏఐ వినియోగంపై అమెరికా, ఐరోపా దేశాల్లో ఆందోళనలు పెరుగుతున్న నేపథ్యంలో ట్రంప్ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ఇదే సమయంలో చైనా, మానవ హక్కుల అంశంపై స్పందిస్తూ హాంకాంగ్ మీడియా వ్యాపారి జిమ్మీ లై కేసును తాను నేరుగా అధ్యక్షుడు జిన్‌పింగ్ ప్రస్తావించారు.


## సంక్షిప్తంగా..

### భర్తపై సెలీనా జైట్లీ రూ.100 కోట్ల పరిహారం కోరుతూ కేసు



ముంబయి, డిసెంబరు 16: బాలీవుడ్ నటి సెలినా జైట్లీ తన భర్త, ఆస్ట్రియాకు చెందిన హోటల్ వ్యాపారి పీటర్ హాగ్‌పై ముంబై కోర్టులో గృహ హింస కేసు దాఖలు చేశారు. 15 ఏళ్ల తమ వైవాహిక జీవితంలో భర్త నుంచి శారీరక, మానసిక, లైంగిక వేధింపులు ఎదుర్కొన్నానని ఆమె ఆరోపించారు. పరిహారంగా రూ.100 కోట్లతో పాటు, నెలకు రూ.10 లక్షల భరణం ఇప్పించాలని ఆమె కోర్టును అభ్యర్థించారు. సెలినా జైట్లీ నవంబర్ 25న అంధేరి మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టులో ఈ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ జరిపిన న్యాయస్థానం, ఇరుపక్షాలనూ తమ ఆదాయ వివరాలతో కూడిన అఫిడవిట్లను జనవరి 27లోగా సమర్పించాలని ఆదేశించింది. గృహ హింస చట్టం కింద దాఖలైన ఈ ఫిర్యాదుపై సమాధానం ఇవ్వాలని పీటర్ హాగ్‌ను కోర్టు ఆదేశించింది. తన పిటిషన్‌లో సెలినా పలు తీవ్ర ఆరోపణలు చేశారు.

### గ్రీన్‌కార్డు ఇంటర్వ్యూకు వెళ్లిన భారత సంతతి మహిళ అరెస్ట్



**వాషింగ్టన్, డిసెంబర్ 16:** అమెరికాలో 30 ఏళ్లుగా నివసిస్తున్న 60 ఏళ్ల భారత సంతతి మహిళ, తన గ్రీన్ కార్డ్ ఇంటర్వ్యూ చివరి దశలో ఉండగా ఇమ్మిగ్రేషన్ అధికారుల చేతిలో అరెస్టయ్యారు. బబ్లీజీత్ కౌర్ అలియాస్ బబ్లీ అనే ఈ మహిళ, గ్రీన్ కార్డ్ దరఖాస్తుకు సంబంధించిన బయోమెట్రిక్ స్కాన్ అపాయింట్‌మెంట్‌కు వెళ్లినప్పుడు ఈ సంఘటన జరిగింది. 1994 నుంచి అమెరికాలో ఉంటున్న బబ్లీజీత్ కౌర్ ఈనెల 1న యూఎస్ ఇమ్మిగ్రేషన్ అండ్ కస్టమ్స్ ఎన్‌ఫోర్స్ మెంట్ కార్యాలయానికి వెళ్లారు. ఆమె ఫ్రంట్ డెస్క్ వద్ద ఉండగా, పలువురు ఫెడరల్ ఏజెంట్లు భవనంలోకి ప్రవేశించి, ఆమెను గదిలోకి పిలిచి అరెస్ట్ చేస్తున్నట్లు చెప్పారని కుమార్తె జ్యోతి తెలిపారు. అటార్నీతో ఫోన్‌లో మాట్లాడేందుకు అనుమతి ఇచ్చినప్పటికీ, ఆమెను అదుపులోకి తీసుకున్నారు.

### ఇదే మెషిన్‌పై నాలుగుసార్లు గెలిచా .. ఇవిఎంలపై సుప్రియాసూలె

**మహారాష్ట్ర , డిసెంబర్ 16:** ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల పనితీరుపై ఎన్నికల సమయాల్లో ప్రతిపక్షాలు విమర్శలు చేయడాన్ని ఎన్సీపి ఎంపి సుప్రీయా సూలె తప్పుబట్టారు. మహారాష్ట్ర ఎన్నికల్లో బిజెపి విజయానికి ఇవిఎంలు, వివిప్యాట్‌లను అనుమానించలేనని అన్నారు. మహారాష్ట్రలోని బారామతి నుంచి తాను అదే మెషిన్‌పై నాలుగుసార్లు గెలిచానన్నారు. ఎన్నికల సంస్కరణలపై జరిగిన చర్చలో సుప్రియా సూలె ఈ వ్యాఖ్యలు చేశారు. ఎన్నికల సంస్కరణల చర్చలో కాంగ్రెస్ నేతలు మాట్లాడుతూ దేశంలో ప్రజాస్వామ్యాన్ని దెబ్బతీసేందుకు బిజెపి ఎన్నికల కమిషన్‌ను వాడుకుంటోందని ఆరోపించారు. మహారాష్ట్ర ఎన్నికల్లో ఇవిఎం రిగ్గింగ్ జరిగిందంటూ ఆరోపించారు. ఎన్నికల కమిషనర్లను నియమించే ఎంపిక ప్యానెల్ నుంచి భారత ప్రధాన న్యాయమూర్తిని ఎందుకు తొలగించారని ప్రశ్నించారు.

### బెంగాల్‌లో 58 లక్షల ఓట్లు తొలగింపు!

**కోల్‌కతా, డిసెంబరు 16:** పశ్చిమబెంగాల్‌లో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) చేపట్టిన విషయం తెలిసిందే. ప్రత్యేక ఓటరు సర్వే తర్వాత ముసాయిదా ఓటర్ల జాబితాను అధికారులు మంగళవారం విడుదల చేశారు. అయితే అ జాబితా నుంచి 58 లక్షలకుపైగా ఓట్లను అధికారులు తొలగించారు. అందులో 24 లక్షల మంది మరణించారని, మరో 19 లక్షల మంది ఇతర ప్రాంతాల్లో స్థిరపడ్డారని అధికారులు గుర్తించారు. మరో 12 లక్షల మంది తప్పిపోయారని, 1.3 లక్షల పేర్లు నకిలీవిగా గుర్తించారు. ఈ మేరకు జాబితా నుంచి ఆ పేర్లను తొలగించారు. ఈ వ్యవహారం ప్రస్తుతం రాజకీయంగా తీవ్ర దుమారం రేపుతోంది,

### ఆకును ఉమ్మినందుకు రూ.30 వేల జరిమానా

**లండన్, డిసెంబరు 16:** వైద్యుడి సలహా మేరకు వాకింగ్ కు వెళ్లిన ఓ వృద్ధుడికి చేదు అనుభవం ఎదురైంది. పార్క్ లో నడుస్తుండగా గాలికి ఎగిరొచ్చిన ఓ ఆకు వృద్ధుడి నోట్లో పడింది. వెంటనే ఆయన ఉమ్మేయడం ద్వారా దానిని బయట పారేశారు. ఇది గమనించిన ఇద్దరు ఎన్ ఫోర్స్ మెంట్ అధికారులు ఆ వృద్ధుడికి ఏకంగా రూ.30 వేల జరిమానా విధించారు. ఇంగ్లాండ్ లోని లింకన్ షైర్ లో 86 ఏళ్ల వృద్ధుడికి ఈ జరిమానా విధించారు. వాకింగ్ చేయాలన్న వైద్యుడి సలహా మేరకు సౌత్ పరేడ్ కార్ పార్క్ లో నిత్యం నడకకు వెళుతుండేవాడు. ఒకరోజు వాకింగ్ పూర్తి చేసుకుని అక్కడున్న బెంచీపైన కూర్చున్నపుడు బాగా గాలి వీయడంతో ఓ ఆకు ఎగిరి వచ్చి మార్ష్ నోట్లో పడటంతో వెంటనే దానిని బయటకు ఉమ్మేశారు. ఇది గమనించిన ఎన్ ఫోర్స్ మెంట్ అధికారులు మార్ష్ కు 250 పౌండ్ల జరిమానా విధించారు.



# గౌరమ్మ దర్శనం

## మహిళా భక్తుల సంబరం

శ్రీకాళహస్తి, డిసెంబరు 16 ప్రభాతవార్త: దక్షిణ కైలాసంగా ప్రఖ్యాతి గాంచిన శ్రీకాళహస్తీశ్వరాలయంలో నెల నెలా ఓ ఉత్సవం నిర్వహించటం ఆనవాయితీ. ఈ నేపథ్యంలో ధనుర్మాసం నెల రోజుల పాటు గొబ్బెమ్మను గ్రామోత్సవం నిర్వహించటం ఆనవాయితీ. ధనుర్మాసం సందర్భంగా అమ్మవారిని గొబ్బెమ్మగా ఊరేగించటం ఆనవాయితీ. ఈ నేపథ్యంలో మంగళవారం ధనుర్మాసం సందర్భంగా అమ్మవారు గొబ్బెమ్మగా అలంకరించి గ్రామోత్సవం నిర్వహించారు. అలంకార మండపంలో దేవేరిని కన్నుల పండువగా అలంకరించి బోయిలు మోసుకుంటూ శివయ్య మండపం నుంచి రాజగోపురం గుండా వాహనాల మండపం వద్దకు చేర్చారు. అక్కడ నుంచి వాహనంపై అమ్మవారిని గ్రామోత్సవం నిర్వహించారు. గొబ్బెమ్మ పట్టణంలో గ్రామోత్సవం రావటంతో ఇంటింటా నాలుగు మాడ వీధుల్లో అమ్మవారికి హారతులందించి మొక్కులు తీర్చుకున్నారు. నాలుగు మాడావీధుల్లోని ఇంటింటి ముందు మహిళలు చక్కగా సంప్రదాయం ఉట్టిపడేటట్లు ముగ్గులు వేసి మధ్యలో గొబ్బెమ్మను ఏర్పాటు చేసి పూజలు నిర్వహించారు. ఉత్సవంతోపాటు ఆలయానికి చెందిన ఇన్‌స్పెక్టర్లు హాజరయ్యారు. శ్రీకాళహస్తీశ్వరాలయంలో ధనుర్మాసం సందర్భంగా దర్శన వేళలు మార్పు చేసినట్లు ఇఓ ఇఓ డి.బాపిరెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 16 నుంచి జనవరి 15 వరకు దర్శన వేళలను ఉత్సవాల వివరాల్ని ఆయన ప్రకటించారు. శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహించే అభిషేకాల్లో శివయ్య జన్మదిన నక్షత్రం సందర్భంగా నిర్వహించే అభిషేకాన్ని అరుద్రాభిషేకం అంటారు. ఈ అభిషేకం జనవరి 3న నిర్వహించనున్నట్లు వివరించారు.



# గుడిమల్లం ఆలయం మరమ్మతులు

## ఫిబ్రవరి 22న బాలాలయం

శ్రీకాళహస్తిరూరల్, డిసెంబరు 16 ప్రభాతవార్త: శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని చారిత్రాత్మక ప్రసిద్ధి చెందిన పురావస్తుశాఖ పర్యవేక్షణలోని ఆనందవల్లి సమేత పరశురామేశ్వరాలయంలో జీర్ణోద్ధారణ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. మంగళవారం పురావస్తు శాఖ అధికారులు ఆలయ చైర్మన్ బత్తల గిరినాయుడు, ఆలయ ఇఓ రామచంద్రారెడ్డి సారథ్యంలో మరమ్మత్తులు చేపట్టారు. ప్రధానార్చకులు వంశీకృష్ణ, పురావస్తుశాఖకు చెందిన సిఎ బాలకృష్ణారెడ్డిలు పూజలు జరిపి పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ బత్తలగిరి నాయుడు, ఇఓ రామచంద్రారెడ్డి మాట్లాడుతూ ఆలయ మరమ్మత్తులు చేపట్టామని ఫిబ్రవరి 22న బాలాలయం చేయటానికి నిర్ణయించినట్లు వివరించారు. ప్రస్తుతం ఆలయ ఉపరితల భాగంలో పురాతన కాలం నాటి శ్లాబ్‌ను తొలగించి కొత్తగా శ్లాబ్ వేయబడుతుందన్నారు. అంతా సంప్రదాయ పద్ధతిలో సున్నం, బెల్లం, కరక్కాయలుతో కలసిన చూర్ణంతో పనులు చేపట్టారన్నారు. ఏప్రిల్ మొదటి వారంలో కుంభాభిషేకం చేయటానికి నిర్ణయించినట్లు చైర్మన్ బత్తలగిరి నాయుడు వివరించారు.

# 22ఎ కేసుల పరిష్కారంపై ఏలూరులో ప్రత్యేక వేదిక

- జిల్లాలోని 22ఎ భూ సమస్యలలో 90శాతం పరిష్కరిస్తాం
- దేవాదాయ భూములపై అధికారులు చర్యలు తీసుకుంటారు
- ప్రజల నుండి వినతులు స్వీకరించి వాటిని అక్కడికక్కడే పరిష్కరించిన జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి నాదెండ్ల మనోహార్

ఏలూరు, డిసెంబరు 16 ప్రభాతవార్త: రాష్ట్రంలోనే మొదటి సారిగా ఏలూరు జిల్లాలో 22ఎ భూ సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక పరిష్కార కార్యక్రమాన్ని చేపట్టిందని, ఈ కార్యక్రమం ద్వారా ఏలూరు జిల్లా మార్గదర్శకం అవుతుందని జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి నాదెండ్ల మనోహర్ చెప్పారు. స్థానిక కలెక్టరేట్‌లో మంగళవారం మెగా 22ఎ భూ సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో పాల్గొని ప్రజలు, రైతుల నుండి దరఖాస్తులను స్వీకరించి, వాటి పరిష్కారానికి అక్కడికక్కడే చర్యలు తీసుకున్నారు. జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి, జెసి అభిషేక్ గౌడ, శాసనసభ్యులు చింతమనేని ప్రభాకర్, డా. కామినేని శ్రీనివాస్, పత్సమట్ల ధర్మరాజు, ప్రభృతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ గత ప్రభుత్వం చేసిన రాజకీయ కక్షల కారణంగా రాష్ట్రంలో 22ఎ భూ సమస్యలు అతి పెద్ద సమస్యగా రూపొందాయని, ప్రైవేట్ భూములను కూడా ఉద్దేశ్యపూర్వకంగా 22ఎ జాబితాలో చేర్చారని, గత ప్రభుత్వ నేతలకు అనుకూలంగా లేని వారి భూములను 22ఎ, చుక్కలు భూములు వంటి వివాదాస్పద భూముల జాబితాలో చేర్చారన్నారు. దీని కారణంగా సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ విషయాన్నీ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ రాష్ట్రంలో అతి పెద్ద సమస్యగా గుర్తించి రాష్ట్ర ప్రభుత్వం రెవిన్యూ శాఖ ప్రక్షాళనకు చర్యలు తీసుకుంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో అందిన ప్రతీ అర్జీని



పరిశీలించి 90శాతం వరకు అదేరోజు పరిష్కరించడం జరుగుతుందన్నారు. దేవాదాయ భూములు, వంటి సమస్యలు ఉన్న భూములను సంబంధిత శాఖల అధికారుల సమన్వయంతో 1 లేదా 2 వారాలలో తప్పనిసరిగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించడం జరిగిందన్నారు. జాయింట్ కలెక్టర్ డా. ఎం.జె. అభిషేక్ గౌడ, డిఆర్ఓ వి. విశ్వేశ్వరరావు, నూజివీడు సబ్ కలెక్టర్ బొల్లిపల్లి వినూత్న, ఆర్డీఓలు అచ్యుత్ అంబరీష్, రమణ, జిల్లా సర్వే అధికారి అన్సారీ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ దేవకీదేవి, కలెక్టరేట్ ఏఓ నాంచారయ్య, జిల్లాలోని 27 మండలాల తహసీల్దార్లు, రెవిన్యూ సిబ్బంది, ప్రభృతులు పాల్గొన్నారు.

# జనాభా దామాషాలో బిసిలకు రిజర్వేషన్లు ఇవ్వాలి

## హోంమంత్రి అమిత్ షాకు శంకరరావు వినతి

విజయవాడ, డిసెంబరు 16 ప్రభాతవార్త: రాష్ట్ర శాసనసభ, స్థానిక సంస్థలు, పార్లమెంటుల్లో ఓబీసీల జనాభా దామాషా మేరకు రిజర్వేషన్లు కేటాయించాలని, అందుకు రాజ్యాంగ సవరణ చేసి పెంచిన రిజర్వేషన్లను షెడ్యూల్ తొమ్మిదిలో చేర్పించడం ద్వారా సంపూర్ణ రాజ్యాంగ రక్షణ కల్పించి, ఓబీసీల అన్ని ప్రధాన డిమాండ్లు పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకరరావు కేంద్ర ప్రభుత్వాన్ని పార్లమెంటును డిమాండ్ చేశారు. మంగళవారం దేశవ్యాప్త ఓబీసీ సంఘ నాయకులందరితో కలిసి ఢిల్లీ లో ఆ మేరకు వారు ప్రధాని, హోంమంత్రి తో పాటు పార్లమెంటు సభ్యులందరికీ మెమోరాండం లు సమర్పించారు. ఈ సందర్భంగా కేసన మీడియాతో మాట్లాడుతూ, ఆనాడు బీపీ మండల్ నివేదిక మేరకున్న ఓబీసీల 52 శాతం జనాభా, ఈనాటికి 60 శాతం మించిపోయినా రాజ్యాంగ పీఠికలోనే వారికి సామాజిక న్యాయం అందించాలని అంబేద్కర్ తో సహా రాజ్యాంగ కర్తలందరూ కోరినప్పటికీ,ఏ రంగంలోనూ సామాజిక న్యాయం వారికి అందడం లేదన్నారు.73,74 రాజ్యాంగ సవరణల ద్వారా ఓబీసీలకు పంచాయతీలు మునిసిపాలిటీలలో రిజర్వేషన్లు ఎంతని తేల్చకుండానే ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు కేటాయించుకోవచ్చున్నాయన్నారు. తీరా ఆయా రాష్ట్రాలు స్థానిక సంస్థలకు ఓబీసీల రిజర్వేషన్లు కేటాయించుకోగానే, బీసీ ఎస్సీ ఎస్టీ మొత్తం రిజర్వేషన్లు 50 శాతం మించిపోయాయంటూ, అసంబద్ధరాజ్యాంగ విరుద్ధ సుప్రీంకోర్టు పరిమితి ఆటంకం కారణంగా, ఓబీసీలకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. ఆ విధంగా స్థానిక సంస్థలకు గత ఏపీ ప్రభుత్వం ఓబీసీలకు కేటాయించిన 34 శాతం కాకుండా, 24 శాతంతోనూ, గత తెలంగాణ ప్రభుత్వం కేటాయించిన 24 శాతాన్ని తగ్గించుకుని,17 శాతంతో ఎన్నికలు జరిగాయన్నారు. ఇప్పటి తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు ప్రకటించిన 42 శాతం స్థానిక సంస్థల రిజర్వేషన్ల గతి ఏమైందో కూడా మనందరకు తెలుసన్నారు. వాస్తవంగా ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ల పేరిట కేంద్ర ప్రభుత్వం 103 వ రాజ్యాంగ సవరణ చేసి మరీ, అగ్రవర్ణ పేదలకు కేటాయించిన 10 శాతం రిజర్వేషన్లతోనే సుప్రీం 50 శాతం పరిమితి మించి పోయిందన్నారు. ఎస్సీ ఎస్టీల వలెనే ఓబీసీలకు కూడా వారి జనాభా దామాషాలో రిజర్వేషన్లు కేటాయించాలని, అందుకు ప్రధాన అడ్డంకిగా ఉన్న 50 శాతం పరిమితిని అధిగమించేందుకు, రాజ్యాంగ సవరణ చేసి పెంచిన ఓబిసి రిజర్వేషన్లను షెడ్యూల్9 లో చేర్చి, రాజ్యాంగ పర రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. భారత ప్రజాస్వామ్యంలో మెజారిటీ ప్రజలుగా ఉన్న ఓబీసీలకు అన్ని రంగాలలో అన్ని పార్టీలు సామాజిక న్యాయం చేయాలని, కానీ తద్విరుద్ధంగా వ్యవహరించడం అన్యాయమన్నారు. మహిళా రిజర్వేషన్ చట్టానికి సవరణ చేసి,ఓబీసీ మహిళలకు సబ్ కోటా కేటాయించాలని, ఓబీసీ ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించాలని, హైకోర్టు సుప్రీంకోర్టుల నియామకాలలో కూడా ఓబీసీ రిజర్వేషన్లు ఉండాలని, ఓబీసీ బ్యాక్లాగ్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, ప్రైవేటు రంగంలో కూడా ఓ బి సి,ఎస్ సి,ఎస్ టి లకు రిజర్వేషన్లు కేటాయించాలన్నారు.

# అమెరికాకు ప్రత్యామ్నాయంగా యూరప్, రష్యా మార్కెట్

- భారతీయ ఎగుమతులపై అమెరికా సుంకాల ప్రభావాన్ని అంచనా వేయండి
- ఆక్వా ఎగుమతులపై ప్రత్యేక దృష్టి పెట్టాలి
- ఇతర మార్కెట్లకు ఎగుమతులు పెంచేందుకు పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహకాలు ఇవ్వాలి
- లోక్ సభలో ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్



ఏలూరు, డిసెంబరు 16 ప్రభాతవార్త: ఇటీవల అమెరికా విధిస్తున్న భారీ సుంకాల ప్రభావంపై అంచనా వేసేందుకు పారిశ్రామికవేత్తలు, వివిధ ఆర్థిక సంస్థలతో చర్చిస్తున్నట్లు కేంద్ర వాణిజ్య పరిశ్రమల శాఖ సహాయ మంత్రి జితిన్ ప్రసాద తెలిపారు. భారతీయ ఎగుమతులపై అమెరికా సుంకాల ప్రభావంపై ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ అడిగిన ప్రశ్నకు లోక్ సభలో కేంద్ర మంత్రి సమాధానం ఇచ్చారు. కేంద్ర మంత్రి ఇచ్చిన వివరాల ప్రకారం, భారతదేశం నుంచి అమెరికాకు ఎగుమతుల పరిమాణం 2023 ఏప్రిల్ నవంబర్‌లో 278.80 బిలియన్ డాలర్లు ఉండగా ఇదే కాలానికి 2024లో 284.60 బిలియన్ డాలర్లుగా, 2025 ఏప్రిల్ - నవంబర్‌లో 292.07 బిలియన్ డాలర్లుగా నమోదైంది. అంటే స్వల్పంగా వృద్ధి నమోదైనట్టు తెలుస్తోంది. ఆక్వా ఉత్పత్తులకు సంబంధించి ఎంపీ పుట్టా మహేష్ కుమార్ ప్రత్యేకంగా ప్రశ్నించగా.. భారతదేశం నుంచి గత ఏడాది ఏప్రిల్ నవంబర్లో 4.95 బిలియన్ డాలర్ల విలువైన ఆక్వా ఉత్పత్తిల ఎగుమతి జరగగా 2025 ఏప్రిల్ నవంబర్ మధ్య 5.75 బిలియన్ డాలర్ల ఎగుమతులు జరిగినట్లు మంత్రి తెలిపారు. ఆక్వా ఎగుమతుల పరంగా ఇబ్బందులు ఉన్నప్పటికీ స్వల్పంగా వృద్ధి నమోదవ్వటం విశేషం. పదేళ్ల కిందటితో పోల్చితే భారతీయ ఆక్వా ఎగుమతులు రెట్టింపు అయ్యాయి. 2013 14 ఏడాదిలో 30,213 కోట్ల విలువైన ఎగుమతులు జరగగా, 2024 25లో 62,408 కోట్ల విలువైన ఎగుమతులు జరిగాయని కేంద్ర మంత్రి వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ నుంచి 2023-24 ఏడాదిలో మొత్తంగా 19,759.86 మిలియన్ డాలర్ల ఎగుమతులు జరగగా 2024-25 ఏడాదికి 20,782.81 మిలియన్ డాలర్ల ఎగుమతులు జరిగాయి. ఎగుమతి దారులను ప్రోత్సహించేందుకు క్రెడిట్ గ్యారెంటీ పథకం, నేషనల్ క్రెడిట్ గ్యారెంటీ ట్రస్ట్ కంపెనీ లిమిటెడ్ (ఎన్‌సిజిటిసి) ద్వారా 100శాతం క్రెడిట్ గ్యారెంటీ సౌకర్యం కల్పించినట్లు మంత్రి తెలిపారు. ఈ పథకం భారతీయ ఎగుమతిదారు ల ప్రపంచ పోటీ తత్వాన్ని పెంచుతుందని, కొత్తగా అభివృద్ధి చెందుతున్న మార్కెట్లలోకి ప్రవేశించేందుకు ప్రోత్సహిస్తుందని మంత్రి తెలిపారు. భారతీయ ఎగుమతులను 1 ట్రిలియన్ డాలర్ల స్థాయికి పెంచాలనే లక్ష్యం దిశగా వివిధ దేశాలతో, వాణిజ్య కూటములతో 15 స్వేచ్ఛ వాణిజ్య ఒప్పందాలు మరియు 6 ప్రాధాన్యత వాణిజ్య ఒప్పందాలపై భారత్ సంతకం చేసినట్టు మంత్రి ఈ సందర్భంగా తెలిపారు. అమెరికా సుంకాల పెంపు చర్యల యొక్క పరిమాణ ప్రభావాన్ని అంచనా వేయడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని మంత్రి జితిన్ ప్రసాద తెలిపారు. అమెరికా సుంకాల ప్రభావం ముఖ్యంగా ఆక్వా పరిశ్రమపై ఏ విధంగా ఉందంటూ ఎంపీ పుట్టా మహేష్ కుమార్ అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి సమాధానమిస్తూ గతంలో మత్స్య సంపద ఎగుమతులు అమెరికాకు అధిక స్థాయిలో ఉండగా సుంకాల ప్రభావంతో యూరోపియన్ దేశాలు, రష్యాకు ఎగుమతులు పెంచేందుకు ప్రయత్నిస్తున్నట్టు కేంద్ర మంత్రి తెలిపారు.

# ప్రభుత్వానికి ఆదాయం వచ్చేలా రుషికొండ ప్యాలెస్‌ను వినియోగిస్తాం

- కేబినెట్ సబ్‌కమిటీ స్పష్టీకరణ - సచివాలయంలో భేటీ... విస్తృత చర్చ - వివరాలు వెల్లడించిన మంత్రులు

సచివాలయం, డిసెంబరు 16 ప్రభాతవార్త: పర్యాటక శాఖకు ఆదాయం వచ్చేలా, ప్రజలకు కూడా ఉపయోగపడేలా రుషికొండ ప్యాలెస్‌పై త్వరోలనే నిర్ణయం తీసుకుంటామని మంత్రులు పయ్యావుల కేశవ్, కందుల దుర్గేష్, డోలా బాల వీరాంజనేయ స్వామి అన్నారు. రుషికొండ ప్యాలెస్‌ను ఏవిధంగా వినియోగించాలన్న అంశంపై నిర్ణయం తీసుకునేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన సబ్ కమిటీ రెండో భేటీ మంగళవారం వెలగపూడి సచివాలయం రెండో బ్లాక్ కాన ్ఫరెన్స్ హాల్లో జరిగింది. భేటీలో మంత్రులు పయ్యావుల కేశవ్, కందుల దుర్గేష్, డోలా బాల వీరాంజనేయస్వామి, పర్యాటక శాఖ ప్రత్యేక కార్యదర్శి అజయ్ జైన్, టూరిజం ఎండి, ఎపిటిఏ సీఈవో అమ్రపాలి సుదీర్ఘంగా చర్చించారు. గత భేటిలో సూచనల మేరకు ప్రజలు, స్టేక్ హోల్డర్స్ అభిప్రాయాన్ని పర్యాటక శాఖ అధికారులు సబ్ కమిటీ ముందుంచారు. రుషికొండ ప్యాలెస్‌ను ఏవిధంగా వినియోగించాలన్న అంశంపై వెబ్‌సైట్‌లో స్పందన కోరగా 1517మంది ప్రజలు, 44మంది స్టేక్ హోల్డర్స్ తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారని తెలిపారు. అత్యధిక శాతం ప్రజలు గత ప్రభుత్వం చేసిన తప్పును త్వరితగతిన సరిదిద్ది ప్రజలకు ఉపయోగపడేలా చేయాలని కోరారని వెల్లడించారు. మరి కొందరు హోటల్, రిసార్ట్, మ్యూజియం, ఆర్ట్ గ్యాలరీ, సైన్స్ ప్లానిటోరియం, మైస్, వెల్‌నెస్ సెంటర్‌గా, ప్రభుత్వ కార్యాలయంగా వినియోగిస్తే బాగుంటుందని అభిప్రాయం వ్యక్తంచేసినట్లు సబ్ కమిటీ వెల్ ్లడించింది. అంతిమంగా సంస్థల సమర్థతను పరిగణనలోనికి తీసుకొని ప్రజలకు ఉపయోగపడుతూనే, ప్రభుత్వానికి ఆదాయం తెచ్చిపెట్టేలా రుషికొండ ప్యాలెస్‌ను వినియోగించేలా నిర్ణయం తీసుకుంటామని సబ్ కమిటీ పేర్కొంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లోని ఫలక్‌నామా ప్యాలెస్ కట్టడాన్ని సహజత్వం కోల్పోకుండా ఏవిధంగా వినియోగిస్తున్నారనే అంశాన్ని ఉదహరించారు. ఈ సందర్భంగా మంత్రులు పయ్యావుల, కందుల, డోలా మాట్లాడుతూ గత ప్రభుత్వం రుషికొండపై పర్యాటక శాఖకు అధిక ఆదాయాన్ని చ్చే హరిత రిసార్ట్ ్స స్థానంలో విజయనగర, కళింగ, చోళ,



పల్లవ, గజపతి, వేంగి, ఈస్టర్న్ గంగ తదితర పేర్లతో కూడిన 7బ్లా ్లక్‌లతో 19,968చ.మీ రాజప్రసాదంలాంటి ప్యాలెస్‌ను నిర్మించి ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసిందని విమర్శించారు. గత ప్రభుత్వ నిర్ణయం వల్ల ప్రస్తుతం ప్రతినెలా 25-30లక్షల మెయింటెనెన్స్ చార్జీల భారం పడుతోందన్నారు. ఈ నేపథ్యంలో త్వరితగతిన వినియోగంలోనికి తీసుకొచ్చేందుకు ప్రజలు, స్టేక్ హోల్డర్స్ అభిప్రాయాన్ని తీసుకున్నామని, త్వరలోనే దీన్ని పర్యాటక శాఖకు ఆదాయం వచ్చేలా ప్రజలకు ఉపయోగపడేలా సముచిత నిర్ణయం తీసుకుంటామన్నారు. ఇప్పటికే టాటా,అట్మోస్ఫియర్ కోర్, ఐహెచ్‌సిఎల్, హెచ్‌ఈఐ తదితర సంస్థలు ప్యాలెస్‌ను ఏ విధంగా వినియోగిస్తే బాగుంటుందో తమ అభిప్రాయాన్ని స్పష్టంగా వెలిబుచ్చాయని, మరికొని విదేశీ సంస్థలు కూడా అభిప్రాయాన్ని వ్యక్తంచేశాయన్నారు. కొన్నింటికి పూర్తిస్థాయి స్పష్టం రావాలి ్స ఉందన్నారు. మరో భేటికి పూర్తి స్పష్టత వస్తుందని, అనంతరం ప్రతిపాదనలు కేబినెట్ దృష్టికి తీస్కెళ్ళి ఆ తర్వాత సీఎం చంద్రబాబు సూచనల మేరకు తుది నిర్ణయం తీసుకుంటామన్నారు. సాధ్యమైనంత త్వరగా రుషికొండ ప్యాలెస్‌పై కీలక నిర్ణయం తీసుకుంటామని సబ్ కమిటీ పేర్కొంది. సమావేశంలో పర్యాటక శాఖ అధికారులు రుషికొండ ప్యాలెస్‌కు సంబంధించిన ప్రజంటేషన్ ఇచ్చారు.

# 820 ఎకరాల వక్ఫ్ భూమిని రక్షించాం

## డిజిటలైజేషన్‌తో అదనంగా 15,618 ఎకరాల వక్ఫ్ భూమిని గుర్తించాం

### ఎపి వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్



విజయవాడ, డిసెంబరు 16 ప్రభాతవార్త ప్రతినిధి: విజయవాడ కాళేశ్వర రావు మార్కెట్ వద్ద గల ఏపీ వక్ఫ్ బోర్డ్ కార్యాలయంలో ఏపీ వక్ఫ్ బోర్డ్ చైర్మన్ అబ్దుల్ అజీజ్ అధ్యక్షతన 9 వ బోర్డ్ సమావేశం జరిగింది. ఈ మేరకు ఏపీ వక్ఫ్ బోర్డ్ చైర్మన్ అబ్దుల్ అజీజ్ మీడియా సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ, గత ఏడాది కాలంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వక్ఫ్ బోర్డు పనితీరు దేశానికి ఆదర్శంగా నిలిచిందని ఏపీ రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ పేర్కొన్నారు. వక్ఫ్ పాలనలో పూర్తిస్థాయి పారదర్శకత, చట్టబద్ధత, బాధ్యతాయుత పరిపాలన తీసుకొచ్చామని ఆయన తెలిపారు. వక్ఫ్ ఆస్తుల రక్షణే ప్రధాన లక్ష్యంగా అక్రమ ఆక్రమణలపై కఠిన చర్యలు తీసుకున్నామని స్పష్టం చేశారు. ఈ కాలంలో రాష్ట్రవ్యాప్తంగా 953 అక్రమ ఆక్రమణ నోటీసులు జారీ చేసి, దాదాపు 820 ఎకరాల వక్ఫ్ భూమిని రక్షించేందుకు చర్యలు చేపట్టామని, వీటి విలువ సుమారు రూ.2,000 కోట్లు ఉంటుందని తెలిపారు. అలాగే, కర్నూలు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో సుమారు రూ.650 కోట్ల విలువైన వక్ఫ్ భూమి విషయంలో జరిగిన 89 అక్రమ సేల్ డీడ్ల ను రద్దు చేయించామని తెలిపారు. వక్ఫ్ బోర్డు చరిత్రలో తొలిసారిగా ఈటెండరింగ్ విధానం అమలు చేసి, హుండీలు, వాణిజ్య ఆస్తుల ద్వారా గణనీయమైన ఆదాయం సమకూర్చామని తెలిపారు. గత ఏడాదితో పోలిస్తే రూ.3.50 కోట్ల అదనపు ఆదాయం సాధించి, దాదాపు 46 శాతం ఆదాయ వృద్ధి నమోదు చేసినట్లు వెల్లడించారు. సంక్షేమ రంగంలో భాగంగా ఇమామ్‌లు, మోజాన్లకు పెండింగ్‌లో ఉన్న 18 నెలల గౌరవ వేతనాలను రూ.1.35 కోట్లతో పూర్తిగా చెల్లించామని తెలిపారు. పేద ముస్లిం మహిళల కోసం తలీమ్‌ఎహునర్ వంటి నూతన పథకాలు ప్రారంభించడంతో పాటు, విద్యార్థుల భవిష్యత్తు లక్ష్యంగా ప్రత్యేక ప్రోత్సాహక కార్యక్రమాలు అమలు చేయబోతున్నామని చెప్పారు. ఉమీద్ పోర్టల్ ద్వారా వక్ఫ్ ఆస్తుల డిజిటలైజేషన్‌లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం దేశంలోనే ముందంజలో నిలిచిందని తెలిపారు. వక్ఫ్ భూమి విస్తీర్ణం 65,784 ఎకరాల నుంచి 81,402 ఎకరాలకు పెరిగిందని, అదనంగా 15,618 ఎకరాల వక్ఫ్ భూమిని గుర్తించగలిగామని పేర్కొన్నారు. అలాగే 100 శాతం వక్ఫ్ ఆస్తుల నమోదు పూర్తయ్యిందని ఏపీ వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ స్పష్టం చేశారు.

# గంజాయి, మత్తు పదార్థాలు లేని సమాజ నిర్మాణమే లక్ష్యం

## - 'అభ్యుదయం సైకిల్ యాత్ర'లో విశాఖ డిఐజి గోపినాథ్ జట్టి

శ్రీకాకుళం, డిసెంబరు 16 ప్రభాతవార్త: విశాఖపట్నం డీఐజీ గోపీనాథ్ జట్టి ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల నిర్మూలన, వాటి వినియోగం వల్ల కలిగే దుష్ప్రభావాలపై ప్రజల్లో చైతన్యం, అవగాహన కల్పించేందుకు విశాఖపట్నం రేంజ్ పరిధిలోని అనకాపల్లి జిల్లా పాయకరావుపేటలో ప్రారంభమైన 'అభ్యుదయం సైకిల్ ర్యాలీ' విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల మీదుగా విజయవంతంగా సాగి మంగళవారం శ్రీకాకుళం జిల్లా శ్రీకాకుళం పట్టణంలోకి చేరుకుంది. శ్రీకాకుళం జిల్లాలోకి ప్రవేశించిన రెండవ రోజు మంగళవారం శ్రీకాకుళం పట్టణంలో స్థానిక రామలక్ష్మణ జంక్షన్ వద్ద ముఖ్య అతిథిగా హాజరైన విశాఖపట్నం రేంజ్ డీఐజి గోపీనాథ్ జట్టి, విశిష్ట అతిథులు జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జిల్లా ఎస్పీ కెవి మహేశ్వర రెడ్డి, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, ప్రత్యేక అహ్వానితులుగా ఎమ్మెల్యేలు గొండు శంకర్, కూన రవికుమార్, బొగ్గు రమణమూర్తి అభ్యుదయ సైకిల్ యాత్ర బృందం సభ్యులను సాదరంగా ఆహ్వానించారు. ఈ యాత్ర రామలక్ష్మణ జంక్షన్ వద్ద ప్రారంభమై సూర్య మహల్, జీటి రోడ్డు, సెవెన్ రోడ్డు జంక్షన్ మీదుగా ఎన్టీఆర్ మున్సిపల్ మైదానం వరకు సాగింది. అక్కడ ఏర్పాటు చేసిన వివిధ శాఖల ఫోటో ఎగ్జిబిషన్ స్టాల్స్‌ను ముఖ్య అతిథులు తిలకించారు. విద్యార్థులతో కలిసి మాదకద్రవ్యాల నిర్మూలన ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా డిఐజి గోపీనాథ్ జట్టి మాట్లాడుతూ మంచి సమాజ నిర్మాణం మంచి వ్యక్తుల వల్లనే సాధ్యమవుతుందని అన్నారు. మత్తు పదార్థాల నియంత్రణకు పూర్తిస్థాయిలో చర్యలు చేపడుతున్నామని వివరించారు. డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ పోలీస్ శాఖ చేపడుతున్న ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమానికి భాగస్వాములవ్వాలని కోరారు. జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జిల్లా ఎస్పీ కెవి మహేశ్వర రెడ్డి, ఎమ్మెల్యేలు గొండు శంకర్, బగ్గు రమణ మూర్తి, కూన రవి కుమార్ తదితరులు ప్రసంగిస్తూ... 'డ్రగ్స్ వద్దు- భవిష్యత్తు ముద్దు' అని నినాదం ఇచ్చారు. మున్సిపల్ మైదానంలో నిర్వహించిన అభ్యుదయ



సైకిల్ యాత్ర ప్రజా అవగాహన కార్యక్రమంలో తన కుమారుడు మత్తు పదార్థాలకు బానిస కావడంతో ఎదుర్కొన్న బాధను ఓ తల్లి హృదయవిదారకంగా వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా శ్రీకాకుళం జిల్లా పోలీసులు తమకు అందించిన సహాయం, మార్గనిర్దేశానికి ఆమె కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ సిహెచ్ తిరుపతి నాయుడు, అదనపు ఎస్పీ పి.శ్రీనివాసరావు, శ్రీకాకుళం ఆర్డీఓ సాయి ప్రత్యూష, డీఎస్పీలు వివేకానంద, లక్ష్మణరావు, డిసిఎం చైర్మన్ సురేష్ అవినాష్, ప్రజా ప్రతినిధులు, విద్యార్థులు, ఉద్యోగులు, స్థానిక ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# వైసిపి కోటి సంతకాల సేకరణ ఓ నాటకం: మంత్రి జనార్ధన్ రెడ్డి



విజయవాడ,డిసెంబరు 16 ప్రభాతవార్త ప్రతినిధి: రాష్ట్రంలోని వైద్య కళాశాలల వ్యవహారంలో పీపీపీ విధానంలో వెళ్లాలని చంద్రబాబు సారథ్యంలోని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నిర్ణయాన్ని వైసీపీ తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. ఈ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ.. ఆ పార్టీ కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించింది. అలాంటి వేళ పీపీపీ విధానంలో వైద్య కళాశాలల నిర్మాణంపై పార్లమెంట్ స్థాయి సంఘం పలు సిఫార్సులు చేసింది. దీనిపై రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి మంగళవారం విజయ వాడలో మీడియా సమావేశంలో స్పందించారు. ఈ సిఫార్సులు వైసీపీకి చెంపపెట్టు అని ఆయన స్పష్టం చేశారు. వైద్య విద్య ఖర్చు విపరీతంగా పెరిగిపోతున్న క్రమంలో ఎక్కువ మందికి వైద్య విద్య అందించా లంటే ఈ విధానం తప్ప మరో ప్రత్యామ్నా యం లేదని కేంద్రం స్పష్టం చేసిన విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. వైసీపీ చేపట్టిన కోటి సంతకాల సేకరణ నాటక మంతా ఒక బూటకమని అభి వర్ణించారు. మెడికల్ కాలేజీల నిర్మాణా నికి ప్రవేటీకరణకు ఉన్న వ్యత్యాసాన్ని సైతం గుర్తించకుండా దుష్ప్రచారం చేస్తోందంటూ వైసీపీపై ఆయన నిప్పులు చెరిగారు. ఈ పీపీపీ విధానం వల్ల కలిగె ప్రయోజనాలను ఆయన సోదాహరణగా వివరించారు. 151 సీట్లతో ప్రజలు అధికారం కట్టబెడితే, 17 మెడికల్ కాలేజీలు నిర్మించలేని.. మీరు నేడు ప్రజలను మభ్య పెట్టేందుకు ప్రయత్నించడం సిగ్గుచేటు అంటూ వైసీపీ నేతల వైఖరిని ఆయన ఎండగట్టారు.

## మాజీ ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్‌పై ఫిర్యాదు

# చర్యలు తీసుకోండి

## కర్నూలు ఎస్పీకి ఎస్సీ కమిషన్ ఆదేశం

కర్నూలు, డిసెంబరు 16 ప్రభాతవార్త: కర్నూలు మాజీ శాసనసభ్యులు హాఫీజ్ ఖాన్ పై చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎస్సీ కమిషన్ ఆదేశించింది. ఆ మేరకు కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్‌కు సిఫార్సు చేసింది. ఇప్పటికే హాఫీజ్ ఖాన్ పై కొన్ని వివాదాలు ఉన్న తరుణంలో.. తాజాగా ఎస్సీ కమిషన్ ఆదేశాలు మరింత చర్చనీయాంశమయ్యాయి. గత ఐదు సంవత్సరాల క్రితం మున్సిపల్ కార్పొరేషన్‌కు ఎలక్షన్ ఎన్నికలు జరుగుతున్న తరుణంలో.. కార్పొరేటర్ సీట్‌తో పాటు, డిప్యూటీ మేయర్ పదవి ఇప్పిస్తానని తనకు హామీ ఇచ్చాడని బ్యూటీషియన్ శోభారాణి ఆరోపిస్తోంది. అంతేగాక తనకు కార్పొరేటర్ సీటుతోపాటు డిప్యూటీ మేయర్ పదవి ఇచ్చేందుకుగాను తన నుంచి రూ.3.7 కోట్లు డబ్బు తీసుకున్నాడని ఆమె చెబుతోంది. అదే క్రమంలో వివిధ కారణాలతో తనతో తాంత్రిక పూజలు సైతం చేయించాడని ఆపై తనపై లైంగిక దాడి కూడా చేశారని శోభారాణి తాజాగా ఎస్సీ కమిషన్‌కు ఫిర్యాదు చేసింది. ఫిర్యాదు మేరకు స్పందించిన కమిషన్ హాఫీజ్ ఖాన్‌పై చర్యలు తీసుకోవాలని కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంతపాటిల్‌ను ఆదేశించింది.

# ఖాకీ దుస్తుల గౌరవాన్ని కానిస్టేబుళ్లు నిలబెట్టాలి

- కానిస్టేబుల్ ఉద్యోగం పోలీస్ వ్యవస్థకు మూల స్తంభం
- మీరు ప్రజలకు రక్షణ కల్పించండి.. అండగా మేము ఉంటాం
- కానిస్టేబుళ్ల నియామక పత్రాల ప్రదానం కార్యక్రమంలో డి.సిఎం
- మా నాన్న కానిస్టేబుల్‌గానే మాకు ఈ జీవితం ఇచ్చాడన్న పవన్



విజయవాడ, డిసెంబరు 16 ప్రభాతవార్త ప్రతినిధి: "కానిస్టేబుల్ ఉద్యోగం పోలీస్ వ్యవస్థకు మూల స్థంభం లాంటిది. మీరు లేకపోతే పోలీస్ వ్యవస్థకు జీవం లేదు. ధైర్యమూ ఉండదు. మీ ఒంటిపై ఉన్న ఖాకీ డ్రస్సు కనబడితే ప్రజలకు ఎక్కడ లేని ధైర్యం వస్తుంది. ఖాకీ.. సమాజానికి రక్షణ కవచం వంటిది. అలాంటి ఖాకీ గౌరవాన్ని తగ్గించుకోవద్దు" అని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సూచించారు. శాంతిభద్రతలపైనే దేశాభివృద్ధి అయినా, రాష్ట్రాభివృద్ధి అయినా ఆధారపడి ఉంటుందన్నారు. అలాంటి శాంతిభద్రతలను పరిరక్షించే మీరు రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు చోదక శక్తులన్నారు. నియామక పత్రాలు స్వీకరించిన కానిస్టేబుళ్లంతా శాంతి భద్రతల పరిరక్షణ బాధ్యతలు స్వీకరించి రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు. "ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, తాను అసెంబ్లీలో ప్రమాణ స్వీకారం చేసిన మొదటి రోజునే పాలనలో సుస్థిరత కోసం, యువత భవిష్యత్తు కోసం నిలబడతామని మాటిచ్చాం. మేము అధికారంలోకి వచ్చేనాటికి అవినీతి వ్యవస్థీకృతమై ఉంది. వ్యవస్థీకృతమైన అవినీతిని పారదోలేందుకు చిత్తశుద్ధితో ప్రయత్నం చేస్తున్నాం. అందులో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లి.. పంచాయతీరాజ్ శాఖలో పది వేల పైచిలుకు ఉద్యోగులకు ఒకేసారి పదోన్నతులు కల్పించాం. చంద్రబాబు దార్శనికత, సలహాలు, సూచనలతోనే అత్యంత పారదర్శకంగా ఈ ప్రక్రియను పూర్తి చేయగలిగాం. అదే కోవలో ఈ రోజున ఆరు వేల మందికి ఒకేసారి నియామక పత్రాలు అందిస్తున్నాం. సంఘటిత నేరాల నియంత్రణపై దృష్టి సారించండి, పోలీస్ ఉద్యోగం ఎంతో బాధ్యతతో కూడిన ఉద్యోగం. పోలీస్ విధుల్లో క్రమశిక్షణ, నైతిక విలువలు, ప్రజల పట్ల సేవాభావం ముఖ్యం. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలిగినా, వారి హక్కులకు భంగం వాటిల్లినా, అన్యాయం జరిగినా మొదట గుర్తుకు వచ్చేది పోలీసులే. శాంతి భద్రతల నిర్వహణ, నేరాల నియంత్రణ మీ చేతుల్లోనే ఉంటాయి. మీ విధులు మీరు సక్రమంగా నిర్వహిస్తే సమాజం ప్రశాంతంగా ఉంటుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు 15 శాతం ఆర్థికాభివృద్ధి లక్ష్యంగా పని చేయాలని మాకు చెబుతూ ఉంటారు. శాంతి భద్రతలు బలంగా ఉంటేనే అది సాధ్యపడుతుంది. ఫిర్యాదు చేసేందుకు స్టేషన్ కి వెళ్తే పోలీసులు ఇబ్బందిపెడతారేమో అన్న భావన ప్రజల నుంచి పోవాలి. అదే సమయంలో విధి నిర్వహణలో ఉన్న పోలీస్ సిబ్బందికి ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తుంది. ఇటీవల మాజీ ముఖ్యమంత్రి పోలీసు ఉన్నతాధికారులకు నేరుగా హెచ్చరికలు జారీ చేస్తున్నారు. ఉన్నతాధికారులను కూడా బెదిరించే స్థాయికి వెళ్లారు. ఇలాంటి వ్యవస్థల్లో మార్పు తెచ్చేందుకు మేము బలంగా నిలబడతాం. అందుకు మీ నుంచి సంపూర్ణ మద్దతు కోరుకుంటున్నాం. ఏ రాజకీయ నాయకుడు కూడా పోలీస్ అధికారులను బెదిరించినా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం ఉపేక్షించదు. చాలా బలంగా తీసుకుంటుంది. ఎవరూ భయపడాల్సిన అవసరం లేదు. మీరు ప్రజలకు అండగా ఉండండి. మీకు మేము అండగా ఉంటాం. కూటమి ప్రభుత్వం ప్రజల మానప్రాణ సంరక్షణ, శాంతి భద్రతల పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తుంది. మరీ ముఖ్యంగా మహిళల భద్రత అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నాం. శాంతి భద్రతల పరిరక్షణలో తరతమ భేదాలు చూడం. కులం, మతం, ప్రాంతీయత అనే తేడాలు చూడం. కొత్త కానిస్టేబుళ్లంతా అదే పంథాను అనుసరించాలి. మీ ఉద్యోగ జీవితంలో మీరు మరింత ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి" అన్నారు.

# నేడు, రేపు కలెక్టర్ల సదస్సు

- 18 నెలల పాలనపై సమీక్ష
- నూతన లక్ష్యాలు, కార్యాచరణపై సిఎం మార్గదర్శనం

విజయవాడ, డిసెంబరు 16 ప్రభాతవార్త ప్రతినిధి: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 18 నెలల కాలంలో అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్షించుకుని.. లక్ష్యాలకు అనుగుణంగా పని చేసేలా రెండు రోజుల కలెక్టర్ల కాన్ఫరెన్స్ జరగనుంది. రాష్ట్ర సచివాలయంలోని ఐదో బ్లాకులో బుధవారం ఉదయం 10 గంటలకు 5వ కలెక్టర్ల కాన్ఫరెన్స్ ప్రారంభం కానుంది. తొలి రోజు సీసీఎల్ఏ స్వాగతోపన్యాసంతో మొదలు కానున్న కలెక్టర్ల కాన్ఫరెన్సులో పరిపాలనకు సంబంధించిన కీలకాంశాలపై సీఎం చంద్రబాబు జిల్లాల కలెక్టర్లకు, ఉన్నతాధికారులకు దిశా నిర్దేశం చేయనున్నారు. సుపరిపాలనసుస్థిరాభివృద్ధిసంక్షేమం అజెండాగా రెండు రోజుల కలెక్టర్ల కాన్ఫరెన్స్ జరగనుంది. రాష్ట్ర స్థూల ఉత్పత్తి, కీ పర్ఫార్మెన్స్ ఇండికేటర్స్, అభివృద్ధి లక్ష్యాలు వంటి వాటిపై తొలి రోజు సమావేశంలో కీలక చర్చ జరగనుంది. దీనికి అనుగుణంగా జిల్లా కలెక్టర్లు ఆయా రంగాల్లో ఎలా పని చేయాలనే విషయమై సీఎం సూచనలు చేయనున్నారు. అలాగే వివిధ కార్యక్రమాలు, సంక్షేమ పథకాల అమల్లో ప్రజల సంతృప్త స్థాయి ఏ మేరకు ఉందనే అంశం పైనా తొలి రోజు సమావేశంలో సీఎం సమీక్షించనున్నారు. అలాగే ఇఆఫీస్, ఫైళ్ల పరిష్కారం, ప్రజా ఫిర్యాదులు, డేటా డ్రివెన్ గవర్నెన్స్ వంటి అంశాలపై ఐటీ సెక్రటరీ కాటమనేని భాస్కర్ ప్రజెంటేషన్ ఇవ్వనున్నారు. ఇక కేంద్ర ప్రాయోజిత పథకాల అమలుపై ప్రభుత్వం పూర్తి స్థాయి ఫోకస్ పెట్టింది. ఈక్రమంలో పథకాల అమలు ఏ విధంగా జరుగుతోంది. కేంద్ర నిధులను ఏ మేరకు వినియోగించారు... వీటికి సంబంధించిన యూసీలు ఆయా శాఖలు ఎంత వరకు జారీ చేశారనే అంశంపై సీఎం సమీక్షించనున్నారు. దీంతోపాటు పెట్టుబడులకు సంబంధించిన ప్రతిపాదనలు... వాటిని అమలు చేసే అంశంపై జిల్లా కలెక్టర్లు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించనున్నారు. సంక్షేమం ద్వారా సాధికారత సూపర్ సిక్స్ అమలు వంటి అంశాలపై సమీక్షతో తొలి రోజు కలెక్టర్ల కాన్ఫరెన్స్ ముగియనుంది.

### సక్సెస్ స్టోరీస్... బెస్ట్ ప్రాక్టీసెస్.....

వివిధ జిల్లాల్లో ఉత్తమ పద్ధతులు అవలంభించిన జిల్లాల కలెక్టర్లు రెండో రోజైన గురువారం ఉదయం ప్రజెంటేషన్లు ఇవ్వనున్నారు. అలాగే స్వర్ణ ఆంధ్ర:2047 - పది సూత్రాలు, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి వంటి అంశాలపై అధికారులు ప్రజెంటేషన్ ఇవ్వనున్నారు. దీంతో పాటు... రెండో రోజు కలెక్టర్ల కాన్ఫరెన్సులో కీలకమైన రెవెన్యూ, ఆదాయార్జన శాఖలపై కీలక చర్చ జరగనుంది. మధ్యాహ్నం నుంచి శాంతి భద్రతలపై సీఎం సమీక్షించనున్నారు. ఈ సమావేశంలో డీజీపీ హరీష్ కుమార్ గుప్తా, హోం కార్యదర్శి విశ్వజిత్ సహా వివిధ జిల్లాల ఎస్పీలు పాల్గొననున్నారు. చివరిగా ముఖ్యమంత్రి ఉపన్యాసంతో రెండు రోజుల కలెక్టర్ల కాన్ఫరెన్స్ ముగియనుంది.

# వైజాగ్ వస్తున్న వరల్డ్ ఛాంపియన్‌లు

**ఎవరో వెల్లడించిన మంత్రి లోకేష్**

**21 నుంచి భారత్, శ్రీలంక టీ 20 సిరీస్**

**తొలి రెండు మ్యాచ్‌లకు వైజాగ్ ఆతిథ్యం**

**టీమిండియాకు స్వాగతం పలుకుతూ ట్వీట్**

విజయవాడ, డిసెంబరు 16 ప్రభాతవార్త ప్రతినిధి: మహిళల ప్రపంచకప్ గెలిచి చరిత్ర సృష్టించిన భారత జట్టు,ఆ ఘనత తర్వాత తమ తొలి సిరీస్‌ను ఆడేందుకు సిద్ధమైంది. ఈ సిరీస్‌లో భాగంగా తొలి రెండు మ్యాచ్‌లకు విశాఖపట్నం వేదిక కానుంది. ఈ నేపథ్యంలో ఏపీ మంత్రి నారా లోకేష్ భారత జట్టుకు స్వాగతం పలుకుతూ సోషల్ మీడియాలో ఆసక్తికర పోస్ట్ చేశారు. భారత్,శ్రీలంక మహిళల జట్ల మధ్య ఈ నెల 21 నుంచి 30 వరకు టీ20 సిరీస్ జరుగుతుంది. ఇందులో తొలి రెండు మ్యాచ్‌లు డిసెంబరు 21,23 తేదీల్లో విశాఖలోని ఏపీఏ.వీడీసిఏ స్టేడియంలో జరగనున్నాయి. ఈ విషయాన్ని ప్రస్తావిస్తూ లోకేష్ తన సంతోషాన్ని పంచుకున్నారు. భారత మహిళల జట్టు వరల్డ్ కప్ ప్రయాణం విశాఖ నుంచే ప్రారంభమైందని ఆయన గుర్తు చేశారు. 'ఛాంపియన్లకు స్వాగతం.భారత మహిళల జట్టు వరల్డ్ కప్ ప్రయాణం మన విశాఖలో నెల రోజుల క్యాంపుతోనే మొదలైంది. ఇప్పుడు విశ్వవిజేతలుగా తమ తొలి మ్యాచ్‌లను ఇక్కడే ఆడుతున్నారు' అని లోకేష్ తన పోస్టులో పేర్కొన్నారు. కాగా,కొద్ది రోజుల క్రితం 'వైజాగ్‌కు వరల్డ్ ఛాంపియన్లు వస్తున్నారు. ఎవరో చెప్పుకోండి' అంటూ ఆయన చేసిన ట్వీట్ అసక్తి రేపిన విషయం తెలిసిందే. ప్రపంచ కప్ గెలిచిన తర్వాత టీమిండియా ఆడుతున్న తొలి సిరీస్ కావడంతో ఈ మ్యాచ్‌లపై అంచనాలు పెరిగాయి.

# స్వర్ణ చతుర్భుజితో రహదారుల వ్యవస్థకు కొత్త రూపునిచ్చిన వాజ్‌పేయి

**మచిలీపట్నంలో వాజ్‌పేయి విగ్రహాన్ని ఆవిష్కరించిన మంత్రి నారా లోకేష్**



విజయవాడ, డిసెంబరు 16 ప్రభాతవార్త ప్రతినిధి: తన జీవితాన్ని దేశానికే అంకితం చేసిన గొప్ప వ్యక్తి మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి అని, ఆయన పేరు చెబితేనే నమ్మకం, అభివృద్ధి, సుపరిపాలన గుర్తుకు వస్తాయని రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ కొనియాడారు. భారతరత్న వాజ్ పేయి శతజయంతి ఉత్సవాల్లో భాగంగా, ఎన్డీయే కూటమి ఆధ్వర్యంలో కృష్ణా జిల్లా మచిలీపట్నంలో నిర్వహించిన ఖిఅటల్ సందేశ్‌మోదీ సుపరిపాలనఖి బస్సు యాత్రలో లోకేశ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా న్యూ హౌసింగ్ బోర్డ్ సర్కిల్ వద్ద ఏర్పాటు చేసిన వాజ్ పేయి కాంస్య విగ్రహాన్ని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్‌తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో లోకేశ్ మాట్లాడుతూ.. వాజ్‌పేయి శతజయంతి ఉత్సవాల్లో పాల్గొని, ఆయన విగ్రహాన్ని ఆవిష్కరించడం తన అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు. "చాలామంది నన్ను స్వర్గీయ ఎన్టీఆర్, చంద్రబాబులలో ఎవరిని ఆదర్శంగా తీసుకుంటారని అడుగుతారు. కానీ ఒక మత్స్యకార గ్రామాన్ని అభివృద్ధి చేసిన సింగపూర్ ప్రధాని లీ క్వాన్ యూ, భారతదేశాన్ని సమైక్యంగా ముందుకు నడిపిన అటల్ బిహారీ వాజ్ పేయిలే నాకు స్ఫూర్తి" అని లోకేశ్ స్పష్టం చేశారు.

సమాజంలో నైతిక విలువలు అంటే ఏంటో ఆచరణలో చూపిన గొప్ప వ్యక్తి వాజ్ పేయి అని, ఆయనకు రాజకీయంగా ప్రతిపక్షమే లేదని అన్నారు. చిన్న వయసులోనే కవిత్వానికి, దేశానికి తన జీవితాన్ని అంకితం చేసి, 18 ఏళ్లకే క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొని జైలుకు వెళ్లిన మహనీయుడని గుర్తు చేసుకున్నారు. వాజ్ పేయి మూడుసార్లు ప్రధానిగా బాధ్యతలు చేపట్టారని, తొలిసారి 13 రోజులకే మెజారిటీ లేకపోవడంతో నైతిక విలువలకు కట్టుబడి రాజీనామా చేశారని, ఆ తర్వాత ఆయనకు తిరుగులేకుండా పోయిందని లోకేశ్ వివరించారు. దేశ భద్రత కోసం పోఖ్రాన్‌లో అణుపరీక్షలు నిర్వహించి, కార్గిల్ యుద్ధంలో పాకిస్థాన్ దురాక్రమణను సమర్థంగా తిప్పికొట్టిన ధీశాలి అని ప్రశంసించారు. ఓ వైపు దేశ భద్రత, మరోవైపు అభివృద్ధికి ఆయన పెద్దపీట వేశారని తెలిపారు. స్వర్ణ చతుర్భుజి ద్వారా దేశంలో రహదారుల వ్యవస్థకు కొత్త రూపునిచ్చారని, చంద్రబాబు కోరిక మేరకు టెలికాం రంగంలో విప్లవాత్మక సంస్కరణలు తీసుకొచ్చారని, ఈనాడు మనం చూస్తున్న ఆధునిక విమానాశ్రయాలకు కూడా ఆయన సంస్కరణలే కారణమని అన్నారు. వాజ్‌పేయికి, చంద్రబాబుకు మధ్య తండ్రీకొడుకుల అనుబంధం ఉండేదని లోకేశ్ గుర్తుచేసుకున్నారు. "ఆనాడు ముఖ్యమంత్రిగా చంద్రబాబు ఢిల్లీకి వెళితే, సొంత కొడుకు వచ్చినంతగా వాజ్ పేయి ఆనందపడేవారు. 1998లోనే ఏపీలో డబుల్ ఇంజన్ సర్కార్ ఏర్పడింది. ఈ రోజు హైదరాబాద్ అభివృద్ధి చెందిందంటే దానికి కారణం వాజ్ పేయినే. ఐఎస్‌బీ, బీమా నియంత్రణ సంస్థను హైదరాబాద్‌లో ఏర్పాటు చేసి, ఆఫ్రోఏషియన్ గేమ్స్‌కు నిధులు కేటాయించారు. అందుకే తెలుగు జాతి ఆయనకు ఎప్పటికీ రుణపడి ఉంటుంది" అని లోకేశ్ ఉద్ఘాటించారు. వాజ్ పేయి చూపిన మార్గంలోనే ప్రధాని నరేంద్ర మోడీ పయనిస్తున్నారని, అందుకే ఏపీలో ఇప్పుడు డబుల్ ఇంజన్ కాదు, బుల్లెట్ ట్రైన్ వేగంతో ప్రభుత్వం నడుస్తోందని అన్నారు. ఆర్థికంగా ఎదగడమే కాకుండా, నైతిక విలువలు కూడా ముఖ్యమని, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నైతిక విలువలపై బోధన ప్రారంభిస్తామని తెలిపారు. తన నియోజకవర్గం మంగళగిరిలో వాజ్ పేయి భారీ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తానని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మంత్రి కొల్లు రవీంద్ర, బీజేపీ నేత సోము వీర్రాజు, ఎమ్మెల్యేలు సుజనా చౌదరి, మండలి బుద్ధప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# భవానీ దీక్షల విరమణ



ఇంద్రకీలాద్రి, డిసెంబరు 16 ప్రభాతవార్త: ఇంద్రకీలాద్రిపై కొలువైన శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో శ్రీభవానీ దీక్షల విరమణ కార్యక్రమాలు అత్యంత వైభవంగా విజయవంతంగా నిర్వహించడం పట్ల ఇఓ వికె శీనా నాయక్, ఛైర్మన్ రాధాకృష్ణ, పాలకమండలి, అధికా రులు, సిబ్బందికి ఎమ్మెల్యే సుజనా చౌదరి అభినందనలు తెలిపారు. ఆయన మంగళవారం దుర్గమ్మవారిని దర్శించు కున్నారు. ఆయనకు దుర్గమ్మవారి ప్రసాదం, శేషవస్త్రం, మెమొంటోలను అందించారు. అనంతరం వేదపండితులు వేదాశీర్వచనాలు పలికారు. ఆలయం నూతన శోభను సంతరించుకుంది. ఇఓ వికె శీనానాయక్ ఆలయ ప్రాంగణ మంతా ప్రత్యేక శ్రద్ధ తీసుకుని ముస్తాబు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 15 రోజుల పాటు మెరుగైన పారిశుద్ధ్యం నిర్వహణ, ఆలయ ప్రాంగణమంతా రంగులు వేయించి ముస్తాబు చేశామన్నారు.




# టూరిజం హబ్‌గా పోలవరం

**లేఔట్ ప్లాన్ డిజైన్ చేస్తున్నట్లు మంత్రి నిమ్మల వెల్లడి**

విజయవాడ, డిసెంబరు 16 ప్రభాతవార్త ప్రతినిధి: పోలవరం ప్రాజెక్టులో లైడార్ సర్వే చేసి గుర్తించిన 9900 ఎకరాల ప్రాంతాన్ని టూరిజం హబ్‌గా మార్చబోతున్నామని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు చెప్పారు. ఇందుకు సంబంధించి లేఅవుట్ ప్లాన్ డిజైన్ చేస్తున్నామన్నట్లు ఆయన పేర్కొన్నారు. అమరావతి సచివాలయంలో మంగళవారం పోలవరం స్పిల్ వే బ్యూటిఫికేషన్‌కు సంబంధించి, ఆర్కిటెక్ట్స్, ఏజెన్సీ ప్రతినిధులతో మంత్రి సమావేశం అయ్యారు. ఈ సమావేశంలో మంత్రి నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ తెలుగుదనంతో పాటు రాష్ట్ర ఔన్నత్యం చాటేలా పోలవరం స్పిల్ వే ఉండాలని సూచించారు. గౌరవ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాలతో పోలవరం లెఫ్ట్ బ్యాంకును కలుపుతూ వంతెనల నిర్మాణానికి సైతం ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నామని చెప్పారు. జాతీయ రహదారులు 365 బిబి నుంచి 516ఈ ని అనుసంధానం చేయాలన్నారు. ఇందుకుగాను రోడ్డు రవాణా సౌకర్యం ఉండేలా ప్రతిపాదనలు సిద్ధం చేయమని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో ఇరిగేషన్ ఉన్నతాధికారులు, ఏజెన్సీ ప్రతినిధులు, ఆర్కిటెక్ట్స్ పాల్గొన్నారు.

# గ్లోబల్‌సౌత్ పటిష్టతకు ఇథియోపియా భారత్ కీలక భాగస్వామి

**ఇథియోపియా ప్రధాని స్వయంగా కారు నడిపి మోడీని హోటల్‌కు తోడ్కొని వెళ్లిన అడ్డీస్**



అబాబా(ఇథియోపియా), డిసెంబరు 16: మూడుదేశాలపర్యటనలోభాగంగా ప్రధాని మోడీ మంగళవారం తూర్పుఆఫ్రికా దేశం అయిన ఇథియోపియాలో పర్యటన ప్రారంభించారు. నోబెల్ శాంతిపురస్కార గ్రహీత ఇథియోపియా ప్రధానమంత్రి అబీఅహ్మద్ అలీ స్వయంగా ప్రధాని మంత్రికి ఎయిర్‌పోర్టులో స్వాగతం పలికి ప్రదాని బసచేసే హోటల్‌కు తోడ్కొని వెళ్లారు. మార్గ మధ్యంలో నగరంలోని సైన్స్ మ్యూజియం, ఫ్రెండిషిప్ పార్కులు ప్రధాని సందర్శించారు. నాగరికత పరంగా రెండుదేశాలో ప్రాచీన స్వాభావిక నాగరికతతో ఉన్నాయని మోడీ సందర్భంగా తన సోషల్ మీడియా ఖాతాలో పోస్టు చేసారు. ఇథియేపియో ఒక గొప్పచరిత్ర ఉన్న దేశమని, సంస్కృతి సాంప్రదాయాలకు విలువలిచ్చే దేశంగా మోడీ కొనియాడారు. జోర్డాన్ పర్యటనను ముగించుకున్న ప్రధాని అక్కడి నుంచే నేరుగా ఇథియోపియాకు చేరుకున్నారు. తన జోర్డాన్ పర్యటన సత్ఫలితాలిచ్చిందని భారత్ జోర్డాన్ ఫలితాలు మరింత పటిష్టం కాగలవని ఆకాంక్షిస్తున్నట్లు ప్రధాని తన పోస్టులో పేర్కొన్నారు. మంగళ, బుధవాల్లో జరిగే ఇథియోపియా టూర్‌లోప్రధాని అబి అహ్మద్ అలీతో విస్తృతస్థాయిలో ద్వైపాక్షిక భేటీ నిర్వహిస్తారు. ఆఫ్రికా కూటమికి ప్రధాన కేంద్రంగా కూడా ఉన్న అడ్డీస్ అబాబా పర్యటన తనకు ఎంతో ప్రత్యేకమని మోడీ పేర్కొన్నారు. 2023లో జి20 అధ్యక్ష స్థానంలో ఉన్నపుడు ఆఫ్రికన్‌యూనియన్‌ను జి20లో శాశ్వత సభ్యదేశంగా ఆహ్వానించిన అంశాన్ని గుర్తుచేసుకున్నారు. పార్లమెంటు ఉభయసభలను ద్దేశించి మోడీ ప్రసంగిస్తారు. అలాగే భారత సంతతి కుటుంబాలను కూడా కలుసుకుంటారు. గ్లోబల్‌సౌత్ దిశగా భారత్ ఇథియోపియాల సహకారం వర్ధిల్లుతుందని భావిస్తున్నట్లు పేర్కొన్నారు. మోడీ పర్యటన లో ఈ సారి ఆయా దేశ అధ్యక్షులు యువరాజులు స్వయంగా తమ వాహనంలో మోడీని తోడ్కొని రావడం విశేషంగా భావిస్తున్నారు. ప్రపంచ దేశాల్లో భారత ప్రతిష్ట ఇనుమడిస్తోందనడానికి ఇదొక ఉదాహరణగా నిలిచింది.

# జోజినగర్‌లో 42 ఇళ్లు కూల్చివేతపై సిబిఐతో విచారణ జరిపించాలి

**- మాజీ సిఎం వైఎస్ జగన్... బాధితులను పరామర్శించిన వైసిపి అధినేత**



విజయవాడ, డిసెంబరు 16 ప్రభాతవార్త ప్రతినిధి: రాష్ట్ర ప్రభుత్వం పేదల భూములను భూకబ్జాదారులకు కట్టబెడుతుందని మాజీ సీఎం, వైయస్సార్‌సీపీ అధ్యక్షుడు వైయస్ జగన్ ఆరోపించారు. విజయవాడ నడిబొడ్డున ఖరీదైన భవానీపురం, జోజినగర్‌లో భూకబ్జాపై, 2016లోనే కన్నేశారని, అందుకే అప్పుడు 1981 నాటి డేట్‌తో ఒక ఫేక్ సొసైటీ ఏర్పాటు చేశారని స్పష్టం చేశారు. అప్పుడు టీడీపీ ప్రభుత్వం ఉందని గుర్తు చేసిన ఆయన, ఇప్పుడు ఏకంగా జోజినగర్‌లో 42 ఇళ్లు నిర్దాక్షిణ్యంగా కూల్చేశారని, కాబట్టి ఇందులో కూటమి పెద్దల కుట్ర స్పష్టంగా తేలుతోందని వెల్లడించారు. అందుకే జోజినగర్‌లో ఇళ్ల కూల్చివేతపై సీబీఐ విచారణ జరగాలని వైయస్ జగన్ డిమాండ్ చేశారు. అప్పుడే అన్ని విషయాలు వెలుగులోకి వస్తాయని తేల్చి చెప్పారు. జోజినగర్ బాధితుల బ్యాంక్ రుణాలు ప్రభుత్వమే చెల్లించాలని, కూల్చివేతలో ఇళ్లు కోల్పోయిన ఆ 42 కుటుంబాలకు తిరిగి ఇళ్లన్నీ కట్టించి ఇవ్వాలని వైయస్ జగన్ కోరారు. లేని పక్షంలో తమ ప్రభుత్వం రాగానే విచారణ జరిపించి, ఈ ఘటనకు బాధ్యులను బోనులో నిలబెట్టి తీరుతామని వెల్లడించారు. జోజినగర్ బాధితులకు పూర్తి అండగా నిలబడతామని, వారి న్యాయ పోరాటానికి పార్టీ తోడుగా ఉంటుందని ప్రకటించారు. బెంగళూరు నుంచి గన్నవరం చేరుకున్న వైయస్ జగన్, నేరుగా విజయవాడ, భవానీపురం జోజినగర్ వెళ్లారు. అక్కడ ఇటీవల 42 ఇళ్లు కూల్చివేయగా, రోడ్డున పడ్డ ఆ కుటుంబాల బాధితులను ఆయన పరామర్శించారు. కోర్టు ఉత్తర్వులున్నా, ఏకపక్షంగా తమ ఇళ్లు కూల్చివేశారని, ఎంత చెప్పినా వినకుండా, పోలీసులు తమ బ్రతుకులు రోడ్డు పాల్జేశారని వారు గోడు వెళ్లబోసుకున్నారు. వారి అంతులేని ఆవేదన, బాధలన్నీ సావధానంగా విన్న వైయస్ జగన్ ఓదార్పునిచ్చారు. ప్రభుత్వ తీరును తీవ్రంగా తప్పుబట్టారు. భవానీపురం జోజినగర్ ఇళ్లు కూల్చివేత అధికార దుర్వినియోగానికి పరాకాష్ఠ. సుప్రీంకోర్టులో కేసు విచారణలో ఉండగానే ఇళ్లు కూల్చివేత దారుణం. ఈ కూల్చివేతలో సీఎం చంద్రబాబు, ఆయన కుమారుడు నారా లోకేష్, ఎంపీ కేశినేని చిన్నితో పాటు, స్థానిక జనసేన కార్పొరేటర్ సోదరుడి ప్రమేయం ఉంది. సుప్రీంకోర్టులో కేసు విచారణలో ఉండగానే ఇళ్లు ఎలా కూల్చేస్తారు? పేదలకు అండగా ఉండాల్సిన ప్రభుత్వమే వారికి వ్యతిరేకంగా అఫిడవిట్లు, పిటిషన్లు వేయడం దుర్మార్గం. విజయవాడ జోజినగర్‌లో 42 కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. వారు 25 ఏళ్ల నుంచి ఇళ్లు కట్టుకుని ఉంటే, ఒకేసారి వచ్చి ధ్వంసం చేశారు. సుప్రీంకోర్టులో ఈ స్థలం గురించి న్యాయపోరాటం జరుగుతోంది. దీనిపై విచారణ కొనసాగుతోంది. డిసెంబరు 31 వరకు, 42 కుటుంబాలకు సుప్రీంకోర్టు ఊరటనిచ్చింది. ఒకవైపున సుప్రీంకోర్టులో కేసు పెండింగ్‌లో ఉండగా, ఈనెల 31 వరకు ఊరట ఉండగానే, ఒకేసారి 200 మందికి పైగా పోలీసులు వచ్చి, ప్రైవేటు పార్టీకి మద్దతు తెలుపుతూ, ఈ 42 ఇళ్లకు సంబంధించిన వారిని నిర్దాక్షిణ్యంగా, వాళ్లు ఇళ్లలో ఉండగానే, ఇళ్లన్నీ పడగొట్టి రోడ్డున పడేశారు.ప్రభుత్వ పెద్దల ప్రమేయం, వారి సహకారం, వారి ఆశీస్సులతోనే ఇదంతా జరిగింది. అందుకే ఇంత అకస్మాత్తుగా. ఈ నెలాఖరు వరకు గడువు ఉందని తెలిసినా కూడా, అధికార దుర్వినియోగం చేస్తూ, వీరిని రోడ్డు పాల్జేశారుఇక్కడ 2 ఎకరాల 17 సెంట్లకు సంబంధించి చూస్తే, దీని ప్రస్తుత మార్కెట్ విలువ రూ.150 కోట్లకు పైగానే. దీంట్లోకి ప్రైవేటు వ్యక్తులు వచ్చారు. 2016లో ఒక ఫేక్ సొసైటీ పెట్టారు. అప్పుడు కూడా సీఎం చంద్రబాబు. 1981 డేట్‌లో ఒక తప్పుడు సొసైటీ ఏర్పాటు చేసి, ఈ ప్రాంతాన్ని కబ్జా చేయడానికి కుట్ర చేశారు. సీఎం చంద్రబాబు, నారా లోకేష్, ఎంపీ కేశినేని చిన్ని, జనసేన కార్పొరేటర్ సోదరుడికి కూడా ఇందులో ప్రమేయం ఉంది. ఇది విచ్చలవిడి అధికార దుర్వినియోగం. సుప్రీంకోర్టులో కేసు విచారణలో ఉండగా, 200 మంది పోలీసులు వచ్చి, ఇంత మందిని రోడ్డు పాల్జేశారు. ఈ 2 ఎకరాల 17 సెంట్లలో 2001కి ముందు నుంచి వీరు ఇక్కడ నివాసం ఉంటున్నారు. ఇందులో చాలా మంది ఇళ్లు కట్టుకున్నారు. వాటికి విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ అనుమతి కూడా ఇచ్చింది. ఈ ఇళ్లకు కరెంటు, డ్రైనేజీ కనెక్షన్లు కూడా ఉన్నాయి. అన్నింటికీ అన్ని అనుమతులు ఉన్నాయి. బ్యాంకులు కూడా లోన్లు ఇచ్చాయి. చాలా మంది లోన్‌లో ఇళ్లు కట్టుకున్నారు. మరి ఇక్కడ స్థలాలు వేరేవారివైతే, ఎలా అనుమతి ఇచ్చారు? ఎలా రిజిస్ట్రేషన్ చేశారు? బిల్డింగ్ ప్లాన్ ఎలా అనుమతించారు? బ్యాంకులు లోన్లు ఎలా ఇచ్చాయి? వాటర్, పవర్ కనెక్షన్లు ఎలా ఇచ్చారు? ఇన్ని ఉన్నా, ఎలాంటి నోటీసు కూడా ఇవ్వకుండా, ప్రైవేటు వ్యక్తులకు మద్దతు ఇస్తూ, పోలీసులు వచ్చి, జేసీబీలతో ఇళ్లు ఎలా కూల్చేశారు? గతంలో ఇక్కడ ఇళ్ల క్రయ, విక్రయాలు జరిగినప్పుడు, పత్రికా ప్రకటనలు కూడా ఇచ్చారు. అభ్యంతరాలు ఉంటే చెప్పాలని. కానీ, ఎవరూ, ఎక్కడా అభ్యంతరాలు రాలేదు.అయినా, ప్రైవేటు వ్యక్తులకు మేలు చేసేందుకు పోలీసులు ఇళ్లు కూల్చేశారు. అసలు ఈ ప్రభుత్వం ఎవరి కోసం పని చేస్తోంది? ఇక్కడి వారు సీఎం చంద్రబాబును, ఆయన కుమారుడు లోకేష్‌ను మూడుసార్లు కలిశారు. ఎవరికైతే వీరు అర్జీలు ఇచ్చారో.. వారే కుట్ర పన్ని, వీళ్లకు అన్యాయం చేశారు. ఇక్కడే కాదు. రాష్ట్రమంతా ఇదే కొనసాగుతోంది. అనేక చోట్ల.. ఎక్కడైనా చిన్న చిన్న లిటిగేషన్లు ఉంటే, టీడీపీ నాయకులు ఎంటర్ అవుతున్నారు. ల్యాండ్ కబ్జా చేస్తున్నారు. ఇంకా కొన్ని చోట్ల వారే స్వయంగా లిటిగేషన్లు పెట్టి, కబ్జా చేస్తున్నారు. నేను ఒకటే కోరుతున్నాను. ఈ వ్యవహారంపై వెంటనే సీబీఐ దర్యాప్తు జరిపించాలి. సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్, ఎంపీ కేశినేని చిన్ని, జనసేన కార్పొరేటర్ ఎలా, ఏం చేస్తున్నారో.. ప్రజలకు తెలియాలి.ఇక్కడ 1981 డేట్‌తో ఫేక్ సొసైటీని 2016లో ఏర్పాటు చేశారు. అది కూడా బయటకు రావాలి. ప్రభుత్వం పేదలకు అండగా ఉండాల్సింది పోయి, వారికి వ్యతిరేకంగా అఫిడవిట్లు, పిటిషన్లు వేసింది. అందుకే ఇక్కడి మొత్తం వ్యవహారంపై విచారణ జరగాలి. వాస్తవాలు బయటకు రావాలి అని జగన్ డిమాండ్ చేశారు.

# బుగ్గపాడులో మౌలిక వసతులు పూర్తి చేయండి



## మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో కలిసి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు సమీక్ష

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, డిసెంబరు 16:** ఖమ్మం జిల్లా సత్తుపల్లిలోని బుగ్గపాడు పారిశ్రామిక వాడలో మౌలిక సదుపాయాలను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని ఐటీ, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అధికారులను ఆదేశించారు. వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో కలిసి ఆయన మంగళవారం టిజిఐఐసి అధికారులతో ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. సమావేశంలో ఐటీ, పరిశ్రమల శాఖ స్పెషల్ చీఫ్ సెక్రెటరి సంజయ్ కుమార్ కూడా పాల్గొన్నారు. బుగ్గపాడులోని 200 ఎకరాల్లో మెగా ఫుడ్ పార్క్, తెలంగాణ ఫుడ్ ప్రాసెసింగ్ జోన్, ఎంఎస్ ఎంఇ జోన్‌లను టిజిఐఐసి ఏర్పాటు చేసింది. ఇక్కడ పరిశ్రమలు ఏర్పాటు చేయడానికి పెట్టుబడిదారులు ముందుకొస్తున్నందున త్వరితగతిన ఏర్పాట్లన్నీ పూర్తిచేయాలని శ్రీధర్ బాబు సూచించారు. ఫుడ్ ప్రాసెసింగ్ పార్కులో జనవరిలో పరిశ్రమల నిర్మాణాలు మొదలయ్యేలా చూడాలని ఆయన ఆదేశించారు. మెగా ఫుడ్ పార్కుకు కేటాయించిన 60 ఎకరాల్లో యూనిట్ల నిర్మాణాలను ప్రారంభించేలా భూకేటాయింపులు పొందిన వారిని కోరాలని తెలిపారు. తెలంగాణ ఫుడ్ ప్రాసెసింగ్ జోన్ ను 80 ఎకరాలు, ఎంఎస్ ఎంఇ జోన్ ను 60 ఎకరాల్లో ఏర్పాటు చేస్తున్నారు. ఫుడ్ ప్రాసెసింగ్ జోన్ లో కొత్తగా వ్యవసాయ, ఆక్వారంగ పరిశ్రమలు ఏర్పాటు చేయడానికి ఇన్వెస్టర్లు ఆసక్తి చూపిస్తున్నారు. సమావేశంలో టిజిఐఐసి ఎండి శశాంక, పరిశ్రమల శాఖ కమిషనర్ నిఖిల్ చక్రవర్తి, డైరెక్టర్ (ఇన్ వెస్ట్ మెంట్స్) మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

# అమరవీరులకు గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ, డిప్యూటీ సిఎం భట్టి ఘన నివాళులు

**హైదరాబాద్ (కంటోన్మెంట్), డిసెంబరు 16, ప్రభాతవార్త:** విజయ్ దివస్ సందర్భంగా సికింద్రాబాద్ పెరేడ్‌గ్రౌండ్‌లోని అమరవీరుల స్తూపం వద్ద గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఘనంగా నివాళులు అర్పించారు.



త్రివిధదళాల అధికారులు నివాళులు అర్పించి అమరవీరులకు గౌరవ వందనం చేశారు. భారతదేశ ప్రస్థానాన్ని కాపాడ దంలో అనాటి ప్రధాని ఇందిరా గాంధీ కీలక పాత్ర పోషించారని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పేర్కొన్నారు. సాహసోపేతమైన నిర్ణయంతో 1971 లో జరిగిన ఇండో పాక్ యుద్ధ రణరంగంలో భారత సైనికులు వీరోచిత పోరాటం మరువ లేనిది అని కొనియాడారు. 1971లో ఈస్ట్ పాకిస్తాన్ గా కొనసాగిన బంగ్లాదేశ్ ను పాకిస్తాన్ నుండి విముక్తి కల్పించేందుకు జరిగిన భారత్ పార్క్ యుద్ధంలో భారత సైన్యం జన విజయాన్ని సాధించిన నేపథ్యంలో విజయ దివస్ జరుపుకుంటున్నట్లు తెలిపారు. విజయ్ దివస్ లో ఆనాడు యుద్ధ భూమిలో పాల్గొన్న మాజీ సైనిక అధికారులు సైనిక ఉద్యోగులు పాల్గొని నివాళులర్పించారు.

# విజిలెన్స్ ఆకస్మిక దాడుల్లో పిడిఎస్ బియ్యం పట్టివేత

## కరీంనగర్-పెద్దపల్లిలో వాహనాల తనిఖీలు

**హైదరాబాద్, డిసెంబరు 16, ప్రభాతవార్త:** తెలంగాణ విలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ హైదరాబాద్ యూనిట్ అధికారులు రాజీవ్‌గాంధీ ఇంటర్‌నేషనల్ ఎయిర్‌పోర్టు పోలీసుస్టేషన్ పరిధిలోని శంషాబాద్, తొల్ల బస్తీలో ఆకస్మిక తనిఖీ నిర్వ హించి 80 క్వింటాళ్ల పిడిఎస్ బియ్యంను పట్టుకొన్నారు. మహ్మద్ ఇంతియాజ్ అనే వ్యక్తి కాలనీలలో బియ్యం సేకరణ చేసివాటిని పెద్దమొత్తంలో వేరొక దళారికి విక్రయిస్తూ ఉంటారని విజిలెన్స్ అధికారులకు సమాచారం అందడంతో ఆయన షెడ్డులో తనిఖీ చేశారు. 80 క్వింటాళ్ళ సన్నబియ్యం లభించింది. స్వాధీనం చేసుకొన్న బియ్యం విలువ రూ.3,20,000 ఉంటుందని పిఆర్‌వో వెంకటేశ్వర్లు తెలిపారు. కరీంనగర్ యూనిట్ అధికారులు కరీంనగర్ -పెద్దపల్లి రోడ్డుపై ఆకస్మిక తనిఖీలు చేసి మోటారు వాహనచట్టం పన్నులు ఎగవేసిన వారికి జరిమానాను విధిం చారు. సుమారు 3,50,000 జరిమానా వసూలు చేసినట్లు విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్‌ఐ, పిఆర్‌వో వెంకటేశ్వర్లు తెలిపారు. మొత్తంగా 15వాహనాలను వారు పెద్దపల్లి కరీంనగర్ రోడ్డుపై తనిఖీ చేశారు.

# రాష్ట్రంలో వక్ఫ్ భూముల రక్షణపై ప్రత్యేక దృష్టి

## ఉమ్మీద్ పోర్టల్ ఏర్పాటులో తలెత్తిన సాంకేతిక సమస్యలు

## మైనార్టీల బడ్జెట్ పెంచేందుకు కృషి చేస్తాం: మంత్రి అజారుద్దీన్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, డిసెంబరు 16:** తెలంగాణలో వక్ఫ్ భూముల పరిరక్షణపై తమ ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించిందని మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి అజారుద్దీన్ స్పష్టం చేశారు. భూముల వివరాలను డిజిటలైజ్ చేసేందుకు ప్రత్యేకంగా 'ఉమ్మీద్ పోర్టల్' ఏర్పాటు చేస్తున్నామని, అయితే గత 10 రోజులుగా సాంకేతిక సమస్యలు తలెత్తాయని తెలిపారు. మంగళవారం సచివాలయంలో ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీతో కలిసి మీడియాతో మాట్లాడుతూ ఆయన ఈ వివరాలను వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 63,180 ఎకరాల వక్ఫ్ ఆస్తులు ఉండగా, ఇప్పటివరకు కేవలం 16,700 ఎకరాల వివరాలను మాత్రమే పోర్టల్‌లో నమోదు చేశారని మంత్రి వెల్లడించారు. ఇంకా 46 వేల ఎకరాలకు పైగా భూముల వివరాలు నమోదు కావాల్సి ఉందన్నారు.

తప్పుడు పత్రాలతో భూములను అప్‌లోడ్ చేస్తే వాటిని తిరస్కరిస్తామని హెచ్చరించారు. పోర్టల్‌లో సాంకేతిక సమస్యలు, యాప్ సరిగా పనిచేయకపోవడం వల్ల భూముల నమోదుకు మరింత సమయం ఇవ్వాలని కోరుతూ ప్రధాన మంత్రికి, కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాసినట్లు వివరించారు.

ఇటీవల గురుకులాల్లో జరిగిన ఫుడ్ పాయిజనింగ్ ఘటనలను మంత్రి దురదృష్టకరమని అభివర్ణించారు. ఈ ఘటనలపై విచారణకు ఆదేశించామని, నిరక్ష్యంగా వ్యవహరించిన అధికారులపై ఇప్పటికే చర్యలు తీసుకున్నామని తెలిపారు. భవిష్యత్తులో ఇలాంటివి పునరావృతం కాకుండా విద్యార్థులకు భోజనం అందించడానికి 30 నిమిషాల ముందే అధికారులు, సిబ్బంది పర్యవేక్షించాలని ఆదేశాలు జారీ చేశామన్నారు.

రాబోయే బడ్జెట్‌లో మైనార్టీల కోసం నిధులు పెంచేందుకు కృషి చేస్తున్నామని, గురుకులాల్లో కేవలం 40 పోస్టులు మాత్రమే ఖాళీగా

# కెటిఆర్ పగటి కలలు..

## ఓటమిపాలైనా బుద్ధిరాని బిఆర్ఎస్ నేతలు

## ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

**హైదరాబాద్, డిసెంబరు 16, ప్రభాతవార్త:** పార్లమెంట్ ఎన్నికలలో గతంలో సారు కారు పదహారు అని దెబ్బతిన్నారు, అసెంబ్లీ ఎన్నికలలో వంద స్థానాలు గెలుస్తామని చెప్పి చిత్తుగా ఓడిపోయారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీకి అభ్యర్థులు లేరు, కంటోన్మెంట్, జూబ్లీహిల్స్‌లోనూ సీటును కోల్పోయి దెబ్బతిన్నారు అయినా 'మాదే అధికారం' అంటూ కెటిఆర్ పగటి కలలు కంటూ ఉన్నారు. బిఆర్ఎస్ నేతలకు బుద్ధిరావడం లేదని వేములవాడ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆదిశ్రీనివాస్ విమర్శించారు. సిఎల్‌పిలో ఆయన మాట్లాడుతూ ప్రజలు పదేళ్ల అధికారం ఇస్తే వేలకోట్ల రూపాయలు దోచుకొని ఫామ్‌హౌజ్ కట్టుకొన్నారని ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఒక్క రోజు కూడా విరామం తీసుకోకుండా 18గంటలు పనిచేస్తున్నారని ఇది ప్రజాప్రభుత్వమని ఆయన తెలిపారు. రేవంత్ పాలనకు ఫిదా అయి కాంగ్రెస్ పార్టీకి రెండు విడుతల్లో 5,500 గ్రామపంచాయతీలలో కాంగ్రెస్ మద్దతుదారులను గెలిపించారని అన్నారు. తాను ఎమ్మెల్యేగా గెలవడం ఇదే తొలిసారైనా వందల కోట్లతో వేములవాడలో అభివృద్ధి కార్యక్రమాలు చేస్తున్నాను వేములవాడకు నూలు డిపో తీసుకొచ్చానని ఆయన తెలిపారు. కెసిఆర్ వేములవాడ ఆలయంకు వందకోట్ల రూపాయలు కేటాయించి అభివృద్ధి చేస్తానని మాట ఇచ్చి రాజన్నకు శఠగోపం పెట్టారని తాను ఇప్పుడు రూ.150కోట్లతో ఆలయాన్ని పునర్నిర్మాణం చేస్తున్నానని చెప్పారు. వచ్చే ఎన్నికలలో మళ్లీ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తోందని ధీమాను శ్రీనివాస్ వ్యక్తీకరించారు.

# కాంగ్రెస్ ఎమ్మెల్యేల బెదరింపులకు భయపడవద్దు

## మళ్లీ వచ్చేది మన ప్రభుత్వమే: కొత్త సర్పంచ్‌లకు కెటిఆర్ భరోసా

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, డిసెంబరు 16:** రాష్ట్రంలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు అధికార మదం తలకెక్కిందని, ప్రజలను, ప్రజా ప్రతినిధులను చంపేస్తామంటూ బరితెగించి మాట్లాడుతున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. మంగళవారం తెలంగాణ భవన్‌లో ఖానాపూర్, షాద్‌నగర్ నియోజకవర్గాల్లో నూతనంగా ఎన్నికైన సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యుల సన్మాన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కేటీఆర్ వారికి శుభాకాంక్షలు తెలుపుతూ ప్రస్తుత ప్రభుత్వ వైఫల్యాలపై సుదీర్ఘంగా ప్రసంగించారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఇష్టం వచ్చినట్టు ప్రవర్తిస్తున్నారు. ఒక ఎమ్మెల్యే అయితే నన్ను ఓడించి చంపేస్తే.. నేను మిమ్మల్ని గెలిచి చంపేసా అని బహిరంగంగా బెదరింపులకు దిగుతున్నారు. ఎమ్మెల్యేల ప్రవర్తన చూసి కాంగ్రెస్ కార్యకర్తలు కూడా గ్రామాల్లో అరాచకాలు చేస్తున్నారు. సర్పంచులు ఎవరూ ఇలాంటి బెదరింపులకు లొంగవద్దు. ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వకపోవడానికి ఈ ఎమ్మెల్యేలు ఎవరు? ప్రజల పైసలతో కడుతున్న ఇళ్లకు అర్హులను ఎంపిక చేసే పూర్తి అధికారం గ్రామ సభలకు, సర్పంచులకే ఉంటుంది. ఎవడైనా అడ్డుతగిలితే తాట తీసి లైన్‌లో పెట్టండి' అని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలకే నిధులు దిక్కులేక ప్రపంచబ్యాంకుకు ఉత్తరాలు రాస్తున్నారని, అలాంటి సర్పంచ్‌లకు ఏం ఇస్తారని కేటీఆర్ ఎద్దేవా చేశారు. రెండు సంవత్సరాల్లో ఒక్క రూపాయి కూడా గ్రామ పంచాయతీలకు ఇవ్వని కాంగ్రెస్, ఇప్పుడు ఎలా గ్రామాలకు నిధులు ఇస్తారని కేటీఆర్ అన్నారు. రాజ్యాంగం ప్రకారం ఐదు అంచెల పాలనలో గ్రామ పంచాయతీలకు స్వయం ప్రతిపత్తి ఉందని గుర్తు చేశారు. కేంద్ర ఫైనాన్స్ కమిషన్ నుంచి రావాల్సిన రూ. 3,500 కోట్ల నిధుల కోసమే కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలను మోసం చేసి, రిజర్వేషన్లను 24 నుంచి 17 కి తగ్గించి హడావుడిగా ఎన్నికలు జరిపింది. ఫైనాన్స్ కమిషన్ నిధుల్లో 70 శాతం నేరుగా గ్రామ పంచాయతీలకే రావాలి. ఆ నిధులను ఆపే హక్కు ఏ ముఖ్యమంత్రికి గానీ, ఎమ్మెల్యేకు గానీ లేదు. మీ హక్కుల కోసం కొట్లాడండి, బీఆర్ఎస్ పార్టీ మీకు అండగా ఉంటుంది' అని హామీ ఇచ్చారు. ఇందుకోసం జిల్లాకొక ప్రత్యేక లీగల్ సెల్ ఏర్పాటుతోపాటు, స్థానిక ప్రజాప్రతినిధులకు ప్రత్యేక శిక్షణా శిబిరాలు ఏర్పాటు చేస్తామన్నారు.



కేసీఆర్ పాలనలో పల్లెలు పచ్చగా ఉండేవని, ఇప్పుడు కాంగ్రెస్ పాలనలో అనాథలయ్యాయని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. కేసీఆర్ హయాంలో ప్రతి గ్రామానికి ట్రాక్టర్, ట్యాంకర్, నర్సరీ, వైకుంఠ ధామం వచ్చాయి. తెలంగాణ పల్లెలు దేశానికే ఆదర్శంగా నిలిచి 30 శాతం జాతీయ అవార్డులు గెలుచుకున్నాయి. కానీ నేడు పరిస్థితి దారుణం. ట్రాక్టర్లకు డీజిల్ పోయించే దిక్కు లేదు. రైతులు యూరియా కోసం లైన్లలో నిలబడి బాధలు పడుతున్నారని కెటిఆర్ అన్నారు. సర్పంచ్ ఎన్నికల కోసం ముఖ్యమంత్రి స్వయంగా జిల్లాలు తిరుగుతూ ప్రచారం చేయడం చరిత్రలో ఎన్నడూ లేదని కేటీఆర్ విమర్శించారు. ఎన్టీఆర్, వైఎస్ఆర్, కేసీఆర్ వంటి నాయకులు ఏనాడూ సర్పంచ్ ఎన్నికల కోసం రోడ్ల మీద పడలేదన్నారు. రేవంత్ రెడ్డికి ఓటమి భయం పట్టుకుందని, అందుకే విజయోత్సవాల పేరుతో పరోక్ష ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ఈ కాంగ్రెస్ ప్రభుత్వం ఉండేది ఇంకో రెండేళ్లే. మళ్ళీ వచ్చేది కేసీఆర్ ప్రభుత్వమే. మీరు ఐదేళ్ల కోసం గెలిచారు, మిగిలిన సగం కాలం మన ప్రభుత్వం లోనే అభివృద్ధి పనులు చేసుకుంటారు. ఖానాపూర్, షాద్ నగర్ గడ్డపై మళ్ళీ గులాబీ జెండా ఎగరడం ఖాయం' అని ధీమా వ్యక్తం చేశారు. రానున్న ఎంపీటీసీ, జడ్పీ ఎన్నికల్లో ఐకమ త్యంతో కలిసి పనిచేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్, మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్, మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్, ఖానాపూర్ ఇన్‌చార్జి జాన్సన్ నాయక్, పెద్దసంఖ్యలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మీ సేవ వాట్సాప్ సేవకు భారీ స్పందన

## 22 రోజుల్లో 2.7 లక్షల సార్లు

## వినియోగం: ఐటి, పరిశ్రమల మంత్రి శ్రీధర్‌బాబు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, డిసెంబరు 6:** రాష్ట్ర ప్రభుత్వ ఫ్లాగ్‌షిప్ డిజిటల్ సేవల వేదిక మీ సేవా కింద ప్రారంభించిన వాట్సాప్/చాట్‌బాట్ సేవను తెలంగాణ వ్యాప్తంగా ప్రజలు 22 రోజుల్లోనే 2.7 లక్షల సార్లు ఉపయోగించారని రాష్ట్ర ఐటీ మంత్రి డి. శ్రీధర్‌బాబు తెలిపారు. నవంబరు 18న మీ సేవా కింద అదనపు డిజిటల్ ఛానల్‌గా ఈ సేవను ప్రభుత్వం ప్రారంభించింది. ఈ సేవ ద్వారా ప్రజలు ఇకపై మీ సేవా కేంద్రాలకు వెళ్లకుండానే ప్రభుత్వ సేవలు పొందగలుగుతున్నారు. ధృవీకరణ పత్రాల కోసం దరఖాస్తు చేయవచ్చు. బిల్లుల వివరాలు తెలుసుకోవచ్చు. దరఖాస్తుల స్థితిని పరిశీలించవచ్చు. ఫిర్యాదులు కూడా నమోదు చేయవచ్చు. ఈ సేవ ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని రూపొందించబడిందని మంత్రి తెలిపారు. ప్రజల కేంద్రిత డిజిటల్ పరిపాలనను మరింత విస్తరించడమే ప్రభుత్వ లక్ష్యమని ఆయన అన్నారు. ప్రభుత్వ ఎలక్ట్రానిక్ సర్వీస్ డెలివరీ (ఈఎస్‌డి) విభాగం వెల్లడించిన గణాంకాల ప్రకారం, నవంబర్ 18 నుంచి డిసెంబర్ 9 వరకు మీ సేవా వాట్సాప్ సేవను ప్రజలు మొత్తం 2,78,267 సార్లు వినియోగించారు. ఈ కాలంలో 2,09,084 వేర్వేరు మొబైల్ నంబర్ల నుంచి ప్రజలు ఈ సేవను ఉపయోగించినట్లు అధికారులు తెలిపారు. అదే సమయంలో 75,655 దరఖాస్తు ఫారాలు సమర్పించబడ్డాయి. వీటిలో 1,403 మాత్రమే నిజమైన దరఖాస్తులు కాగా, మిగిలినవి సేవల గురించి తెలుసుకునేందుకు లేదా విధానాన్ని అర్థం చేసుకునేందుకు చేసిన ప్రయత్నాలుగా అధికారులు పేర్కొన్నారు. అలాగే 45,829 సార్లు దరఖాస్తుల స్థితి పరిశీలించబడింది. మొత్తం విజయ శాతం 81.3 శాతంగా నమోదైంది. ప్రజలు ఎక్కువగా వినియోగిస్తున్న సేవల్లో జనన ధృవీకరణ పత్రం, ఆదాయ ధృవీకరణ పత్రం, పోలీస్ చలాన్లు, విద్యుత్ బిల్లుల సేవలు ఉన్నాయి. రోజువారీ పరిపాలనా అవసరాలకు వాట్సాప్ ఒక సులభమైన, నమ్మదగిన వేదికగా మారుతోందని మంత్రి తెలిపారు. భవిష్యత్తులోనూ మీ సేవా ద్వారా మరిన్ని డిజిటల్ సేవలను అందుబాటులోకి తీసుకువస్తామని మంత్రి చెప్పారు. వ్యవస్థలను మరింత బలోపేతం చేస్తామని, ప్రజలకు సులభంగా, నిరంతరాయంగా సేవలు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.

# అసలు రైతులకు శిక్ష, కౌలు రైతులపై కక్ష

## యూరియా యాప్ విధానంపై మాజీమంత్రి సింగిరెడ్డి ధ్వజం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, డిసెంబరు 16:** యూరియా పంపిణీ కోసం కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిన యాప్ విధానం సరికాదంటూ మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి నిప్పులు చెరిగారు. ఈ స్కీమ్ అసలు రైతులకు శిక్ష..కౌలు రైతులపై కక్ష అన్నట్లుగా ఉందని మండిపడ్డారు. ఆడలేక మద్దెలోడు అన్నట్లు .. ప్రభుత్వ యూరియా పంపిణీ వ్యవహారం ఉందని విమర్శించారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్ పాలనలోనే యూరియా కొరత ఎందుకు వస్తోందని ఆయన ప్రశ్నించారు. ఈ యూరియా యాప్ టెనెన్సీ యాక్ట్ ప్రకారం.. అసలు రైతులు, కౌలు రైతుల మధ్య చిచ్చుపెట్టేలా ఉందని సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి అన్నారు. అసలు రైతులు ధైర్యంగా కౌలు ఇచ్చేందుకు ముందుకు వచ్చే సాహసం చేయకపోవచ్చని.. ఈ చర్య సాగును తగ్గించే కుట్రలా కనిపిస్తుందని అన్నారు. ఇంటి నుంచే యూరియా బుకింగ్ అనే నిర్ణయం కూడా అనుమానాస్పదంగా ఉందన్నారు. దళారులు రైతుల పేర్ల మీద యూరియా బుక్ చేసే అవకాశం ఉందని సందేహం వ్యక్తం చేశారు.

# కోఠి మహిళా వర్సిటీ మెస్ ఇన్‌చార్జి వినోద్ సస్పెన్షన్

**హైదరాబాద్ (గన్‌ఫౌండ్రి), డిసెంబరు 16, ప్రభాతవార్త:** చాకలి ఐలమ్మ మహిళా యూనివర్సిటి మెస్ ఇన్‌చార్జ్ వినోద్‌ను ప్రిన్సిపల్ సస్పెండ్ చేశారు. యూనివర్సిటీలో విద్యార్థినులను వేధిస్తున్నాడంటూ మెస్ ఇన్‌చార్జ్ వినోద్‌పై ఆరోపణలు వచ్చాయి. హాస్టల్‌లో చదువుతున్న విద్యార్థినులే షీ టీమ్‌కు ఫోన్ చేసి వినోద్ వేధింపులకు గురి చేస్తున్నారని ఫిర్యాదు చేశారు. అతడి పరివర్తన ఇబ్బందికరంగా ఉందని ఫిర్యాదులో పేర్కొన్నారు. యాజమాన్యం కూడా అతడికే మద్దతుగా ఉందని ఫిర్యాదు చేసినా పట్టించుకోడంలేదని తెలిపారు. తమనకు పర్సనల్‌గా టార్గెట్ చేస్తారనే ఫిర్యాదు చేయలేకపోతున్నామని చెప్పారు.




సిఎం ప్రజావాణిలో చిన్నారెడ్డిని కలిసి దరఖాస్తు అందజేస్తున్న ట్రాన్స్‌పోర్ట్ వాహనాల డ్రైవర్లు.

# ట్రాన్స్‌పోర్ట్ యాప్‌ను ప్రభుత్వమే నిర్వహించాలి

## గిగ్ వర్కర్స్‌గా గుర్తించాలంటూ చిన్నారెడ్డికి వినతి

**హైదరాబాద్ (బేగంపేట), డిసెంబరు 16, ప్రభాతవార్త:** టాన్స్‌పోర్ట్ యాప్ ను ప్రభుత్వమే నిర్వహించాలని, గిగ్ వర్కర్స్‌గా గురించాలంటూ మంగళవారం మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో ట్రాన్స్‌పోర్ట్ డ్రైవర్లు సీఎం ప్రజావాణీ ఇంచార్జి డా.జి.చిన్నారెడ్డి, స్టేట్ నోడల్ అధికారి దివ్యదేవరాజన్‌కి వినతి పత్రం సమర్పించారు. ప్రైవేట్ పోర్టర్ దోపిడీని అరికట్టాలని కోరుతూ భారీ ఎత్తున ట్రాన్స్‌పోర్ట్ డ్రైవర్లు సీఎం ప్రజావాణీకి తరలివచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా 30వేల మంది ట్రాన్స్‌పోర్ట్ డ్రైవర్లు రవాణా రంగంలో సరుకులను ప్రస్తుతం ప్రైవేటు పోర్టర్ యాప్ ద్వారా గమ్య స్థానాలకు చేరవేస్తున్నామని వారు తెలిపారు. డీజిల్ ధరలు పెరిగినా రవాణా ఛార్జీలు పెంచకుండా శ్రమ దోపిడీ చేస్తున్న ప్రైవేట్ పోర్టర్ స్థానంలో ప్రభుత్వమే ట్రాన్స్‌పోర్ట్ యాప్‌ను ఏర్పాటు చేయాలని, గిగ్ వర్కర్స్‌లాగా గుర్తించాలని కోరుతూ మరికొన్ని డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఇచ్చారు. త్వరలోనే సమస్యలను పరిష్కరిస్తామని చిన్నారెడ్డి, దివ్యలు వారికి హామీ ఇచ్చారు.

### ప్రజావాణికి అందిన దరఖాస్తులు 341

ప్రజాభవన్‌లో మంగళవారం నిర్వహించిన సీఎం ప్రజావాణీ కార్యక్రమంలో మొత్తం 341 దరఖాస్తులు అందాయి. వీటిలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించి 98 దరఖాస్తులు, రెవెన్యూ శాఖకు సంబంధించి 38దరఖాస్తులు, ఇందిరమ్మ ఇండ్లకోసం 157 దరఖాస్తులు, ప్రవాసీ ప్రజావాణీకి 2 దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు. సీఎం ప్రజావాణి ఇన్‌చార్జి డా.చిన్నారెడ్డి, స్టేట్ నోడల్ అధికారి దివ్య దేవరాజన్ దరఖాస్తులు స్వీకరించి ప్రజల సమస్యలు విని సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి పలు సమస్యలను పరిష్కరించారు.

# సాహితీ ప్రపంచంలో ఆరుద్ర, రామలక్ష్మి చిరస్మరణీయులు

## ఆరుద్ర స్మారక తపాలా బిళ్ల ఆవిష్కరణ కార్యక్రమంలో మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు

**హైదరాబాద్, డిసెంబరు 16, ప్రభాతవార్త:** కవి జంటగా ఆరుద్ర, రామలక్ష్మి ౖ దంపతులు తెలుగు సాహితీ ప్రపంచంలో చిరస్మరణీయంగా నిలు స్తారని మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంక య్యనాయుడు అన్నారు. ప్రముఖ కవి, ఆరుద్ర శత జయంతి సందర్భంగా హైదరాబాద్‌లోని ఒక హోటల్‌లో మంగళవారం ఆయన స్మారక తపాల బిళ్ల ఆవిష్కరణ కార్యక్ర మంలో వెంకయ్య నా యుడు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ కార్య క్రమంలో పోస్ట్‌మాస్టర్ జనరల్ వీణాకుమారి, ఆరుద్ర కుమార్తె కవితా చింతామణి, మనవడు గౌతమ్ చింతామణి, సాహితీవేత్త లగడపాటి సంగయ్య సహా పలువురు సాహితీ ప్రముఖులు ఆరుద్ర కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వెంకయ్య నాయుడు మాట్లాడుతూ వారసత్వం అంటే ఆస్తులు, పదవులు పంచు కోవడం కాదని, పెద్దలు చూపించిన మార్గాన్ని, వారి ఆలోచనలను భవిష్యత్ తరాలకు మరింత మెరుగైన మార్గంలో అందజేయడమే నిజమైన వారసత్వం అనిపించుకుంటుందని పేర్కొన్నారు. 'తెలుగు సాహితీ, సినిమా ప్రపంచానికి 'ఆరుద్ర'గా కలం పేరుతో సుపరిచితులైన శ్రీ భాగవతుల సదాశివ శంకరశాస్త్రి శత జయంతి సంద ర్భంగా ఆయన స్మృతికి నివాళిగా స్మారక తపాల బిళ్లను విడుదల చేయడం ఆనంద దాయకం అన్నా రు. చొరవ తీసుకుని ఆరుద్రకు సముచిత గౌర వాన్ని కల్పించిన పోస్టల్ విభాగానికి అభినందనలు తెలిపారు. మెదడును చైతన్యం చేయడానికి పుస్తకాలు అత్యంత ముఖ్యమైనవని, పిల్లలకు పుస్తక పఠనం అలవాటు చేయాలని సూచించారు. 'ప్రతి పల్లెకూ గ్రంథాలయం, ప్రతి ఇంటికి స్వచ్ఛాలయం (శౌచాలయం) నినాదం కావాలి' అని ఆకాంక్షి ంచారు. భాష ఎంత ముఖ్యమో భావం కూడా అంతే ముఖ్యం. ఈ విషయంలో ఆరుద్ర ఆదర్శప్రాయులు. సాహిత్యాన్ని బతికించడం కోసం ఆరుద్ర తన జీవితాన్నే అంకితం చేశారు. వారికి తోడుగా నిలిచిన వారి శ్రీమతి రామలక్ష్మి ౖ స్మృతికి నివాళులు అర్పిస్తున్నాను. కవయిత్రిగా తెలుగు సాహితీ ప్రపంచంలో రామలక్ష్మి ౖ ముద్ర ప్రస్ఫుటం. కలం పేరును 'రామలక్ష్మి ౖ ఆరుద్ర'గా




ఆరుద్ర స్మారక తపాల బిళ్లను ఆవిష్కరిస్తున్న మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, చిత్రంలో పోస్ట్‌మాస్టర్ జనరల్ వీణాకుమారి, ఆరుద్ర కుమార్తె కవితా చింతామణి

# ఎసిబికి చిక్కిన ఉస్మానియా వర్సిటీ బిల్డింగ్ డివిజన్ డిఇఇ

**హైదరాబాద్ (తార్నాక), డిసెంబరు 16, ప్రభాతవార్త:** ఎసిబి వలలో మరో అవినీతి చేప చిక్కింది. ఉస్మానియా యూనివర్సిటీ బిల్డింగ్ డివిజన్ విభాగంలో డిఇఇగా పనిచేస్తున్న రాకొండ శ్రీనివాస్ ఒ.యూ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కార్యా లయంలో కాంట్రాక్టర్ నుంచి రూ. 6వేలు లంచం తీసుకుంటూ రెడ్‌హ్యాండెడ్‌గా ఏసీబీ అధి కారులకు పట్టుబడ్డా డు. ప్రతిష్టాత్మక ఉస్మానియా యూనివర్సిటీని ఓ వైపు ప్రభుత్వం వేల కోట్లతో అభివృది చేయా లని అన్ని విధాలుగా కృషి చేస్తుండగా కొందరి అధికారులు ఒ.యూకు మచ్చ తెస్తున్నారు. ఉస్మానియా యూని వర్సిటీలోని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కార్యాలయంలో బిల్డింగ్ డివిజన్ డిఈఈ రాకొండ శ్రీనివాస్ ఓ కాంట్రాక్టర్ వద్ద నుండి రూ. 6వేలు లంచం తీ సుకుంటుండగా పట్టుబడిన ఘటన ఒ.యూ లో తీవ్రకలకలం రేపింది. అవినీతి నిరోధక శాఖ హైదరాబాద్ డీఎస్పీ గంగసాని శ్రీధర్ తెలిపిన వివరాల ప్రకారం. ఉస్మానియా యూని వర్సిటీ లోని మానేరు హాస్టల్ భవనం మరమ్మత్తు పనులను రూ. 14 లక్షలతో ఓ కాంట్రాక్టర్ ఇటీవల పనులను పూర్తి చేశాడు. బిల్లు కోసం సదరు కాంట్రాక్టర్ డీపార్ట్‌మెంట్‌కు ఆరీ పెట్టుకున్నాడు. ఇందుకు బిల్లు రావాలంటే తనకు రూ.11వేలు లంచం ఇస్తే బిల్లును క్లియర్ చేస్తానని డీఈఈ రాకొండ శ్రీనివాస్ చెప్పాడు. దీంతో కాంట్రాక్టర్ గత్యంతరం లేక ఈ నెల 12న డీఈఈకి ఫోన్ పే ద్వారా రూ. ఐదు వేలు చెల్లించాడు. మిగతా ఆరువేల కూడా ఇవ్వాలని డీఈఈ రాకొండ శ్రీనివాస్ అప్పటి నుంచి డిమాండ్ చేస్తూ వస్తున్నాడు. దీంతో తప్పని పరిస్థితులలో బాధిత కాంట్రా క్టర్ ఎసిబి అధికారులకు ఫిర్యాదు చేశాడు. దీంతో పక్కా సమాచారంతో మంగళవారం ఏసీబీ అధికారులు వలపన్ని డిఈఈ శ్రీనివాస్‌ను ఒ.యూలోని ఆయన కార్యాలయంలో రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకొని అరెస్టు చేశారు.



నగదుతో ఒయు డిఇఇ శ్రీనివాస్

# కక్ష సాధింపుతో రాహుల్, సోనియాపై ఇడి కేసు నమోదు

## ఉపాధి హామీ మార్పులపై దేశవ్యాప్త ఆందోళన

## ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి

**హైదరాబాద్, డిసెంబరు 16, ప్రభాతవార్త:** రాహుల్, సోనియా గాంధీలపై కక్ష సాధింపు రాజకీయాలే లక్ష్యంగా ఇడి కేసు నమోదు చేసిందని భువనగిరి ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి ఆరోపించారు. న్యూఢిల్లీలో ఆయన విలేఖరులతో మాట్లాడతూ నేషనల్ హెరాల్డ్ కేసులో పోలీస్, ఆర్థిక నేరాల విభాగం దాఖలు చేసిన పిటిషన్‌ను కోర్టు కొట్టి వేసిందని తెలిపారు. ఈ కేసులో ఎలాంటి ఆర్థిక లావాదేవీలు లేవని కోర్టు ధృవీకరించిందని ఆయన చెప్పారు. బలమైన ప్రతిపక్ష నాయకత్వాన్ని నిర్వీర్యం చేయడానికే కేంద్ర సంస్థలను దుర్వినియోగం చేస్తోందంటూ బిజెపి పాలకులపై కిరణ్‌కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉపాధిహామి పథకంకు మహాత్మా గాంధీ పేరు తొలగించి విబిజిరామ్‌జిగా మార్చడం ఆర్ఎస్ఎస్ - బిజెపి సంకుచిత ఆలోచన విదానంకు రుజవంటూ దుయ్యబట్టారు. మహాత్మా గాంధీ పేరును చరిత్ర నుంచి తొలగించాలన్న ఉద్దేశంతోపాటు ఈ పథకాన్ని బలహీనపరిచి గ్రామీణ ఆర్థిక వ్యవస్థను నిర్వీర్యం చేసే ప్రయత్నం చేస్తున్నారంటూ మోదీ ప్రభుత్వంపై చామల ఆగ్రహం వ్యక్తంచేశారు.

కేంద్ర రాష్ట్ర నిధుల వాటా 40:60గా మార్చడంతో రాష్ట్రాలపై భారం పెరిగిందని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రాల్లో నిధులు లేకపోతే పథకం అమలు కష్టమయ్యే పరిస్థితి ఉందన్నారు. 125 రోజులు అంటూనే ఉపాధి హామీని అస్పష్టంగా మార్చారంటూ కేంద్రంపై ఆవేదన వ్యక్తం చేశారు. పథకానికి దేవుడి పేరు పెట్టి ప్రజలను తప్పు దోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారంటూ కేంద్రం తీరును తప్పుపట్టారు. ఈ పథకం పేరుతోపాటు అమలులో తీసుకు వచ్చిన మార్పులకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ఆందోళనలకు కాంగ్రెస్ పార్టీ దిగుతుందని ఎంపీ చామల స్పష్టం చేశారు. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ హయాంలో 2005లో ఉపాధి హామీ పథకం ప్రారంభమైందని గుర్తు చేశారు.

గ్రామీణ పేద ప్రజలకు 100 రోజుల గ్యారెంటీ ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో అప్పటి కేంద్రం 100శాతం కేటాయించాలని నిధులు కేటాయించిందని రెడ్డి గుర్తు అన్నారు.



జీవితం తమ కోసమే కాకపోవడంలో ఒక రకమైన సంతృప్తి, సాఫల్యం దాగి ఉంటాయి. సాధారణంగా తల్లిదండ్రులకు దక్కే అపురూపమైన అనుభూతి అది. చుట్టూ ఉన్న పిల్లల్ని తన వాళ్లగా భావించారామె. వాళ్లకి బంగారు భవిష్యత్తును అందించి జీవిత సాఫల్యాన్ని వెయ్యి రెట్లు పెంచుకున్నారు చావా అరుణ.

# పేద పిల్లల బంగారు భవిష్యత్తు కోసం..



నగరాల్లో చాలామందికి తమ చుట్టూ ఉన్న ఆకాశ నిర్మాణాలు కనిపిస్తాయి. కానీ వాటి నిర్మాణంలో దుమ్ము కొట్టుకుపోతున్న పిల్లల బాల్యాన్ని గమనించారు అరుణ. ఈమె ఉండేది హైదరాబాద్, కెపిహెచ్‌బిలో. వృత్తిరీత్యా న్యాయవాది. 20 ఏళ్ల కిందటి సంగతి.. అరుణ ఇంటి చుట్టూ పెద్ద భవనాలు కట్టేవారు. అక్కడ పనిచేసే కార్మికుల పిల్లల చదువుకోకుండా పనుల్లో తల్లిదండ్రులకు సాయపడేవారు. వాళ్లని చూసి అరుణ మనసు చివుక్కుమంది. ఎలాగైనా వాళ్లకు చదువు చెప్పించాలనుకున్నారు. తన ఆలోచనకు జయలక్ష్మి, అంజలి, దేవయాని, నందిని, వివేక్‌లతోపాటు కొంతమంది మహిళామండలి సభ్యుల మద్దతూ తోడైంది. వారితో కలిసి స్థానికంగా పాఠశాల ఏర్పాటు కోసం ప్రయత్నించారు. రెండు వేల గజాల విస్తీర్ణంలోని స్థానిక పార్కు స్థలం కబ్జాదారుల కోరల్లో చిక్కుకోగా.. పోరాటం చేసి 500 గజాల్ని పాఠశాల ఏర్పాటుకు కేటాయించేలా చేశారు. అప్పట్నుంచి ఏటా బడిబాట కార్యక్రమాన్ని ఓ యజ్ఞంలా చేసేవారు. సమీప జెఎన్‌టియూ విద్యార్థులు వచ్చి పిల్లలకు పాఠాలు బోధించేవారు.

**సరస్వతీ నిలయం ...** సేవా కార్యక్రమాల విస్తరణకు 2011లో 'డ్రీమ్ ఫర్ గుడ్ సొసైటీ'ని స్థాపించారు అరుణ. పిల్లల్ని పాఠశాలలో చేర్పించాలని భవన నిర్మాణ కార్మికుల ఇళ్లకు వెళ్లి ఒప్పించే ప్రయత్నం చేశారు. తల్లిదండ్రుల నుంచి వ్యతిరేకత వచ్చేది. కానీ అరుణ బృందం పట్టువలదలకుండా ప్రయత్నించేది. కొద్దిరోజులకు వారి కృషి ఫలించి కొందరు తమ పిల్లల్ని బడికి పంపించారు. పాఠశాలకైతే వెళ్తున్నారు కానీ. పిల్లలకు భోజనం, బడి నుంచి వచ్చిన తర్వాత చదువులు చెప్పడం ఉండేవి కాదు. దీంతో తన మూడంతస్తుల ఇంటిని ట్యూషన్ సెంటర్‌గా మార్చేశారు. అక్కడ కొంతమంది ఉపాధ్యాయులను నియమించి ఉదయం, సాయంత్రం ట్యూషన్లు మొదలుపెట్టారు. అవసరమైన పిల్లలకు అల్పాహారం, భోజనమ అందించేవారు. చదువుతోపాటు క్రమశిక్షణ, వ్యక్తిగత పరిశుభ్రత, సంస్కృతీ సంప్రదాయాలపైన అవగాహన కలిగిస్తున్నారు. వారి ఆరోగ్యంపైనా దృష్టి పెడతారు.

**కరోనాలోనూ అండగా..** కొవిడ్ విజృంభించినప్పుడు.. స్థానికంగా ఆన్‌లైన్ తరగతులకు దూరమవుతున్న విద్యార్థులను గుర్తించి వాళ్లకు ఆఫ్‌లైన్లో తరగతులు చెప్పేవారు. 10 మంది విద్యార్థులతో తరగతులు ప్రారంభించగా.. ఆ సంఖ్య క్రమంగా 200కు చేరింది. అన్ని జాగ్రత్తలూ తీసుకుంటూనే కొన్ని నెలల పాటు క్లాసులు నిర్వహించారు. పిల్లల చదువు కోసం ఎంత కష్టాన్నైనా ఇష్టంగా భావిస్తారు అరుణ. కాలనీ నుంచి సమీప ప్రభుత్వ హైస్కూల్‌కు వెళ్లే విద్యార్థులకు దాతల సాయంతో ప్రత్యేకంగా బస్సు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం సుమారు 40 మంది విద్యార్థులకు సొసైటీ సాయం అందిస్తోంది. ఇప్పటివరకు ఈ సంస్థ నీడన వెయ్యి మందికి పైగా విద్యార్థులు ఆశ్రయం పొందారు. తద్వారా వేలమంది జీవితాల్లో మార్పు తెచ్చారు. □

# చక్కెర ఆకులు



చక్కెర ఆకులు స్వీటు తింటే కానీ ఆగలేం. కానీ బరువు గురించి, షుగర్ గురించి బెంగ. ఇలాంటి వారికోసం సరికొత్తగా మార్కెట్‌లోకి వచ్చాయి స్టీవియా ఆకులు. స్టీవియా రిబాండియానా అనే మొక్క ఆకులను ఎండబెట్టి, చూర్ణంగానూ అమ్ముతున్నారు. ఇందులో సహజమైన చక్కెరలుగా పిలుచుకునే స్టివియల్ గ్లైకోసైడ్ ఉంటాయట. ఎటువంటి కెలోరీలు ఉండని ఈ ఆకులు.. పంచదార కంటే తియ్యగా ఉంటున్నాయట. వీటిని కాఫీ.టీ వంటి పదార్థాల్లో మోతాదుకు మించకుండా వాడటం చక్కెరకు ప్రత్యామ్నాయం. వినియోగించిన తర్వాత బ్లడ్ షుగర్ స్థాయుల్లో పెద్దగా మార్పులు ఉండవట. అయితే స్వీట్లలో అవసరమయ్యేంత ఎక్కువ మోతాదులో వాడొచ్చా అనేదానిపై పరిశోధనలు జరుగుతున్నాయి. తొలుత ఉత్తర అమెరికాలో ఈ మొక్క ఆకులను వంటల్లోనూ, మందుల్లోనూ ఉపయోగించేవారు. తర్వాత మెల్లగా ఇతర దేశాలకు విస్తరించింది. చక్కెర వల్ల దంతాల ఆరోగ్యం కూడా దెబ్బతింటుంది కదా..కానీ ఈ ఆకులతో ఆ సమస్య ఉండదట. సాధారణంగా వీటిని వాడటం మంచిదే అయినా కొందరిలో అలెర్జీలు వచ్చే అవకాశం ఉంది. అజీర్తి సమస్యలూ తలెత్తవచ్చు. □

# తిరుప్పావై

## 2వ పాశురము



వైయత్తు వాల్వీర్గాళ్! నాముమ్
సమ్ పావైక్కు
షెయ్యుమ్ కిరిశైగళ్ కేళీరో,
పాఱ్కడలుళ్
పైయత్తుయిన్ఱ పరమ పడిసాడి,
నెయ్యుణ్ణోమ్ పాలుణోమ్
నాట్కాలే నీరాడి
మైయిట్టెళుతోమ్ మలరిట్టు
నాముడియోమ్
శెయ్యాదన శయ్యోమ్ తీక్కుఱళై
చ్చెన్లోదోమ్,
ఐయుముమ్ పిచ్చైయు
మాన్దనైనయమ్ కైకాట్టి,
ఉయ్యుమాఱెణ్ణి యుకన్దేలో
రెమ్బావాయ్

ఈ లోకములో ఆనందం అనుభవింపదలచిన గోపికలారా! ఈ వ్రతమునకు చేయవలసిన కార్యక్రమములను వివరంగా వినండి. పాలసముద్రములో నిదురించుచున్న పరాత్పరుని యొక్క పాదముల గురించి మెల్లగా పాడుదాం. తెల్లవారు ఝామముననే స్నానము చేసి, కన్నులను కాటుకతో అలంకరించక పూలను తలలోముడవక, ఇతరులకు, బాధలు కలిగించు. మాటలు అనక జ్ఞానులు తృప్తి పొందువరకు భిక్షను ఇచ్చి జీవించు విధానమును అలవాటు చేసుకొందము. ఇదంతా విని మీరు ఆనందించాలని నా కోరిక అని గోపిక ఇతర గోపికలను ఆహ్వానిస్తున్నది.

ఫలం: "మంచి చెడుల విషయం తెలుసుకొనే జ్ఞానం"

# శీతకాలంలో గ్లిజరిన్ సోయగం !

చలికాలంలో చర్మం పొడిబారడం, పెదాలు, పాదాల పగుళ్లు.. లాంటి సమస్యలు సాధారణం. సులువుగా దొరికే గ్లిజరిన్‌తో ఇంట్లోనే మీకు కావలసిన పరిష్కారాల్ని పొందొచ్చు.

**లిప్‌బామ్:** సొన నిష్పత్తిలో తేనె, గ్లిజరిన్ కలిపి రానరతిపూట పెదాలకు రాయండి. ఇలా కొన్ని రోజులు చేస్తే అవి గులాబీ రంగులోకి మారడంతోపాటు పగలడమూ తగ్గుతుంది.




**ఫుట్ క్రీమ్:** రెండు చెంచాల చొప్పున గ్లిజరిన్, రోజ్‌వాటర్ తీసుకుని దానికి చెంచా నిమ్మరసం కలిపి రోజూ రాత్రిపూట పాదాలకు రాయండి. ఇలా వారంలో మూడు నాలుగు సార్లైనా చేస్తే సరి. పగుళ్లు తగ్గి మడమలు మృదువుగా మారతాయి.

**హ్యాండ్‌క్రీమ్:** రెండు టీ స్పూన్ల గ్లిజరిన్‌కి చెంచా ఆలివ్ ఆయిల్, ఒక విటమిన్ ఈ క్యాప్సూల్ కలిపి చిన్నబాటిల్లో పెట్టండి. దీన్ని రోజూ చేతులు కడుక్కున్న తర్వాత రాసుకోండి. ఎంత కోమలంగా ఉంటాయో!

**హెయిర్ మాస్క్:** ఈ కాలంలో జుట్టు నిర్జీవంగా మారకుండా ఒక టేబుల్ స్పూన్ గ్లిజరిన్, ఒక గుడ్డు తెల్ల సొన, రెండు టేబుల్ స్పూన్ల తేనె కలిపి జుట్టుకు రాయండి. ఆపైన ఓ అరగంట ఉంచి తల స్నానం చేస్తే సరి. జుట్టు మెత్తగా మారుతుంది. □

# ఆర్థికంగానూ అడుగేయండి..



**ఎన్నో ఆశలతో కొత్త జీవితంలోకి అడుగుపెడుతుంది జంట. అన్యోన్య దాంపత్యానికీ..కలిసి ఆనందంగా సాగడానికీ బోలెడు ప్రణాళికలు వేసుకుంటారు. వాటిలో డబ్బుకీ చోటివ్వండి అంటున్నారు నిపుణులు. అప్పుడే మనస్పర్థలకు తావుండదట.**

✦ ఇల్లు నిర్వహణ నువ్వు.. సంపాదన సంగతి నేను.. ఇలా విభజించుకున్నప్పుడే సమస్యలు. ఇద్దరూ ఉద్యోగాలు చేసినా, చేయకపోయినా, పొదుపు, మదుపు, కొనుగోళ్లు వంటి నిర్ణయాలేవైనా ఇద్దరూ కలిసి తీసుకోవాలి. అప్పుడు ప్రతి రూపాయి లెక్క తెలియడమే కాదు. మెరుగైన ప్రణాళికకీ ఆస్కారం ఉంటుంది. ✦ కొత్తలో కలిసి పర్యటనలు, షాపింగ్ వంటివి సహజమే. అలాగని మరీ ఖర్చు చేసుకుంటూ వెళ్లొద్దు. కొనేది ఏదైనా నిజంగా అవసరమేనా అని ప్రశ్నించుకుంటే దూబారాకి చోటుండదు. అలాగే ఒక పుస్తకాన్ని పెట్టుకోండి. ఎవరు ఎంత ఖర్చు పెడుతున్నారన్నది దానిలో రాయాలనే నియమం పెట్టుకోండి. దీని ద్వారా నెలకు ఎంత అవసరం అన్న సంగతే కాదు. అనవసర ఖర్చుల వివరాలూ తెలుస్తాయి. వీలైతే వాటిని తగ్గించుకొని పొదుపుగా మలుచు కోవచ్చు. ✦. ఇద్దరూ సంపాదిస్తోంటే.. ఏ బాధ్యతలూ లేక పోతే ఒకరి జీతాన్ని పూర్తిగా పక్కన పెట్టేయొచ్చు. భవిష్యత్తులో సొంతిల్లు స్థలం వంటివి ప్లాన్ చేసుకున్నా డబ్బుపరంగా ఇబ్బంది ఉండదు. ✦ నగరాల్లో ఉండేవారికి కరెంటు కోతలు పెద్దగా పరిచయం ఉండదు. ఇష్టమొచ్చినట్లుగా లైట్లు, ఫ్యాన్లు వేసి వదిలేస్తుంటారు. మీకూ ఆ అలవాటు ఉంటే తగ్గించుకోండి. ఇంట్లోకి వస్తువులు కొనేప్పుడూ కరెంటు ఆదా చేసేరకాలను ఎంచుకోండి. కరెంటు బిల్లు తగ్గుతుంది. ఇంకా ఇలాంటి వృథాలేం చేస్తున్నారో తెలుసుకున్నా చాలావరకూ ఆదా చేయొచ్చు. □

## జీర్ణక్రియ మెరుగవ్వాలంటే..

ఫంక్షన్లు, పండగల ప్పుడు కాస్త ఎక్కువగా తిన్నాం.. లేదంటే అరగట్లేదు అనిపిస్తుంటుది కదా! చాలా మంది అరగడానికి టానిక్‌లు, ట్యాబ్లెట్ల మీదా ఆధార పడుతుంటారు. ఈసారి ఈ చిట్కా ప్రయత్నించండి. పావు స్పూను చొప్పున ధనియాలు, జీలకర్ర, వాము తీసుకోండి. వీటన్నింటినీ రోట్లో వేసి, చిటికెడు ఉప్పునీ చేర్చి.. కచ్చాపచ్చాగా దంచుకోండి. ఇప్పుడు ఒక గిన్నెలో గ్లాసు నీళ్లు పోసి వేడి చేయండి. ఆపై ఈ మిశ్రమాన్ని వేసి, నీళ్ల సగం అయ్యేవరకూ మరిగించండి. స్టవ్ కట్టేసి, గోరువెచ్చగా అయ్యాక చిటికెడు వంటసోడా, స్పూను నిమ్మరసం చేర్చి తాగితే సరి. జీర్ణప్రక్రియ మెరుగవ్వడమే కాదు, ఉపశమనమూ దొరుకుతుంది. కావాలంటే ప్రయత్నించండి. □

## రంగ వల్లి




18 చుక్కలు, 6 వరుసలు, ఇటు అటు వదిలి 6 వరకు



- శాంతి సర్వా
సరూర్‌నగర్

## ముగ్గులకు ఆహ్వానం



మా చిరునామా: ఎడిటర్, 'చెలి' వార్త, నం.396, లోయర్ ట్యాంక్‌బండ్, డిబిఆర్ మిల్స్ పక్కన, హైదరాబాద్-80. Gmail: cheli@vaartha.com

కృత్రిమ మేధతో రూపొందించిన ముగ్గులు పంపవద్దు

# యువ ప్రొడక్షన్స్ కొత్త చిత్రం లాంచ్



బాబీ సింహా, హెబ్బా పటేల్, మెహర్ యరమతి, యువకృష్ణ, యువ ప్రొడక్షన్స్ కొత్త చిత్రం గ్రాండ్‌గా లాంచ్‌బాబీ సింహా, హెబ్బా పటేల్ హీరో, హీరోయిన్‌గా మెహర్ యరమతి దర్శకత్వంలో ఓ కొత్త చిత్రం రూపొందుతోంది. యువ ప్రొడక్షన్స్ బ్యానర్ పై యువ కృష్ణ నిర్మిస్తున్న ఈ చిత్రం ఈ రోజు పూజా కార్యక్రమాలతో ఘనంగా ప్రారంభమైయింది. ముహూర్తపు సన్నివేశానికి ఎస్కేఎన్ క్లాప్ కొట్టారు. వంశీ నందిపాటి కెమరా స్విచాన్ చేశారు. తనికెళ్ళ భరణి మేకర్స్ కి స్క్రిప్ట్ అందించారు. ఈ వేడుకలో సినిమా యూనిట్ అందరూ పాల్గొన్నారు. ఈ చిత్రంలో తనికెళ్ల భరణి, సూర్య శ్రీనివాస్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. జి కృష్ణ దాస్ డీవోపీగా పని చేస్తున్న ఈ చిత్రానికి సిద్ధార్థ సదాశివుని మ్యూజిక్. వివేక్ అన్నామలై ఆర్ట్ డైరెక్టర్. మూవీ లాంచింగ్ ఈవెంట్‌లో నిర్మాత యువకృష్ణ.. అందరికీ నమస్కారం. డైరెక్టర్ మెహర్ నా స్నేహితుడు. సినిమా కోసం చాలా కథలు విన్నాను. దర్శకుడు మెహర్ మాట్లాడుతూ.. అందరికీ నమస్కారం. ఇది నా దర్శకుడిగా ఇది నా తొలి సినిమా. మీ అందరి సపోర్టు కావాలని కోరుకుంటున్నాను. మా టీమ్ అందరికీ థాంక్యూ.

# 'మిస్టీరియస్' క్లైమాక్స్ గుర్తుండిపోతుంది: డైరెక్టర్ మహి కోమటిరెడ్డి



రోహిత్ హీరోగా అబిద్ భూషణ్ పోలీస్ పాత్రలో నటించిన సినిమా "మిస్టీరియస్". రియా కపూర్ , మేఘనా రాజ్ పుత్ నటీనటులుగా, మహి కోమటిరెడ్డి దర్శకత్వంలో అశ్లీ క్రియేషన్స్ పై జయ్ వల్లందాస్ నిర్మించారు. ఈ సినిమా ఈ నెల 19న వరల్డ్ వైడ్ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది. ఈ సందర్భంగా మూవీ హైలైట్స్ ను ఈ రోజు జరిగిన ఇంటర్వ్యూలో దర్శకుడు మహి కోమటిరెడ్డి పలు కీలక అంశాలను తెలిపారు. ఇంటర్వ్యూలో డైరెక్టర్ మహి కోమటిరెడ్డి మాట్లాడుతూ...

మా "మిస్టీరియస్" సినిమా అన్నీ సినిమాల్లా రెగ్యులర్ ఫార్మెంట్ కాకుండా.. విభిన్నమైన పాయింట్‌తో తెరకెక్కించాం. ఈ సినిమాలో క్రైమ్‌తో పాటు లవ్, క్రష్ ఉంటాయి. వీటితో పాటు సినిమాలో థ్రిల్లింగ్ అంశాలు పుష్కలంగా ఉంటాయి. వీటికి ప్రేక్షకులు తప్పకుండా ఎంటర్‌టైన్ అవుతారు. ఇప్పటి వరకు ఇలాంటి థ్రిల్లింగ్ అంశాలను యే సినిమాలోనూ చూపించలేదు. చివరి వరకు సినిమాలో కిల్లర్ ఎవరు అనేలా.. సస్పెన్స్ గానే సాగుతుంది. ఇక క్లైమాక్స్ ఎపిసోడ్ అయితే ఎవరూ ఊహించని విధమైన ఓ ట్విస్ట్‌తో సస్పెన్స్ ప్లస్ థ్రిల్లింగ్‌గా ఉంటుంది. సినిమా అయిపోయక అందరూ ఆ క్లైమాక్స్ ఎపిసోడ్ గురించి మాట్లాడుకునేలా ఉండబోతుంది. ఇలా మా "మిస్టీరియస్" సినిమాలో క్రైమ్, క్రష్, ప్రేమ, థ్రిల్, సస్పెన్స్, పాటలు, ఫైట్ సీన్స్ అన్నీ కలిపి ఉంటాయి. ప్రేక్షకుడు థియేటర్ వచ్చి వీటి అన్నింటినీ చూసి ఎంటర్‌టైన్ అయి బయటికి వెళ్తాడు. ముఖ్యంగా క్లైమక్స్ ఎపిసోడ్ గుర్తుండిపోయేలా ఉంటుంది.

## తెర

# 'ఉస్తాద్ భగత్ సింగ్' తొలి గీతం 'దేఖ్‌లేంగే సాలా'



24 గంటల్లోనే 29.6 మిలియన్లకు పైగా వీక్షణలతో సంచలనం సృష్టించిన 'దేఖ్‌లేంగే సాలా' 'గబ్బర్ సింగ్' వంటి సంచలన విజయం తరువాత పవర్ స్టార్ పవన్ కళ్యాణ్, దర్శకుడు హరీష్ శంకర్ కలయికలో రూపొందుతోన్న చిత్రం 'ఉస్తాద్ భగత్ సింగ్'. రాక్‌స్టార్ దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రం నుంచి తొలి గీతంగా 'దేఖ్‌లేంగే సాలా' విడుదలై శ్రోతలను ఉర్రుతలూగిస్తోంది. కేవలం 24 గంటల్లోనే 29.6 మిలియన్లకు పైగా వీక్షణలతో రికార్డులను బద్దలు కొట్టి సరికొత్త చరిత్ర సృష్టించింది. సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతూ ప్రపంచ వ్యాప్తంగా ప్రేక్షకులను ఆకర్షించి, తక్షణ హిట్‌గా నిలిచింది. దేవి శ్రీ ప్రసాద్ సమకూర్చిన సంగీతం ఎంతో ఆకర్షణీయంగా ఉండి, సంగీత ప్రియుల ప్రశంసలు అందుకుంటోంది. అలాగే, పవన్ కళ్యాణ్‌కి సరిగ్గా సరిపోయేలా దినేష్ మాస్టర్ సమకూర్చిన నృత్యరీతులు కూడా భారీ ప్రశంసలను అందుకుంటు న్నాయి. ఇక ప్రేరణాత్మకమైన, వాణిజ్యపరమైన అంశాల కలయికలో భాస్కరభట్ల రాసిన సాహిత్యం పాట విజయంలో కీలక పాత్ర పోషించింది.

# 'కాలం' మూవీ ట్రైలర్ లాంచ్

ఇఈ, రాజయోగం వంటి చిత్రాలతో దర్శకుడిగా ప్రతిభ చాటుకున్నారు రామ్ గణపతి. ఆయన హీరోగా నటిస్తున్న సినిమా 'కాలం'. ఈ సినిమాను శ్రీ నవబాల క్రియేషన్స్, 3 కీజ్ ఎంటర్ టైన్ మెంట్స్ బ్యానర్స్ పై మణి లక్ష్మణరావు నిర్మిస్తున్నారు. మిట్టపెల్లి రాజేష్ కో ప్రొడ్యూసర్‌గా వ్యవహరిస్తున్నారు. రామ్ గణపతి ఈ చిత్రానికి స్క్రీన్ ప్లే అందిస్తున్నారు. యంగ్ డైరెక్టర్ వెంకట సురేష్. ఆర్. రూపొందిస్తున్నారు. టైమ్ ట్రావెల్ కాన్సెప్ట్‌తో రూపొందిన 'కాలం' సినిమా త్వరలో ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. ఈ రోజు ఈ సినిమా ట్రైలర్ ను హైదరాబాద్ లో జరిగిన ఈవెంట్ లో రిలీజ్ చేశారు. ఈ కార్యక్రమంలో యంగ్ హీరో సాయి రోనక్, మ్యూజిక్ డైరెక్టర్ ఎంఎం శ్రీలేఖ అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగానిర్మాత మణి లక్ష్మణరావు మాట్లాడుతూ మా 'కాలం' సినిమా ట్రైలర్ మీ అందరికీ నచ్చిందని ఆశిస్తున్నాం. ఈ రోజు మా ఈవెంట్ కు గెస్ట్ లుగా వచ్చిన ఎంఎం శ్రీలేఖ, సాయి రోనక్ గారికి థ్యాంక్స్. ఈ సినిమా టైమ్ ట్రావెల్ నేపథ్యంతో నిర్మించాం. ఉత్తరాఖండ్ నైనిటాల్ లోని అందమైన లొకేషన్స్ లో చిత్రీకరణ జరిపాం. ఆద్యంతం థ్రిల్లింగ్ గా సాగే చిత్రమిది. మీరంతా 'కాలం' సినిమాను ఆదరిస్తారని కోరుకుంటున్నా. అన్నారు.



# 'విష్ణు విన్యాసం' ఫిబ్రవరిలో రిలీజ్





కింగ్ ఆఫ్ ఎంటర్‌టైన్‌మెంట్ శ్రీ విష్ణు యూనిక్ అండ్ ఎక్సయిటింగ్ సబ్జెక్ట్స్ చేస్తూ ప్రతి సినిమాతో ప్రేక్షలకు అద్భుతమైన ఎంటర్‌టైన్‌మెంట్ అందిస్తున్నారు. ప్రస్తుతం కొత్త దర్శకుడు యదునాథ్ మారుతీ రావు దర్శకత్వంలో యూనిక్ ఎంటర్టైనర్ చేస్తున్నారు. ఈ చిత్రాన్ని శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర సినిమాస్ బ్యానర్‌పై ప్రొడక్షన్ నంబర్ 3గా సుమంత్ నాయుడు జి నిర్మిస్తారు. హేమ షాలిని ఈ చిత్రాన్ని సమర్పిస్తారు, సాయి కృష్ణ బొబ్బా, రామాచారి ఎం సహ నిర్మాతలు. ఈ రోజు సినిమా టీం ఒక యానిమేషన్ వీడియో ద్వారా సినిమా టైటిల్‌ను అనౌన్స్ చేశారు. స్టైలిష్ యానిమేటెడ్ వీడియో ద్వారా టైటిల్‌ను రివిల్ చేశారు. ఈ వీడియో సినిమా నేపథ్యాన్ని కూడా ఆసక్తికరంగా పరిచయం చేస్తుంది. అర్బన్ సెటప్‌లో సాగే ఈ గ్లింప్స్‌లో, కస్టమ్ యెల్లో మోటార్‌సైకిల్‌పై నగర వీధుల్లో దూసుకెళ్తున్న శ్రీ విష్ణు మొదటి ఫ్రేమ్ నుంచే అలరించారు. ఈ సినిమాకు 'విష్ణు విన్యాసం' అనే ఆసక్తికరమైన టైటిల్‌ను ఖరారు చేశారు. ఇది శ్రీ విష్ణు ఎసెంట్రిక్ స్క్రీన్ పర్సోనాకు అద్దం పట్టేలా ఉంది. ఆయన ట్రేడ్‌మార్క్ హ్యూమర్‌ను హైలైట్ చేస్తూ, టైటిల్ రివీల్‌కు No Brakes Just Laughs అనే క్యాచీ ట్యాగ్‌లైన్ మరింత అలరించింది.

# 'ఓజి' మసక మసక సాంగ్ అలరిస్తుంది

నా లైఫ్‌లో 2026 మొత్తం మ్యూజిక్కే ఉంటుంది. దేశ, విదేశాల్లో లైవ్ షోస్ చేయబోతున్నాం: సాంగ్ లాంచ్ ఈవెంట్ లో పాప్ సింగర్ స్మిత క్వీన్ అఫ్ పాప్ సింగర్ స్మిత ఓజి మసక మసక సాంగ్ గ్రాండ్‌గా లాంచ్ అయ్యింది. స్మిత, నోయల్ నటించిన ఈ సాంగ్ ని విజయ్ బిన్నీ అద్భుతంగా డైరెక్ట్ చేశారు. జార్జ్. సి. విలియమ్స్ అదిరిపోయే విజువల్స్ అందించారు. నాగేంద్ర తంగాల ఆర్ట్ డైరెక్టర్ గా చేసిన ఈ పాటకి అడెలె ఎడిటర్. ఈ సాంగ్ లాంచ్ ఈవెంట్‌లో దర్శకుడు దేవాకట్టా పాల్గొన్నారు. సాంగ్ లాంచ్ ఈవెంట్ లో పాప్ సింగర్ స్మిత మాట్లాడుతూ.. అందరికీ నమస్కారం. నాన్న ఒక థాట్ ని మొదలుపెట్టారు. అమ్మ నన్ను ఎంతగానో ప్రోత్సహించి తన ఫస్ట్ ఇన్వెస్ట్మెంట్ ని నా మీద పెట్టింది. హాయ్ రబ్బా ఆల్బమ్ అమ్మ ఇన్వెస్ట్మెంట్ తోనే వచ్చింది. దేశవ్యాప్తంగా పాపులర్ అయింది. ఆ తర్వాత అంతా హిస్టరీ. అదే ఇంటి పేరుగా మారింది. ఇప్పుడు ఇంటిపేరు మార్చుకుని 'ఓజి' చేద్దామని అనుకున్నాం. 2026లో నా లైఫ్ లో కేవలం మ్యూజిక్ మాత్రమే ఉండబోతుంది. మీ అందరూ కూడా అందులో భాగం కావాలని కోరుకుంటున్నాను. ఈ సాంగ్ ని నాగార్జున గారు బిగ్ బాస్ స్టేజ్ మీద లాంచ్ చేశారు. ఆయన కూడా నా జర్నీలో అన్ని రకాలుగా భాగమై ఉన్నారు. ఆయన ప్రోత్సాహం ఎంతో బలాన్ని ఇస్తుంది. నార్త్ ఇండిపెండెంట్ మ్యూజిక్ చాలా పాపులర్ అవుతుంది.



ఆట

# కోట్లు కురిపించిన మినీ వేలం

## కామెరూన్ ఆల్ టైమ్ రికార్డ్

## రూ.25.20 కోట్లకుకొన్న కోల్‌కతా



**న్యూఢిల్లీ:** 2026 సీజన్‌కు సంబంధించిన ఐపీఎల్ మినీ వేలంలో గత రికార్డులన్నీ బద్దలయ్యాయి. మొదట్నుంచి అనుకున్నట్లుగానే ఆస్ట్రేలియా ఆల్ రౌండర్ కామెరూన్ గ్రీన్‌కు భారీ డిమాండ్ ఏర్పడింది. అతడిని కోల్‌కతా నైట్‌రైడర్స్ జట్టు రూ.25.20 కోట్ల భారీ ధరకు దక్కించుకుంది. దీంతో ఐపీఎల్ మినీ వేలం చరిత్రలో అత్యధిక ధర పలికిన ఆటగాడిగా గ్రీన్ ఆల్ టైమ్ రికార్డ్ కొట్టాడు. అయితే ఈ వేలంలో యువక్రికెటర్లు కోట్లు కొల్లగొడుతుంటే, గత సీజన్లలో దంచేసిన ఆటగాళ్లకు మాత్రం చుక్కెదురైంది. కనీస ధరకు కూడా వీళ్లను కొనేందుకు ఏ ఫ్రాంచైజీ ఆసక్తి చూపించలేదు. గతంలో మ్యాచ్ విజేతలుగా పేరొందిన రచిన్ రవీంద్ర, బెయిర్‌స్టో, విజయ్ శంకర్, డెవాన్ కాన్వే, బెయిర్‌స్టో, లివింగ్‌స్టోన్ వంటి హిట్టర్లను కనీస ధరకు కూడా ఎవరూ కొనలేదు. ఇటీవల సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో అర్ధ శతకాలతో రెచ్చిపోయిన పృథ్వీ షా, సర్ఫరాజ్ ఖాన్‌లను సైతం ఫ్రాంచైజీలు పట్టించుకోలేదు. తెలుగు కుర్రాడు శ్రీకర్ భరత్ ను సైతం వదిలేశారు. వీరిలో పాటు న్యూజిలాండ్, ఆస్ట్రేలియా ప్లేయర్లకు కూడా వేలంలో బిగ్ షాక్ తగిలింది. జమ్ముకశ్మీర్ పేసర్ అకీబ్ దార్ రూ.8.40 కోట్లు పలకగా, ఉత్తరప్రదేశ్ కుర్రాడు ప్రశాంత్ వీర్ ఏకంగా రూ.14.20 కోట్లు కొల్లగొట్టాడు. మరో యంగ్‌స్టర్ కార్తిక్ శర్మను సైతం రూ.14.20 కోట్లకు చెన్నై సూపర్ కింగ్స్ దక్కించుకుంది. శ్రీలంక ఫాస్ట్ బౌలర్ మతీషా పతిరానా కోసం ఢిల్లీ, లక్నో జట్లు పోటీపడ్డాయి. చివరకు కోల్‌కతా రూ.18కోట్లకు వేలంలో దక్కించుకుంది.

## షూటింగ్ ఛాంపియన్‌షిప్‌లో..

# మను, సిమ్రాన్‌కు స్వర్ణాలు



**న్యూఢిల్లీ:** డాక్టర్ కర్ణి సింగ్ షూటింగ్ రేంజ్‌లో జరిగిన 68వ జాతీయ షూటింగ్ ఛాంపియన్‌షిప్ పోటీల లో వరుసగా సీనియర్, జూనియర్ మహిళల 25 మీటర్ల స్పోర్ట్స్ పిస్టల్ ఈవెంట్‌లలో డబుల్ ఒలింపిక్ పతక విజేత మను భాకర్, ఐఎస్ఎస్ఎఫ్ ప్రపంచ కప్ ఫైనల్ 2025 బంగారు పతక విజేత సిమ్రాన్‌ప్రీత్ కౌర్ బ్రార్ అత్యుత్తమ ప్రదర్శనలు ఇచ్చి బంగారు పతకాలు గెలుచుకున్నారు. ఫైనల్లో మను 36 పాయింట్లు సాధించి స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకుంది. కర్ణాటకకు చెందిన దివ్య టిఎస్ 32 పాయింట్లతో రజతం గెలుచుకుంది. 28 టార్గెట్లను చేధించిన తర్వాత అంజలి చౌదరి కాంస్య పతకాన్ని గెలుచుకుంది. ఇక జూనియర్ మహిళల 25 మీటర్ల స్పోర్ట్స్ పిస్టల్ ఫైనల్లో సిమ్రాన్‌ప్రీత్ కౌర్ బ్రార్ తన అద్భుతమైన ప్రదర్శనతో 39 పాయింట్లు సాధించి బంగారు పతకాన్ని గెలుచుకుంది. ద్వారం ప్రణవి రజతం గెలుచుకోగా, హర్యానాకు చెందిన పాలక్ 20 పాయింట్లతో కాంస్యం గెలుచుకుంది. షూట్‌ఆఫ్‌లో ఓడిపోయిన తర్వాత తను శ్రీ తోమర్ (19) నాల్గవ స్థానంలో నిలిచాడు. ఆ తర్వాత సెజల్ రాజు కాంబ్లే (14), మేగానా సాదులా (11), లావణ్య కన్వర్ (7) ఉన్నారు. ఫైనల్‌లో పరిష రాణించలేదు. మహిళల టీమ్ 25 మీటర్ల స్పోర్ట్స్ పిస్టల్ ఈవెంట్‌లో, మహారాష్ట్ర జట్టు శీతల్ ప్రీతమ్ దేశాయ్ (577-12+), అభిద్న్యా అశోక్ పాటిల్ (575-13+), రాహి సర్నోబత్ (574 -15+) కలిసి 1726-40+స్కోరుతో బంగారు పతకాన్ని గెలుచుకుంది.

# టీమిండియాలో వైస్ పోరు!

## శుభ్‌మన్ సీటుకే ఎసరు

## పోటీ పడుతున్న ప్లేయర్లు



**న్యూఢిల్లీ:** టీమిండియాలో వైఎస్ కెప్టెన్ కోసం ప్లేయర్ల మధ్య పోరు జరుగుతోంది. టీమిండియా యువ స్టార్, టీ20 వైస్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్ కెరీర్ ప్రస్తుతం గడ్డు కాలాన్ని ఎదుర్కొంటోంది. ఒకవైపు టీమ్ ఇండియా దక్షిణాఫ్రికాపై విజయాలు సాధిస్తున్నప్పటికీ, గిల్ వ్యక్తిగత ప్రదర్శన మాత్రం అత్యంత పేలవంగా ఉండటంతో సాటి ప్లేయర్లే తెరవెనుక రాజకీయం చేస్తున్నారు. దీంతో 2025 సంవత్సరం గిల్ పాలిట ఒక పీడకలలా మారింది. కేవలం జైస్వాల్ మాత్రమే కాదు, అభిషేక్ శర్మ, సంజు శాంసన్ కూడా ఓపెనింగ్ స్లాట్ కోసం పోటీ పడుతున్నారు. సంజు శాంసన్ కూడా స్మాట్‌లో అద్భుతంగా రాణిస్తున్నాడు. దీంతో 2026 టీ20 వరల్డ్ కప్ నాటికి గిల్ తన ఫామ్‌ను నిరూపించుకోకపోతే, వైస్ కెప్టెన్సీ మాట దేవుడెరుగు జట్టులో స్థానమే గల్లంతయ్యే ప్రమాదం ఉంది. ఈ ఏడాది గిల్ గణాంకాలు చూస్తే ఎవరైనా ఆశ్చర్యపోవాల్సిందే. ఒక ఓపెనర్‌గా, అందులోనూ వైస్ కెప్టెన్‌గా ఉన్న గిల్ ప్రదర్శన ఏమాత్రం ఆశాజనకంగా లేదు. ఈ ఏడాది ఇప్పటివరకు ఆడిన దాదాపు 15 టీ20 మ్యాచ్‌లలో గిల్ ఒక్క హాఫ్ సెంచరీ (50) కూడా నమోదు చేయలేకపోయాడు. అంతేకాకుండా ఈ ఏడాది అతని బ్యాటింగ్ సగటు కేవలం 24.25 మాత్రమే. ఇక స్ట్రైక్ రేట్ చూస్తే టీ20 ఫార్మాట్‌కు అవసరమైన వేగం గిల్ బ్యాటింగ్‌లో లోపించింది. దీంతో కెరీర్ రికార్డు పెద్ద ఆశాజనకంగా లేదు. ఇప్పటివరకు 35కి పైగా టీ20 మ్యాచ్‌లు ఆడినా, అతని కెరీర్ సగటు ఇంకా 30 లోపే (సుమారు 28.03) ఉండటం గమనార్హం. వీటన్నింటి దృష్ట్యా గిల్ స్థానానికి ఎసరు పెట్టేందుకు కొందరు పావులు కదుపుతున్నారు. గిల్ విఫలమవుతున్న వేళ, దేశవాళీ క్రికెట్‌లో పరుగుల వరద పారిస్తున్న మరో యువ ఓపెనర్, డేంజర్ బ్యాటర్ యశస్వి జైస్వాల్ రూపంలో గిల్‌కు పెద్ద ముప్పు పొంచి ఉంది. సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ లో ముంబై తరపున ఆడుతున్న జైస్వాల్, హర్యానాపై అద్భుతమైన సెంచరీ (101 పరుగులు) బాది సెలెక్టర్లకు గట్టి సంకేతాలు పంపాడు. జైస్వాల్ వంటి విధ్వంసకర ఆటగాడు ఫామ్‌లో ఉండగా, నిలకడ లేని గిల్‌ను వైస్ కెప్టెన్ హోదాలో ఎన్నాళ్లు కొనసాగిస్తారనేది ఇప్పుడు ప్రశ్నార్థకంగా మారింది. అలాగే వైస్ కెప్టెన్ లైన్లో సంజు, అభిషేక్ కూడా పోటీ పడుతున్నారు. కేవలం జైస్వాల్ మాత్రమే కాదు, అభిషేక్ శర్మ, సంజు శాంసన్ కూడా ఓపెనింగ్ స్లాట్ కోసం పోటీ పడుతున్నారు. సంజు శాంసన్ కూడా స్మాట్‌లో అద్భుతంగా రాణిస్తున్నాడు. గిల్ తన బ్యాటింగ్ శైలిని మార్చుకోకపోతే, డగౌట్‌లో కూర్చోక తప్పదనే భావన వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో రాబోయే మ్యాచ్‌లే గిల్ భవిష్యత్తును నిర్ణయించనున్నాయి.

## భారత్ 315 రన్స్‌తో

# భారీ విజయం

## 93 పరుగులకే కుప్పకూలిన మలేసియా

**న్యూఢిల్లీ:** అండర్19 ఆసియా కప్ 2025లో భారత్ 315 పరుగుల తేడాతో మలేషియాను చిత్తుగా ఓడించింది. దుబాయ్ వేదికగా మంగళవారం టాస్ గెలిచి భారత్‌ను బ్యాటింగ్‌కు ఆహ్వానించిన మలేషియా జట్టు భారీ మూల్యం చెల్లించుకుంది. ఆరంభం నుంచి హిట్టింగ్ ప్రారంభించిన టీమిండియా పవర్ ప్లేలో బౌండరీల మోత మోగించింది. అదే సమయంలో వికెట్లు కూడా చేజార్చుకుంది. కెప్టెన్ ఆయుష్ మాత్రే, ఫస్ట్ డౌన్ బ్యాటర్లు విహాన్ మల్హోత్రా త్వరగా వికెట్లు కోల్పోగా, వైభవ్ సూర్యవంశీ 50 పరుగులు చేసి అవుటయ్యాడు. వేదాంత్ త్రివేది కూడా నిలకడగా



ఆడి సెంచరీ మిస్ చేసుకున్నాడు. అయితే మిడిలార్డర్‌లో బ్యాటింగ్‌కి వచ్చిన టీమిండియా వికెట్ కీపర్ అభిగ్యాన్ కుందు మలేషియా బౌలర్లకు చుక్కలు చూపెట్టాడు. 125 బంతులు ఆడిన అభిగ్యాన్ 17 ఫోర్లు, 9 సిక్సర్లతో 209 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. వేదాంత్, అభిగ్యాన్ నాలుగో వికెట్‌కు ఏకంగా 209 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పారు. ఆఖర్లో కనిష్క్ చౌహాన్ అభిగ్యాన్ 36 బంతుల్లో 87 పరుగులు బాదడంతో టీమిండియా నిర్ణీత 50 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 408 పరుగులు చేసింది. మలేషియా బౌలర్ మొహమ్మద్ అక్రమ్ ఐదు వికెట్లు తీసుకున్నాడు. ఇక లక్ష్య ఛేదనలో మలేషియా 93 పరుగులకే కుప్పకూలింది. ఆ జట్టులో హంజా పంగి (35) టాప్ స్కోరర్ కాగా, డియాజ్ పాత్రో (13), ముహద్ అఫినిద్ (12) పరుగులు చేశారు. అజీజ్ వాజ్ది, మహ్మద్ హైరిల్, మహమ్మద్ అక్రమ్ డకౌట్ అయ్యారు. ముహమ్మద్ అలీఫ్ (1), మహమ్మద్ ఫతుల్ ముయిన్ (6), ఎన్ సత్నకుమారన్ (5) ఇలా వచ్చి అలా పెవిలియన్‌కు చేరారు. భారత్ బౌలర్లలో దీపేశ్ దేవేంద్రన్ (5/22) మలేషియా పతనాన్ని శాసించాడు. ఉదవ్ మోహన్ 2, కిషన్ కుమార్ సింగ్, ఖిలాన్ పటేల్, కాన్షిక్ చౌహాన్ ఒక్కో వికెట్ పడగొట్టారు.

## నేటి సౌతాఫ్రికా సిరీస్:

# టీమిండియాకు షాక్

## అక్షర్ స్థానంలో షాబాజ్ అహ్మద్





**న్యూఢిల్లీ:** ధర్మశాల వేదికగా దక్షిణాఫ్రికా జరిగిన మూడో టీ20 మ్యాచ్‌లో విజయం సాధించి జోష్‌లో ఉన్న భారత జట్టుకు షాక్ తగిలింది. స్టార్ ఆల్‌రౌండర్ అక్షర్ పటేల్ దక్షిణాఫ్రికాతో ఈ నెల 17 నుండి జరగనున్న చివరి రెండు టీ20 మ్యాచ్‌లకు దూరం అయ్యాడు. ఈ విషయాన్ని బీసీసీఐ వెల్లడించింది. అతడు అనారోగ్యంతో బాధపడుతున్నట్లు తెలిపింది. అతడి స్థానంలో లెఫ్టార్మ్ స్పిన్ ఆల్‌రౌండర్ షాబాజ్ అహ్మద్ ను ఎంపిక చేసింది. బెంగాల్‌కు చెందిన 31 ఏళ్ల షాబాజ్ అహ్మద్ టీమిండియా తరఫున ఇప్పటి వరకు 3 వన్డేలు, 2 టీ20లు ఆడాడు. మొత్తం 5 వికెట్లు పడగొట్టాడు. ఇక ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో ప్రస్తుతం భారత్ 2-1తో ఆధిక్యంలో ఉంది. ఈ నెల 17న లక్నో వేదికగా భారత్, దక్షిణాఫ్రికా జట్ల మధ్య నాలుగో టీ20 మ్యాచ్ జరగనుంది. ఈ మ్యాచ్‌లోనూ విజయం సాధించి సిరీస్‌ను మరో మ్యాచ్ ఉండగానే గెలుచుకోవాలని భారత్ భావిస్తోంది. మరోవైపు ఈ మ్యాచ్‌లో ఎలాగైనా గెలిచి సిరీస్‌ను సమం చేయాలని సౌతాఫ్రికా పట్టుదలగా ఉంది. చివరి రెండు టీ20ల కోసం నవీకరించిన టీమిండియాలో సూర్యకుమార్ యాదవ్ (కెప్టెన్), శుభ్‌మన్ గిల్ (వైస్ కెప్టెన్), అభిషేక్ శర్మ, తిలక్ వర్మ, హార్దిక్ పాండ్యా, శివమ్ దూబే, జితేష్ శర్మ (వికెట్ కీపర్), సంజు శాంసన్ (వికెట్ కీపర్), జస్‌ప్రీత్ బుమ్రా, వరుణ్ చక్రవర్తి, అర్ష్‌దీప్ సింగ్, కుల్దీప్ యాదవ్, హర్షిత్ రాణా, వాషింగ్టన్ సుందర్, షాబాజ్ అహ్మద్ ఉన్నారు.

# ఆల్‌టైమ్ కనిష్టానికి రూపాయి




## డాలర్ వర్సెస్ భారత్ రూపీ 91.14

**న్యూఢిల్లీ, డిసెంబరు 16:** డాలరుతోరూపాయి చెలామణీ మరింతగా క్షీణించింది. విదేశీ కరెన్సీ మార్పిడి కౌంటర్లలో భారత్‌రూపాయి ముందురోజు 90.78 వద్ద చెలామణి అయితే మంగళవారం మరికొంత క్షీణించింది. 90.98రూపాయలవద్ద చెలామణి కొనసాగింది. ఉదయం 12 గంటలప్రాంతంలో 36 పైసలు క్షీణించి రూ.91.14వద్ద ఆల్‌టైమ్ కనిష్టానికి పడిపోయింది. పది ట్రేడింగ్ సెషన్లలో రూపాయివిలువ 90 నుంచి 91కి క్షీణించడం పతనాన్ని మరింతగా సూచిస్తోంది. భారత్ అమెరికా వాణిజ్య ఒప్పందం జాప్యం కావడంతో ఇన్వెస్టర్లు సెంటిమెంట్ దెబ్బతిన్నట్లు కనిపిస్తోంది. ఈ ప్రభావంతో మార్కెట్లనుంచి డాలర్‌పెట్టుబడులు కూడా ఎక్కువ విత్‌డ్రా అవుతున్నాయి. ఫలితంగా డాలర్ రోజురోజుకూ పటిష్టం అయి రూపాయి క్షీణతకు కారణం అవుతోంది. మార్కెట్ల ఒడిదొడుకులుకూడా ఇందుకు కారణం అవుతున్నట్లు అంచనా. ట్రేడింగ్‌ముగిసే సమయానికి 35 పైసలు క్షీణించిందని కరెన్సీ నిపుణులు చెపుతున్నారు. 2025లో ఇప్పటివరకూ రూపాయి 6.3శాతం క్షీణించింది. ఒక్క డిసెంబరులోనే భారత్ కరెన్సీ 1.72శాతం క్షీణించింది. ఈనెల 3వ తేదీ కూడా రూపాయి 90 దిగువకు పడిపోయిన సంగతి తెలిసిందే. దీనికితోడు కరెంటుఖాతా లోటుకూడా కనిపిస్తోంది. దేశ వాణిజ్యలోటు కూడా ఐదునెలల కనిష్టానికి అంటే 24.53 బిలియన్ డాలర్లకు చేరింది. కొంతలో కొంత ఎగుమతులు పెరగడంతో వాణిజ్యలోటు కొంత ఊరటనిచ్చిందని అంచనా. అయితే ఈక్విటీ మార్కెట్లలో ఇన్వెస్టర్లు మాత్రం 1.61 లక్షలకోట్లు ఇప్పటివరకూ విత్‌డ్రాచేసారు. అంటే పెట్టుబడులు ఉపసంహరించుకున్నారు. ఒక్క డిసెంబరులోనే ఇప్పటివరకూ రూ.17,821కోట్లు విత్‌డ్రా అయ్యాయి. ప్రధాన ఆర్థిక సలహాదారు వి.అనంత నాగేశ్వరన్ గత వారం మాట్లాడుతూ వచ్చే ఏడాది మార్చినాటికి భారత్ అమెరికా వాణిజ్య ఒప్పందం ఖరారు కావచ్చని అంచనావేస్తూ చేసిన వ్యాఖ్యలు రూపాయిక్షీణతను కొంత కట్టడిచేసాయి.

# నష్టాల్లోనే ముగిసిన సెన్సెక్స్, నిఫ్టీ



## ఇండో యుఎస్ ట్రేడ్ డీల్ డిలే ఎఫెక్ట్!

## ఆల్‌టైమ్ కనిష్టానికి రూపాయి మూలం

**ముంబయి, డిసెంబరు 16:** దేశీయ స్టాక్ మార్కెట్లు మంగళవారం భారీ నష్టాలతో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి బలహీన సంకేతాలు, దేశీయంగా మెటల్, రియల్టీ, ఫైనాన్షియల్ రంగాల షేర్లలో వెల్లువెత్తిన అమ్మకాల ఒత్తిడి సూచీలపై తీవ్ర ప్రభావం చూపింది. ట్రేడింగ్ ముగిసే సమయానికి సెన్సెక్స్ 533.50 పాయింట్లు నష్టపోయి 84,679.86 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 167.20 పాయింట్లు క్షీణించి 25,860.10 వద్ద ముగిసింది. సెన్సెక్స్ షేర్లలో యాక్సిస్ బ్యాంక్, ఎటర్నల్ అత్యధికంగా 5 శాతం వరకు పతనమయ్యాయి. హెచ్‌సిఎల్ టెక్నాలజీస్, టాటా స్టీల్, బజాజ్ ఫిన్‌సర్వ్, అల్ట్రాటెక్ సిమెంట్, బజాజ్ ఫైనాన్స్, ఎన్టీపీసీ వంటి హెవీవెయిట్ షేర్లు కూడా ఒక శాతానికి పైగా నష్టపోయాయి. మరోవైపు, టైటాన్, భారతీ ఎయిర్‌టెల్ షేర్లు మాత్రం ఒక శాతానికి పైగా లాభపడి మార్కెట్‌కు కొంత మద్దతునిచ్చాయి. ఎంఎం, ఏషియన్ పెయింట్స్, ట్రెంట్ షేర్లు కూడా స్వల్ప లాభాలతో గ్రీన్‌లో ముగిశాయి. విస్తృత మార్కెట్లోనూ ఇదే ధోరణి కనిపించింది. నిఫ్టీ మిడ్‌క్యాప్ 100 సూచీ 0.83 శాతం, స్మాల్‌క్యాప్ 100 సూచీ 0.92 శాతం నష్టపోయాయి. రంగాల వారీగా రియల్టీ, ప్రైవేట్ బ్యాంక్, పిఎస్‌యూ బ్యాంక్, ఐటీ సూచీలు నష్టాల్లో ముగియగా, కన్స్యూమర్ డ్యూరబుల్స్, మీడియా రంగాల షేర్లు మాత్రమే లాభపడ్డాయి. మరోవైపు, డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ మరింత క్షీణించి 91.14 వద్ద చారిత్రక కనిష్ఠ స్థాయికి చేరింది. మార్కెట్ నిపుణుల ప్రకారం, నిఫ్టీ 25,870 కీలక సపోర్ట్ స్థాయిని కోల్పోవడం వల్ల ప్రతికూల సెంటిమెంట్ పెరిగింది. స్వల్పకాలంలో నిఫ్టీ 25,700 స్థాయికి దిగివచ్చే అవకాశం ఉందని, ఎగువన 25,95026,000 జోన్ కీలక నిరోధకంగా పనిచేయవచ్చన్న అంచనాలున్నాయి. బిఎస్ఇలో మొత్తం 1654 షేర్లు పెరిగితే 2523 షేర్లు క్షీణించాయి. 170 కంపెనీల షేర్లు మాత్రం యధాతథంగా కొనసాగాయి. బిఎస్ఇ స్మాల్‌క్యాప్‌సూచీ 0.69శాతం క్షీణిస్తే మిడ్‌క్యాప్‌సూచీ 0.78శాతం పడిపోయింది.

## ఛాట్‌జిపిటిలో కొత్త ఫీచర్

# 'అడల్ట్ మోడ్'



**శాన్‌ఫ్రాన్సిస్కో, డిసెంబరు 16: :** ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగంలో సంచలనాలు సృష్టిస్తున్న ఓపెన్‌ఎఐ, తన ఛాట్‌జిపిటిలో మరో కొత్త ఫీచర్‌ను తీసుకురాబోతోంది. ప్రత్యేకించి వయోజనులను లక్ష్యంగా చేసుకుని 'అడల్ట్ మోడ్'ను ప్రవేశపెట్టనున్నట్లు ప్రకటించింది. ఈ కొత్త ఫీచర్ 2026 మొదటి త్రైమాసికంలో అందుబాటులోకి వస్తుందని కంపెనీ వర్గాలు వెల్లడించాయి.

ఓపెన్‌ఎఐ అప్లికేషన్స్ సిఇఒ ఫిడ్జీ సిమో, కొత్త జిపిటి5.2 మోడల్‌పై జరిగిన సమావేశంలో ఈ విషయాన్ని ప్రకటించారు. 'అడల్ట్ మోడ్' అనేది వయసు ధ్రువీకరించబడిన వయోజనులకు మాత్రమే అందుబాటులో ఉంటుందని ఆమె స్పష్టంచేశారు. మైనర్లు దీనిని వినియోగించకుండా కఠినమైన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఇందు కోసం ఎంపిక చేసిన కొన్ని దేశాల్లో ఇప్పటికే వయసు నిర్ధారణ ప్రక్రియను పరీక్షిస్తున్నట్లు వివరించారు. ఈ ఫీచర్ వినియోగదారు లందరికీ డిఫాల్ట్‌గా ఆఫ్ చేయబడి ఉంటుంది. అవసరమైన వారు ప్రత్యేకంగా అభ్యర్థించి, వయసు ధ్రువీకరణ ప్రక్రియను పూర్తి చేస్తేనే అడల్ట్ మోడ్ కంటెంట్‌ను యాక్సెస్ చేయగలరు. ఈ మోడ్‌కు కొన్ని పరిమితులు ఉంటాయని సంస్థ తెలిపింది. ఓపెన్‌ఎఐ సిఇఒ శామ్ ఆల్ట్‌మన్ సైతం తన ఎక్స్ ఖాతా ద్వారా ఈ అప్‌డేట్‌పై స్పందించారు. సున్నితమైన కంటెంట్ విషయంలో బాధ్యతాయుతంగా వ్యవహరించేందుకే ఈ పటిష్ఠమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలుస్తోంది.

# 600 బిలియన్ డాలర్లతో మస్క్ టాప్ బిలియనీర్



**న్యూయార్కు, డిసెంబరు 6:** టెక్ దిగ్గజం, ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ చరిత్ర సృష్టించారు. 600 బిలియన్ డాలర్ల నికర సంపదను సాధించిన తొలి వ్యక్తిగా ఆయన రికార్డు సృష్టించారు. ఫోర్బ్స్ వెల్లడించిన వివరాల ప్రకారం స్పేస్ టెక్నాలజీ సంస్థ స్పేస్‌ఎక్స్ త్వరలో పబ్లిక్ ఇష్యూకి రానుందన్న వార్తలే ఈ భారీ పెరుగుదలకు కారణంగా నిలిచాయి. స్పేస్‌ఎక్స్‌ను సుమారు 800 బిలియన్ డాలర్ల వాల్యుయేషన్‌తో పబ్లిక్ లిస్టింగ్ చేసేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. స్పేస్‌ఎక్స్‌లో మస్క్‌కు దాదాపు 42 శాతం వాటా ఉంది. ఈ వాల్యుయేషన్ ప్రకారం ఒక్క స్పేస్‌ఎక్స్ నుంచే ఆయన సంపదకు 168 బిలియన్ డాలర్లు అదనంగా చేరతాయి. దీంతో సోమవారం నాటికి ఆయన మొత్తం సంపద 677 బిలియన్ డాలర్లకు చేరినట్లు ఫోర్బ్స్ అంచనా వేసింది. గత అక్టోబర్‌లోనే మస్క్ 500 బిలియన్ డాలర్ల మార్క్‌ను దాటిన విషయం తెలిసిందే. మస్క్ సంపద పెరగడానికి టెస్లా, ఎక్స్‌ఎఐ కంపెనీలు కూడా దోహదం చేస్తున్నాయి. టెస్లాలో ఆయనకు 12 శాతం వాటా ఉండగా, ఈ ఏడాది ఆ కంపెనీ షేర్లు 13 శాతం పెరిగాయి. డ్రైవర్ సీటులో సేఫ్టీ మానిటర్ లేకుండా రోబోట్యాక్సీలను పరీక్షిస్తున్నామని మస్క్ ప్రకటించడంతో సోమవారం టెస్లా స్టాక్ దాదాపు 4 శాతం లాభపడింది. మరోవైపు మస్క్‌కు చెందిన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సంస్థ ఎక్స్‌ఎఐ కూడా 230 బిలియన్ డాలర్ల వాల్యుయేషన్‌తో 15 బిలియన్ డాలర్ల నిధుల సమీకరణకు చర్చలు జరుపుతోంది. ఈ పరిణామాలపై వ్యాఖ్యానించేందుకు మస్క్, టెస్లా, స్పేస్‌ఎక్స్, ఎక్స్‌ఎఐ సంస్థలు వెంటనే స్పందించలేదని రాయిటర్స్ తెలిపింది.




## ఎటిఎం, యుపిఐలతో

# పిఎఫ్ విత్‌డ్రా

**న్యూఢిల్లీ,డిసెంబరు 16:** వచ్చే ఏడాది మార్చిలోగా ఎటిఎం, యూపిఐ ద్వారా పిఎఫ్ ఉపసంహరణ సదుపాయాన్ని అందుబాటులోకి తెస్తామని కేంద్ర కార్మిక శాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయ వెల్లడించారు. ఇపిఎఫ్ఒ చందాదారులు పిఎఫ్ నిధుల ఉపసంహరణ ప్రక్రియను సులభతరం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. ఇందులో భాగంగా ఎటిఎం, యూపిఐ ఉపసంహరణ సదుపాయం తీసుకొస్తామని గతంలోనే ప్రకటించింది. పిఎఫ్ సొమ్ము ఉద్యోగులదేనని, ఈ మొత్తాన్ని ఉపసంహరించుకునే ప్రక్రియను సులభతరం చేయాలని చూస్తున్నామని అన్నారు. ఎటువంటి కారణం చూపకుండా 75 శాతం వరకు పిఎఫ్‌ను ఉపసంహరించుకోవచ్చని స్పష్టం చేశారు. ఎటిఎం ద్వారా పిఎఫ్ ఉపసంహరణకు సంబంధించిన ప్రక్రియ కొనసాగుతోందని అన్నారు. 2026 మార్చిలోపు అందుబాటులోకి వస్తుందని తెలిపారు.

ఇపిఎఫ్ఒ ఖాతాలో ఉన్న సొమ్మును ఉపసంహరించుకోవడానికి ఉద్యోగులు ఎన్నో పత్రాలు సమర్పించవలసి వస్తోందని అన్నారు. ఇప్పటికే ఆధార్, యూఎఎన్ అనుసంధానమయ్యాయని గుర్తు చేశారు. పిఎఫ్ ఖాతాను బ్యాంకు ఖాతాకు అనుసంధానం చేయడం ద్వారా డెబిట్ కార్డుతో ఎటిఎంలో ఉపసంహరించుకునే సదుపాయం అందుబాటులోకి తీసుకువస్తామని అన్నారు.

# భారత్ కరెన్సీని దేశంలోకి అనుమతించిన నేపాల్

## రూ.200, రూ.500 నోట్లు తెచ్చుకునే సౌలభ్యం




**ఖాట్మండు, డిసెంబరు 16:** భారత్-నేపాల్ మధ్య ప్రయాణించే వారికి నేపాల్ ప్రభుత్వం శుభవార్త అందించింది. భారత కరెన్సీకి చెందిన రూ.200, రూ.500 నోట్లను తమ దేశంలోకి తీసుకురావడానికి, తీసుకెళ్లడానికి అనుమతిస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. ఈ నిర్ణయం నేపాల్, భారత పౌరులిద్దరికీ వర్తిస్తుంది. కేబినెట్ సమావేశం నేపాల్‌సమాచార మంత్రి జగదీశ్ ఖరేల్ ఈ వివరాలు వెల్లడించారు. భారత రిజర్వ్ బ్యాంక్ (ఆర్బీఐ) నవంబరు 28న జారీ చేసిన నోటిఫికేషన్‌కు అనుగుణంగా ఈ నిర్ణయం తీసుకున్నారు. దీని ప్రకారం, ఇరు దేశాల పౌరులు రూ.25 వేల పరిమితి వరకు ఈ నోట్లను తమ వెంట ఉంచుకోవచ్చు. ఈ నిర్ణయం వల్ల వైద్య చికిత్సల కోసం భారత్‌కు వచ్చే నేపాల్ పౌరులకు, అలాగే నేపాల్‌ను సందర్శించే భారత పర్యాటకులకు, యాత్రికులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని నేపాల్ రాష్ట్ర బ్యాంక్ సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. ఇప్పటి వరకు రూ.100 కంటే ఎక్కువ విలువైన భారత నోట్లను కలిగి ఉండటం నేపాల్‌లో చట్టవిరుద్ధం కావడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారు. 2016 నవంబర్‌లో భారత్ రూ.500, రూ.1000 నోట్లను రద్దు చేసిన తర్వాత నేపాల్ కూడా ఆ నోట్ల వినియోగాన్ని నిషేధించింది. ఆ సమయంలో మార్పిడి కాని సుమారు రూ.5 కోట్ల విలువైన పాత నోట్లు ఇప్పటికీ నేపాల్ బ్యాంకింగ్ వ్యవస్థలోనే ఉన్నాయని అక్కడి సెంట్రల్ బ్యాంక్ గణాంకాలు చెబుతున్నాయి. తాజా నిర్ణయంతో సరిహద్దు ప్రాంతాల ప్రజల దైనందిన కార్యకలాపాలు సులభతరం కానున్నాయి.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.